thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 59 కరీంనగర్ శనివారం, 10 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## మిస్ వరల్డ్ పోటీలు..హైదరాబాద్‌లో భారీ భద్రత

హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. ఈ పోటీలు హైదరాబాద్‌లో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో వందకు పైగా దేశాల నుంచి అతిథులు, ప్రపంచ మోడల్స్, పలు పరిశ్రమలకు చెందిన సినీనటులు కూడా భాగ్యనగరానికి రానున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా సైబరాబాద్ జాయింట్ సీపీ గజారావ్ భూపాల్ హైదరాబాద్‌లో అతిథుల భద్రతకు సంబంధించి పలు కీలక విషయాలను వెల్లడించారు. గజారావ్ భూపాల్ మాట్లాడారు. మిస్ వరల్డ్ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సైబరాబాద్ జాయింట్ సీపీ గజారావ్ భూపాల్ తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఈవెంట్ కొనసాగుతుందని అన్నారు.



# పాకిస్థాన్ ఆర్మీ పరార్..

## బాంబుల మోతతో దద్దరిల్లుతున్న పాక్‌లోని ప్రధాన నగరాలు..

## దడపుట్టిస్తున్న బీఎల్ఏ.. క్వెట్టా నగరం స్వాధీనం..

**ఒకపక్క భారత్ ఆర్మీ దిమ్మతిరిగే షాక్ ఇస్తుండటంతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్థాన్ ఆర్మీ, ఆ దేశ ప్రజలను బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) కోలుకోలేని దెబ్బతీస్తుంది.**

భారత్ - పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఉగ్రమూకలను పెంచిపోషిస్తున్న పాకిస్థాన్ దుస్సాహసానికి ఒడిగట్టింది. గురువారం రాత్రి క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధ విమానాలను మనదేశంపైకి ప్రయోగించింది. సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్ లపైకి వాటిని వదిలింది. అయితే, భారత్ పాకిస్థాన్ సైన్యం దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టింది. జమ్మూకశ్మీర్ లో పౌరులే లక్ష్యంగా పాకిస్థాన్ సైన్యం దాడులు చేస్తోంది. నియంత్రణ రేఖ వెంట గురువారం రాత్రి పాక్ కు చెందిన 50 డ్రోన్లను భారత్ ఆర్మీ కూల్చివేసింది. ఉధంపూర్, సాంబా, జమ్మూ, అఖ్నూర్, నగ్రోటా, పఠాన్ కోట్ ప్రాంతాల్లో వీటిని కూల్చివేసింది. ఎల్70 గన్స్, జడ్ యూ23 ఎంఎం, అధునాతన ఆయుధాలతో డ్రోన్లను భారత్ ధ్వంసం చేసింది. పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతుండటంతో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రంగంలోకి దిగింది. పాకిస్థాన్ కు దిమ్మతిరిగే షాక్ ఇస్తుంది. పాకిస్థాన్ లోని ప్రధాన నగరాలను టార్గెట్ చేసింది. ఇస్లామాబాద్, సియాల్ కోట్, లాహోర్, కరాచీ, పెషావర్, బహవల్ పూర్ లో బాంబుల వర్షం కురిపిస్తోంది. భారత వాయుసేన దెబ్బకు పాక్ ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ఇస్లామాబాద్ లో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇంటి దగ్గరలో బాంబు పేలుడు సంభవించింది. పాక్ ప్రధాని ఇంటి దగ్గర డ్రోన్లతో భారత్ దాడి చేసింది. వెంటనే అలర్ట్ అయిన పాక్ ఆర్మీ.. భారీ భద్రత నడుమ ప్రధాని షరీఫ్ ని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. సురక్షిత ప్రాంతంలోని ఓ బంకర్ లో పాక్ ప్రధాని దాక్కున్నట్లు ప్రచారం జరుగుతుంది. పాకిస్తాన్‌లోని పెషావర్, లాహోర్, కరాచీలో భారత్ సైన్యం బాంబుల వర్షం కురిపిస్తుంది. పాక్ సైనిక స్థావరాలు, ఆర్థిక వ్యవస్థలే లక్ష్యంగా దాడులు చేస్తోంది. కరాచీ పోర్టుపై భారత నేవీ అధికారులు దాడి చేశారు. పాక్‌కు చెందిన మూడు ఫైటర్ జెట్స్‌తో పాటు ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను ధ్వంసం చేశారు.

**బీఎల్ఏ ఆధీనంలోకి క్వెట్టా నగరం..?...** ఒకపక్క భారత్ ఆర్మీ దిమ్మతిరిగే షాక్ ఇస్తుండటంతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్థాన్ ఆర్మీ, ఆ దేశ ప్రజలను బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) కోలుకోలేని దెబ్బతీస్తుంది. కొద్దిరోజులుగా పాకిస్థాన్ ఆర్మీపై బాంబులు వర్షం కురిపిస్తూ హతం చేస్తున్న బీఎల్ఏ.. తాజాగా.. పాకిస్థాన్ లోని మొత్తం ఆరు స్థావరాలలో దాడులు చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. క్వెట్టా, హజరే నగరాలలో కూడా దాడులు చేసినట్లు స్పష్టం చేసింది. బలూచిస్తాన్‌లో మూడింట ఒక వంతును స్వాధీనం చేసుకున్నట్లు బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. స్థానిక కథనాల ప్రకారం, ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్ భూభాగాలకు ఆనుకుని ఉన్న పాకిస్తాన్ పోస్టులను వదిలి పాకిస్థాన్ సైన్యం పారిపోయిందని బీఎల్ఏ తెలిపింది. అయితే, క్వెట్టా నగరాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఒకవైపు భారత్ ఆర్మీ, మరోవైపు బీఎల్ఏ దాడులతో పాకిస్థాన్ ఆర్మీ వణికిపోతుంది. ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో పాకిస్థాన్ లోని పలువురు ప్రముఖులు ఆ దేశాన్ని విడిచి వెళ్లిపోతున్నట్లు సమాచారం.




'ఆపరేషన్ సిందూర్'తో భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పాక్ రెచ్చగొట్టే చర్యలకు దీటుగా బదులిచ్చేందుకు కేంద్రం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అన్ని అత్యవసర వ్యవస్థల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఈ క్రమంలో వరుస భేటీలు జరుగుతున్నాయి. తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ బీఎస్ఎఫ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సీఐఎస్ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లో , విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ కూడా హాజరయ్యారు. కేంద్రమంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. చొరబాటు ఘటనలు చోటుచేసుకుంటున్న తరుణంలో పాక్‌తో సరిహద్దు పంచుకుంటున్న ఆయా రాష్ట్రాలు ఇప్పటికే కీలక చర్యలు చేపట్టాయి. మన దేశంలోకి చొరబాటుకు యత్నించిన పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని పంజాబ్ సరిహద్దు వద్ద బీఎస్ఎఫ్‌కు చెందిన జవాన్లు హతమార్చిన సంగతి తెలిసిందే. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్లున్న పాక్ సరిహద్దును మూసివేశారు. ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే.. కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు.

## చుక్కలు చూపిస్తున్న ఇండియన్ ఆర్మీ

టెక్నాలజీ వాడకం అంటే ఇలా ఉండాలి.. యుద్ధ వ్యూహాలు అంటే ఇలా ఉండాలి.. ఇండియాలో బటన్ నొక్కితే పాకిస్తాన్ లో పేలుడు.. అవును.. ఇప్పుడు ఇండియా ఇలాగే చెలరేగిపోతుంది. పాకిస్తాన్ దేశానికి.. ఆ దేశ ఆర్మీకి చుక్కలు చూపిస్తుంది మన ఆర్మీ. దీనికి కారణం ఏంటో తెలుసా.. హార్పీ డ్రోన్స్.. ఈ డ్రోన్ బాంబ్స్ ద్వారా పాకిస్తాన్ రక్షణ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోంది ఇండియన్ ఆర్మీ. ఇప్పటికే హార్పీ డ్రోన్స్ ప్రమోగం ద్వారా.. పాకిస్తాన్ వైమానిక శాఖ.. ఎయిర్ ఫోర్స్ కు చెందిన రక్షణ వ్యవస్థలను కుప్పకూల్చింది ఇండియా. జస్ట్ 36 గంటల్లోనే.. హార్పీ డ్రోన్స్ ద్వారా 1600 కోట్ల విలువైన పాకిస్తాన్ ఎయిర్ ఫోర్స్ రక్షణ వ్యవస్థలను నాశనం చేసింది ఇండియన్ ఆర్మీ..

**చాలా సింపుల్ గా.. వ్యూహాత్మకంగా..** చాలా చాలా సింపుల్ గా పాకిస్తాన్ ను కోలుకోలేని దెబ్బలు కొడుతుంది ఇండియన్ ఆర్మీ. పాకిస్తాన్ లోని ప్రదేశాన్ని టార్గెట్ ఫిక్స్ చేయటం.. ఆ తర్వాత ఇండియాలోనే ఉండి బటన్ నొక్కటం.. గాల్లోకి రువ్వన హార్పీ డ్రోన్ దూసుకెళ్లటం.. పాక్ లోని రక్షణ వ్యవస్థలను పేల్చేయటం.. అంతే.. పాకిస్తాన్ ఆర్మీ కళ్లు మూసి తెరిచే లోపు ఫినిష్ చేసేస్తోంది ఇండియన్ ఆర్మీ.

**ఏంటీ హార్పీ డ్రోన్స్.. దీని ప్రత్యేకతలు ఏంటీ..?...** హార్పీ డ్రోన్.. 1989లో ఇజ్రాయెల్ తయారు చేసింది. సక్సెస్ అయ్యింది. ఈ తర్వాత నుంచి దీన్ని అప్ డేట్ చేస్తూ.. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత శక్తి వంతమైన డ్రోన్ ఎటాక్ కు మారుపేరుగా మారిపోయింది. ఒక్కసారి ఈ హార్పీ డ్రోన్ గాల్లోకి లేచింది అంటే.. పగలూ రాత్రీ అని తేడా లేదు.. 9 గంటలు నిర్విరామంగా పని చేస్తుంది. హార్పీ డ్రోన్ టార్గెట్ రేంజ్ ఎంతో తెలుసా.. అక్షరాల వెయ్యి కిలోమీటర్లు. ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లో యినా.. ఇది 100 శాతం కచ్చితత్వంతో టార్గెట్ రీచ్ అవ్వటం దీని స్పెషల్. ఈ హార్పీ డ్రోన్.. రంగు ఆధారంగానూ టార్గెట్ రీచ్ అయ్యే విధంగా పని చేస్తుంది. అంతే కాదు ముందుకు, వెనక్కి ఎటు కావాలంటే అటు టార్గెట్ రీచ్ అయ్యేలోపు దిశలను మార్చుకునే వీలుంది. అంతే కాకుండా సెన్సార్లను చేధించుకుని వెళు తుంది. రాడార్ సైతం పసికట్టలేని విధంగా తన టార్గెట్ పూర్తి చేయటంలో హార్పీ డ్రోన్ స్పెషాలిటీ. ఒక్కో హార్పీ డ్రోన్.. 23 కిలోల బరువైన పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. శత్రు దేశాల రాడార్, క్షిపణి, రహస్య స్థావరాలతోపాటు మొబైల్ వ్యవస్థలను స్తంభించజేయగలరు.. అంటే జామర్లుగానే పని చేయగలదు. ఇదీ హార్పీ డ్రోన్ పని తీరు. ఇప్పుడు పాకిస్తాన్ దేశంలోని వైమానిక రక్షణ వ్యవస్థలను కుప్పకూల్చటంలో ఇండియా ఈ డ్రోన్లను ఉపయోగిస్తుంది. డ్రోన్లకు బాంబులు అమర్చటం.. ఇండియాలో బటన్ నొక్కటం.. పాకిస్తాన్ దేశంలో టార్గెట్ రీచ్ కావటం.. 48 గంటలుగా ఇండియా ఈ డ్రోన్ల సాయంతోనే.. పాకిస్తాన్ దేశానికి చుక్కలు చూపిస్తుంది.. ఇండియన్ ఆర్మీ చెలరేగిపోతుంది.. పాకిస్తాన్ కకావికలం అవుతుంది.







# దేగకన్ను వేయండి

## భారత్ - పాక్ వార్.. తెలుగు రాష్ట్రాల్లోని ఆ ప్రాంతాల్లో హైఅలర్ట్

హైదరాబాద్, మే 9: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ తెలుగు రాష్ట్రాల్లోని 14 ప్రాంతాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. తెలంగాణలోని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, కూకట్‌పల్లి, నాంపల్లి, హైదరాబాద్ సెంట్రల్ బస్‌స్టేషన్, ట్యాంక్‌బండ్‌తో పాటు ఏపీలోని తిరుమల, విశాఖ ఆర్కే బీచ్, విజయవాడ రైల్వేస్టేషన్, విజయవాడ బస్‌స్టాండ్, ఎంజీ రోడ్‌లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కేంద్రం సూచించింది. హైదరాబాద్ అంతా కూడా అలర్ట్ జోన్‌లో ఉంది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ కొనసాగుతోంది. డీజీ స్థాయి అధికారి హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పర్యవేక్షణలోనే సూచనలు వెళ్తున్నాయి. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌లను నమ్మవద్దని పోలీసులు, ప్రభుత్వం ఇచ్చే అధికారిక సమాచారాన్నే నమ్మాలని పోలీసులు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని ఆరు హైఅలర్ట్ జోన్లలో ఆక్టోపస్, లా అండ్ అండ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాయి. పాక్ దాడుల నేపథ్యంలో టీటీడీ అధికారులను కేంద్ర హోంశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. తిరుమల్లో తీసుకువాల్సిన భద్రతా చర్యలపై టీటీడీ అధికారులకు కేంద్ర హోం శాఖ అధికారులు పలు సూచనలను చేశారు. కేంద్రం ఆదేశాలు మేరకు తిరుమల్లో భద్రతను టీటీడీ మరింత పటిష్టం చేసింది. మరోవైపు భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రాలను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అప్రమత్తం చేస్తోంది. అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ లేఖ రాసింది. అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను సమర్థవంతంగా అమలు చేయడానికి పౌర రక్షణ నిబంధనల ప్రకారం అత్యవసర అధికారాలను ఉపయోగించాలని ఆదేశించింది.

అలాగే దేశ వ్యాప్తంగా అన్ని పోర్టుల్లో భద్రత పెంచారు. భద్రతను రెండో లెవల్‌కు పెంచుతూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. భద్రతా పెంపు ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయని షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ తెలిపారు. పోర్టులు, షిప్పులు, టర్మినల్స్‌లో కేంద్రం భద్రతను పెంచింది.

**స్టేషన్లలో భద్రత పెంచాం: సెంట్రల్ రైల్వే సిపిఆర్వో శ్రీధర్** : భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో భద్రత పెంచామని సెంట్రల్ రైల్వే సీపీఆర్వో శ్రీధర్ అన్నారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఉద్యోగుల సెలవులను రద్దు చేశామన్నారు. ఆర్పీఎఫ్, ఇంటెలిజెన్సీ పోలీసుల నిఘా పెంచామని తెలిపారు.

అత్యవసరమైతే తప్ప ప్రయాణాలను రద్దు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే నుంచి గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్ రూట్లల్లో రైళ్ళు యథావిధిగా నడుస్తున్నాయని అన్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్‌పై ప్రత్యేకంగా నిఘా పెట్టామని శ్రీధర్ వెల్లడించారు.




భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని గురువారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 300 నుంచి 400 డ్రోన్లతో పాక్ ఈ దాడులకు పాల్పడినట్లు భారత సైన్యం తెలిపింది. పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోందని వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచార సేకరణే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం తుర్కియేకు చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిసిందన్నారు. "గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగిన పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంట ఉల్లంఘనకు పాల్పడుతూ దాడులకు తెగబడింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. పాకిస్థాన్ నుంచి 300 నుంచి 400 డ్రోన్ల వరకు వచ్చాయి. వీటిలో అనేక డ్రోన్లను కూల్చేశాం. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం. ఈ దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుంది. ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా పాక్ దాడులు చేస్తోంది. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాక్ ప్రయత్నిస్తోంది. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి పౌర విమానాలకు గగనతలాన్ని మూసివేయలేదు. కరాచీ, లాహోర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తూనే ఉన్నాయి. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని తెలిసీ.. పౌర విమానాలను పాకిస్థాన్ రక్షణ కవచంగా వాడుకుంటోంది. ఇది భారత్-పాక్ మధ్య అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో వెళ్లే విమానాలతోపాటు అక్కడి పౌర విమానాలకు సురక్షితం కాదు. అంతర్జాతీయ విమానాలను దృష్టిలో ఉంచుకొని భారత వాయుసేన పూర్తి సంయమనంగా వ్యవహరించింది" అని రక్షణశాఖ ప్రతినిధులు కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు వెల్లడించారు.




## భారత్-పాక్ యుద్ధం.. తెలంగాణ కాంగ్రెస్ కీలక నిర్ణయం

హైదరాబాద్ : పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సైనిక దాడి నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఒక నెల వేతనం విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. విరాళం ఇచ్చే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్చించారు. సీఎం సూచన మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించి ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించనున్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. మన భారత గడ్డ మీద పర్యాటకులను చంపిన తీవ్రవాదులను ఏరివేతే లక్ష్యంగా దేశ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ టార్గెట్ విజయవంతం అయ్యేందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కీలక ఆదేశాలు జారీ చేశారు. భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని మన రాష్ట్రంలో ఉన్న ప్రతి దేవాలయంలో పూజలు చేయాలని మంత్రి ఆదేశించారు. ఇంతటి సంక్లిష్టమైన సమయంలో భారత ఆర్మీకి అంతా అండగా నిలవాల్సిన సందర్భమన్నారు. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ రెండో దాడి విజయవంతం అవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. మన ఆర్మీ బలగాలు సరిహద్దులో పెద్ద ఎత్తున పోరాడుతున్న సమయంలో వారి క్షేమం కోరి అంతా పూజలు చేయడం సందర్భోచితమని మంత్రి కొండా సురేఖ అన్నారు. తీవ్రవాదాన్ని యావత్ భారతమంతా ఉక్కు పిడికిలితో ఎదుర్కొన్నదన్నారు. ఈ సమైక్యత దేశ భద్రత విషయంలో రానున్న రోజుల్లో కూడా ఉంటుందన్నారు. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా.. ఎక్కడ ఉన్నా కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మన దేశ పౌరుల మీద ఇటీవల కాశ్మీర్‌లో జరిగిన దాడికి నిరసనగా ఇండియన్ మిలటరీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అందరూ స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ మంత్రిగా కాదు, ఇంతటి గొప్ప దేశ పౌరురాలిగా ఈ చర్యపై చాలా సంతోషంగా భావిస్తున్నట్లు తెలిపారు. పుల్వామాలో మనం కోల్పోయిన వీర సైనికులను తిరిగి తీసుకురాలేమని.. వారి త్యాగం శాశ్వతమన్నారు. మనమున్నంత కాలం వారిని స్మరించుకుంటామన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తలెత్తి నిలిచిందన్నారు. ఏకత్వంతో, శక్తితో, నిశ్శబ్దమైన సంకల్పంతో మనల్ని ప్రపంచం నిలబెట్టిందని చెప్పుకొచ్చారు. ఇది కేవలం ప్రతిస్పందన కాదని.. ఒక ప్రతి సమాధానమని వెల్లడించారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో చాలా మర్యాదగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భద్రత విషయంలో అందరినీ కలుపుకుపోవాలని.. ఎందుకంటే ఇది దేశానికి సంబంధించిన విషయమన్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎటువంటి రాజకీయం చేయాలని అనుకోవడం లేదని... చేయదు కూడా అని స్పష్టం చేశారు. తాము భారత ఆర్మీకి పూర్తి మద్దతుగా ఉన్నామని.. రానున్న రోజుల్లో కూడా ఉంటామన్నారు. అందుకే ఈరోజు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గుడిలో, దేవాలయాలో ఆర్మీకి మంచి జరగాలని పూజలు చేస్తున్నామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.





## ఇండియన్ ఆర్మీకి అండగా ఉందాం

ఖమ్మం, మే 9: భారత్ – పాకిస్థాన్ యుద్ధంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. పాకిస్థాన్‌తో భారతదేశం పోరాడుతోందన్నారు. ఇండియన్ ఆర్మీ విరోచితంగా పోరాడుతున్నారని కొనియాడారు. భారత సైన్యానికి మద్దతుగా అండగా నిలుద్దామని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. ఈరోజు (శుక్రవారం) జిల్లాలో పర్యటించిన కేటీఆర్.. మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ దివంగత రాయల శేషగిరిరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అనంతరం తల్లాడ మండలం మిట్టపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... మాజీ డీసీఎంఎస్ రాయల శేషగిరిరావు ఘనంగా నివాళులర్పించారు. శేషగిరి రావు రైతుల కోసం పోరాడారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాకు మూడు మంత్రి పదవులు వచ్చాయని.. కానీ జిల్లాకు జరిగిన ప్రయోజనం ఏంటి అని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం.. ఎన్నికలలో గెలవటానికి అఫిడవిట్లు రాసి, బాండ్లు రాసి ప్రమాణాలు చేశారని.. ఆ ప్రమాణాలు ఏమయ్యాయని నిలదీశారు. కేసీఆర్ అమలు జరిపిన పథకాలన్నీ ఎత్తేశారని మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ చేయలేక పోయారని విమర్శించారు. ఆడబిడ్డలకు డబ్బులు, తులం బంగారం అన్నారు ఏది ఏమైందని అడిగారు. ఇప్పుడు బాగుందా మార్పు అని అడిగారు. ఖమ్మం జిల్లాలో మార్పు మార్పు అని కాంగ్రెస్‌కు గుద్దారు ఇప్పుడు ఏమైంది.. ఎక్కడ మార్పు అని నిలదీశారు. 'మీకు కొద్దిగా మాపై బోర్ కొట్టింది. వాళ్లకు ఓట్లు వేశారు. ఇప్పుడు ఏమైంది ' అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలేది లేదని.. నిలదీసి తీరతామని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అంత నికృష్ట ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. 'ఢిల్లీలో అపాయింట్‌మెంట్స్ ఇవ్వటం లేదు. చెప్పులు ఎత్తుకుపోయే వాడిగా, దొంగలా చూస్తున్నారట. దొంగను దొంగలా చూడక ఎలా చూస్తారు' అంటూ ఎద్దేవా చేశారు. అంబేద్కర్ కూడా ఇటువంటి దుర్మార్గులు వస్తారని ఊహించి ఉండరన్నారు. తొందరలోనే ప్రజలకు మంచి అవకాశం వస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని.. తామంతా సీరియస్‌గా పని చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేద్దామని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు అన్నీ గెలవాలని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. బహిరంగ సభలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. సరిహద్దులలో విరోచితంగా పోరాడుతున్న భారత సైనికులకు సెల్యూట్ చేశారు. భారత సైన్యానికి అండగా నిలుద్దామన్నారు. మాజీ డీసీఎంఎస్ రాయల శేషగిరిరావుకు రవిచంద్ర నివాళులర్పించారు.

## భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతలు.. తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

దిల్లీ: భారత్–పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల దృష్ట్యా దిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సరిహద్దు రాష్ట్రాల్లో ఉంటున్న, చిక్కుకున్న తెలంగాణ వాసులకు సాయం చేసేందుకు, సమాచారం ఇచ్చేందుకు, వారికి అవసరమైన సేవలు అందించేందుకు ఈ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఎలాంటి సాయం కావాలన్నా కంట్రోల్ రూమ్ నంబర్ 011–23380556ను సంప్రదించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ నంబర్‌తో పాటు రెసిడెంట్ కమిషనర్ ప్రైవేటు సెక్రటరీ, లైజన్ హెడ్ నంబర్ 98719–99044, రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకుడి నంబర్ 99713–87500, తెలంగాణ భవన్‌లో లైజన్ ఆఫీసర్ నంబర్ 96437–23157, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ నంబర్ 99493–51270ను సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.



## సరిహద్దుల్లో ఉద్రిక్తతలు.. గుజరాత్ సీఎంకు మోదీ ఫోన్

భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోన్న పాక్.. ఇప్పుడు మనపై రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నిస్తోంది. వీటిని భారత బలగాలు సమర్థంగా తిప్పికొడుతున్నాయి. ఈ పరిణామాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. తాజాగా ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ భద్రతా సన్నద్ధతపై ప్రధాని ఆరాతీసి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భద్రతాపరంగా సున్నిత ప్రాంతాలైన కచ్, బనస్కంతా, పటాన్, జామ్‌నగర్‌లో పౌరుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి అడిగారు. ఇవన్నీ పాక్‌తో సరిహద్దు కలిగిన ప్రాంతాలు. ప్రస్తుతం శత్రు దేశం నుంచి దాడుల ముప్పు పొంచి ఉన్న వేళ.. సరిహద్దు జిల్లాల్లో యంత్రాంగం అప్రమత్తమైంది. ఎప్పటికప్పుడు అధికారులు ప్రజలకు సూచనలు జారీ చేస్తున్నారు.

**కేంద్రంలో వరుస సమావేశాలు..** మరోవైపు, ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం కీలక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే రక్షణ శాఖ ఉన్నత స్థాయి భేటీ నిర్వహించగా.. ఆర్థిక, హోం, ఆరోగ్య శాఖల్లోనూ వరుస సమావేశాలు జరుగుతున్నాయి. తమ మంత్రి వర్గంలోని ఉన్నతాధికారులతో ఆయా కేంద్రమంత్రులు భేటీ అయ్యారు. సరిహద్దు రాష్ట్రాల్లో పరిస్థితులు, ఆర్థికపరంగా సన్నద్ధత, ఆరోగ్య సేవల అందుబాటు తదితర అంశాలపై చర్చించారు.



## హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలపై యుద్ధం నీడలు

హైదరాబాద్: భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీల నిర్వాహక సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆయా దేశాల నుంచి వచ్చిన వారందరి భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. అయితే, హైదరాబాద్‌లోని వ్యూహాత్మక సంస్థల భద్రత, సామాన్య ప్రజల రక్షణకు అత్యంత ప్రాధాన్యమివ్వాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మిస్ వరల్డ్ పోటీలకు మూడు వారాలపాటు పూర్తిస్థాయి భద్రత పెద్ద సవాలే. ఈ నేపథ్యంలో కేంద్రం అభిప్రాయం ప్రకారం నడుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. గురువారం నాటి పరిస్థితులను చూసి పాకిస్థాన్‌లో ఉన్న అమెరికా పౌరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. దాంతో మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సైతం పోటీలను కొనసాగిస్తే తలెత్తే సమస్యలపై ఆలోచిస్తోందని, అంతర్జాతీయంగా అభిప్రాయాలను సేకరిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వంతోనూ ఎప్పటికప్పుడు చర్చిస్తోందని తెలిసింది.


**విమాన సర్వీసులపై ప్రభావం..** మిస్ వరల్డ్ వేడుకలకు 116 దేశాల నుంచి అందాల భామలు రావాల్సి ఉండగా.. గురువారం సాయంత్రానికి 109 మంది వచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇంకా స్పాన్సరర్లు, అంతర్జాతీయ మీడియా రావాల్సి ఉంది. కొందరు పోటీల మధ్యలో చేరుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పుడు హఠాత్తుగా విమానాల రూట్ల మార్పు, సర్వీసుల రద్దు ప్రభావం సైతం అందాల పోటీలపై ఉంటుందని భావిస్తున్నారు.

**అవుట్‌డోర్‌లోనే ఎక్కువ..** షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10న ప్రారంభ వేడుకల అనంతరం యువతులంతా 12వ తేదీ నుంచి నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, హైదరాబాద్‌లోని చార్మినార్, లాడ్‌బజార్, వరంగల్‌లోని వేయిస్తంభాల గుడి, రామప్ప ఆలయం, యాదగిరిగుట్ట, పోచంపల్లి, మహబూబ్‌నగర్‌లలో పర్యటించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ప్రాంతాల్లో అందాల భామల పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత కల్పించడమంటే పోలీసులకు పెద్ద సవాలే.




## హైదరాబాద్‌కు మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా.. ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం

హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ నగరం ముస్తాబైంది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా పోటీలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన అందాల భామలు నగరానికి చేరుకున్నారు. 'మిస్ వరల్డ్–2024' విజేతగా నిలిచిన క్రిస్టినా పిస్కోవా (చెక్ రిపబ్లిక్) శుక్రవారం వచ్చారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న క్రిస్టినాకు తెలంగాణ అధికారులు ఘనస్వాగతం పలికారు. కళాకారులు సంప్రదాయ రీతిలో ఆమెను స్వాగతించారు.




## తొమ్మిది నెలల క్రితమే వివాహం.. విషాదంలో శ్రీధర్ కుటుంబం



కామారెడ్డి, మే 9: కర్రెగుట్ట తండాలో జరిగి ల్యాండ్ మైన్ పేలుడులో కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రానికి చెందిన గ్రౌహౌండ్స్ కానిస్టేబుల్ వడ్ల శ్రీధర్ (26) మృతి చెందాడు. శ్రీధర్ మరణవార్త తెలిసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. శ్రీధర్ మృతితో కుటుంబంలో, గ్రామంలో విషాధ ఛాయలు అలముకున్నాయి. నాలుగు సంవత్సరాల క్రితమే శ్రీధర్ ఉద్యోగంలో చేరాడు. శ్రీధర్‌కు తొమ్మిది నెలల క్రితమే శ్రీవాణితో వివాహం జరిగింది. ఇంతలోనే ఈ ఘటన జరగడంతో గ్రామంలో ప్రతీఒక్కరు కంటతడి పెడుతున్న పరిస్థితి.కాగా.. ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు, లంకపల్లి అడవుల్లో తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలింది. ఈ పేలుడులో ముగ్గురు గ్రేహౌండ్స్ పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ఈనెల 7న కూంబింగ్ కోసం పోలీసులు వెళ్లగా నిన్న (గురువారం) తెల్లవారుజామున ఈ పేలుడు సంభవించింది. తెలంగాణకు చెందిన ముగ్గురు గ్రౌహౌండ్స్ పోలీసులు అక్కడికిక్కడే మృతి చెందారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన సందీప్, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన పవన్ కళ్యాణ్, కామారెడ్డి జిల్లా పాల్వంచకు చెందిన శ్రీధర్ ఐఈడీ పేలుడులో ప్రాణాలు కోల్పోయారు. వెంటనే మృతదేహాలను ప్రత్యేక హెలికాప్టర్‌లో ములుగుకు తరలించి.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అంతేకాకుండా ఈ పేలుడు అనంతరం భద్రతా దళాలకు మావోయిస్టులకు మధ్యం కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఆర్ఎస్ఐ రణధీర్ గాయపడగా.. ఆయనను కూడా వెంటనే హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందజేస్తున్నారు. మరణించిన కానిస్టేబుళ్ల మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం హనుమకొండ హెడ్‌క్వార్టర్స్‌కు తరలించారు. మరోవైపు ఈ పేలుడు అనంతరం కూబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలను మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టు కీలక నేతలు హతమయ్యారు. ఎదురుకాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులు మరణించగా.. వారిలో మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న, ఎస్.జెడ్.సీ.మెంబర్ బండి ప్రకాశ్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని ఇంకా పోలీసులు ధృవీకరించలేదు.

## శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు



హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు వచ్చింది. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు అధికారులకు ఈ–మెయిల్ ద్వారా సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది డాగ్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్నారు. ఇది ఫేక్ బెదిరింపు ఈ– మెయిలా? ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పెట్టారనే కోణంలోనూ అధికారులు విచారణ చేస్తున్నారు. మరోవైపు, భారత్– పాక్ సరిహద్దుల్లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేసిన విషయం తెలిసిందే. సీఐఎస్ఎఫ్ బలగాల పర్యవేక్షణను పెంచారు. 24 గంటల పాటు డేగ కళ్లతో విమానాశ్రయానికి భద్రత కల్పిస్తున్నారు. స్థానిక శాంతి భద్రతల విభాగం, ఇంటెలిజెన్స్, ఎస్‌బీ పోలీసుల సమన్వయంతో విమానాశ్రయానికి భద్రత కల్పించారు. విమానాశ్రయం చుట్టూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

## ఏపీ హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘన.. డిప్యూటీ కలెక్టర్‌కు సుప్రీంకోర్టు డిమోషన్

దిల్లీ: కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన అధికారికి సుప్రీం కోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఆయన హోదాను తగ్గిస్తూ కీలక తీర్పును వెలువరించింది. డిప్యూటీ కలెక్టర్ తాతా మోహన్‌రావును ఎమ్మార్వోగా డిమోట్ చేస్తూ జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం తీర్పు వెలువరించింది. గతంలో ఏపీ హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘించిన మోహన్ రావుపై చర్యలు తీసుకోవాలంటూ ఏపీ సీఎస్‌కు ఆదేశాలు ఇచ్చింది. అధికారులు చట్టానికి అతీతులమనే భావన తగదని ఈ సందర్భంగా జస్టిస్ గవాయి ధర్మాసనం వ్యాఖ్యానించింది. గతంలో గుంటూరు తహసీల్దారుగా పనిచేసిన తాతా మోహన్‌రావుకు గుంటూరులోని ఒక ప్రాంతంలో ఆక్రమణలను తొలగించవద్దని 2013 డిసెంబర్ 11న హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, హైకోర్టు ఆదేశాలను ఆయన ఉల్లంఘించి 2014లో ఆక్రమణల్ని తొలగించారు.

దీంతో ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన మోహన్ రావుకు హైకోర్టు రెండు నెలలు జైలు శిక్ష విధించింది. హైకోర్టు తీర్పును ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన మోహన్‌రావుకు తహసీల్దార్‌గా డిమోషన్ కల్పిస్తూ ఆదేశాలు జారీచేసింది.

చురకలు

శనివారం 10 మే 2025

# బహుముఖ ప్రజ్ఞాశాలి టి.ఎన్.ఆర్. - మే 10...తుమ్మల నరసింహారెడ్డి వర్ధంతి



టీఎన్ఆర్ గా జన బాహుళ్యానికి చేరువై, అతి తక్కువ సమయంలో ప్రజాదరణ పొందిన బహుముఖ ప్రజ్ఞుడు తుమ్మల నరసింహారెడ్డి. దర్శకుడు కావాలనుకుని సినీ పరిశ్రమలో కాలూని, కొన్నాళ్లు రచయితగా ఎల్బీ శ్రీరాం వద్ద పని చేసి, తర్వాత మీడియా లోకి వెళ్లి, యూట్యూబ్‌లో తనదైన శైలిలో ఇంటర్వ్యూలు చేస్తూ గుర్తింపు పొందడమే కాకుం డా, ఒక నటుడిగా అవకాశాలు చేజిక్కిం చుకుని, తెలుగు ప్రేక్షకులకు చేరు వైన ప్రతిభాశాలి ఆయన. టి. ఎన్. ఆర్ అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఐడ్రీమ్ మీడియాలో "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టిఎన్ఆర్. టి.ఎన్.ఆర్.గా పేరొందిన తుమ్మల నరసింహా రెడ్డి (1976 జనవరి 9 - 2021 మే 10) తెలుగు ఇంటర్వ్యూ హోస్ట్, సినిమా జర్నలిస్టు, నటుడు. "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టి ఎన్ ఆర్" పేరిట ఆయన నిర్వహించిన ఇంటర్వ్యూ సీరీస్ ద్వారా ప్రాచు ర్యం పొందాడు. పలువురు తెలుగు సినీ నటీనటులు, సాంకేతిక నిపుణులు, ఇతర ప్రముఖులను "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టిఎన్ఆర్ " షోలో భాగంగా ఇంటర్వ్యూ చేయ గా వాటిలో పలు వీడియోలు యూట్యూబ్‌లో విశేష ప్రాచుర్యం, ప్రేక్షకుల ఆదరణ, అగణిత వ్యూలు పొందాయి. తుమ్మల నరసింహారెడ్డి 1976 జనవరి 9న జన్మించాడు. స్వగ్రామం తెలంగాణ లోని నూతన మంచిర్యాల జిల్లా పావునూరు. తండ్రి రాజిరెడ్డి గ్రామ సర్పంచ్ గా మూడు సార్లు ఎన్నికైనాడు. హైదరాబాద్‌లోనిశ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో, వివేకవర్ధిని కళాశాలలో చదువుకుని డిగ్రీ పొందాడు. టి.ఎన్.ఆర్. దర్శకత్వంపై ఆసక్తితో డిగ్రీ పూర్తికాగానే సినిమా రంగం లోకి వచ్చాడు. 1992లో దేవదాస్ కనకాల వద్ద దర్శకత్వం గురించి నేర్చుకున్నాడు. సినిమా రచయిత ఎల్. బి. శ్రీరామ్ వద్ద సహాయ రచయితగా పని చేశాడు. ఆ తర్వాత టెలివిజన్ జర్నలిస్టుగా పలు టెలివిజన్ ఛానళ్ళలో పని చేశాడు. ఈటీవీలో ప్రసారమైన నేరాలు - ఘోరాలు కార్యక్రమానికి సంబంధించి కొన్ని ఎపిసోడ్స్ కు దర్శకత్వం వహించాడు. ఎన్ టీవీలో క్రైమ్ స్టోరీస్, క్రిమినల్ వంటి కార్యక్రమాలు రూపొందించి నిర్వహించాడు. ఐడ్రీమ్ మీడియాలో "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టిఎన్ఆర్" అన్న ఇంటర్వ్యూ సీరీస్‌లో ఇంటర్వ్యూయర్‌గా తెలుగు సినిమా ప్రముఖులను ఇంటర్వ్యూలు చేశాడు. ఈ కార్య క్రమం లోని పలు ఇంటర్వ్యూలకు యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూలు లభించా యి. 2018 అక్టోబరు నాటికే టిఎన్ఆర్ ఇంటర్వ్యూలకు కోట్ల వీక్షణలు లభించినట్టు పత్రికా కథనాలు. మొదట్లో దర్శకుడు తేజతో చేసిన ఇంటర్వ్యూ వైరల్ కావడంతో "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టిఎన్ఆర్" ప్రారంభమైంది. రామ్ గోపాల్ వర్మ, కృష్ణ వంశీ, విజయ్ దేవరకొండ, మోహన్ బాబు వంటి సినిమా ప్రముఖులతో టిఎన్ఆర్ చేసిన ఇంటర్వ్యూలు బాగా ప్రాచుర్యం పొందాయి. 4 - 8 గంటల సుదీర్ఘ మైన సమయం ప్రేక్షకుల ఆసక్తి కోల్పోకుండేలా టి.ఎన్.ఆర్. పలువురు సినిమా ప్రముఖులను ఇంటర్వ్యూలు చేశాడు. కృష్ణవంశీ, తనికెళ్ళ భరణి వంటివారిని 4 గంటల పైచిలుకు ఇంటర్వ్యూలు చేశాడు. తాను గురువుగా భావించే ఎల్. బి. శ్రీరామ్ తో చేసిన ఇంటర్వ్యూ ఏకంగా 8 గంటల పాటు చేసి రికార్డు సృష్టించాడు. ఇంటర్వ్యూయర్‌గా ప్రాచుర్యం పొంది, తన ప్రతిభను బహిర్గత పరిచాక, ఆయనకు నటన అవకా శాలు పెరిగాయి. నేనే రాజు నేనే మంత్రి, జార్జ్ రెడ్డి, సుబ్రహ్మణ్య పురం, ఉమామహేశ్వర ఉగ్రరూ పస్య, జాతిరత్నాలు, ది రోజ్ విల్లా, నేడే విడుదల వంటి సినిమాల్లో టి.ఎన్.ఆర్. పాత్రలు పోషించాడు. కమెడియన్ సత్య హీరోగా సందీప్ కిషన్ నిర్మాతగా వివాహ భోజనంబు సినిమాలోనూ నటించాడు టిఎన్ఆర్. సర్కస్ సత్తిపండు, జై భజరంగ్ దళ్ , పిట్టల దొర వంటి ఎన్నో సినిమా లకు సహాయక దర్శకుడిగా పని చేశాడు. దర్శకుడిగా ఒక మంచి విలువ ఉన్న సినిమాను తీయాలని మదిలో తలచి, అందుకు స్క్రిప్ట్ కూడా రెడీ చేసుకుని, ఆపై కొందరు నటీనటులతో సంప్రదింపులు కూడా జరిపి, కరోనా పాజిటివ్ రావడంతో హాస్పిటల్ లో చేరి, దర్శకునిగా రాణించాలనే కోరిక తీర కుండానే చివరి శ్వాస వరకు పోరాడుతూ కన్ను మూశాడు. సిని మాలలో మంచి మంచి పాత్రలు వేస్తూ తనకంటూ నటుడిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించు కుంటున్న సమయం లోనే కోవిడ్ కోరలకు బలై, ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందు తూ, కేవలం 46 ఏళ్ళకే టిఎన్ఆర్ 2021 మే 10న తనువు చాలించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# ధర్మపురి నరసింహునికి అన్నకూటోత్సవం

ధర్మపురి క్షేత్రస్థ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థా నంలో నిర్వహిస్తున్న స్వామివారి నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్ర వారం ప్రధానాలయమైన లక్ష్మీ సమేత యోగానంద నరసింహాలయంలో అన్నకూటోత్సవ కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. స్వామి వారి గర్భాలయాన ఎదురుగా కూటం అన్నం ఉంచి, ఆరగింపు జరిపితే, స్వామి వారు సకల ప్రాణులకు ఆహారం ప్రసాదిస్తారని శాస్త్ర వచనం. ఆగమ శాస్త్రానుసారం ఏడాది కోమారు నవరాత్రి దినాలలో జరిపే ఈ అరుదైన కార్యక్రమం సందర్భంగా ఉప ప్రధానార్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్య చొరవతో, దేవస్థానంలో ప్రత్యేకించి తయారు చేయించిన అన్న నివేదనలను అర్చకులు శ్రమకోర్చి గంపలలో తెచ్చి, ప్రధానాలయంలో స్వామి సన్నిధిన అన్న కూటం ఏర్పాటు చేసి, వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నివేదించారు.



అనంతరం భక్తులకు ప్రసాదాల రూపంలో నైవేద్యాలను అందజేశారు. ఏసీ ఈఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తల మండలి సభ్యులు, వేదవిదులు బొజ్జా రమేశ్ శర్మ, సంపత్ కుమార్, రాజ గోపాల్ శర్మ, తాడూరి బాల కిష్టయ్య శర్మ, బలరాం శర్మ, పాలెపు దత్తాత్రి శర్మ, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**




పహల్గాం ఉగ్రదాడి తర్వాత అన్నివైపుల నుంచి పాకిస్థాన్‌ను భారత్ దిగ్బంధించడం మొదలుపెట్టింది. ఆర్థిక, దౌత్య, వాణిజ్యరంగాల్లో దానిపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచింది. ఆ దేశం ఒత్తిడిని ఎదుర్కొనే క్రమంలో ఉండగానే ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని.. సైనిక చర్యను కూడా చేపట్టింది. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో పాక్ ప్రేరిత ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకొన్నారు. ఈక్రమంలో భార్యలను భర్తలను వేరు చేసి.. వారి మతం అడిగి కాల్చిచంపారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించింది.

**దౌత్యంతో కొట్టి..** అదే సమయంలో సౌదీ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ అర్ధంతరంగా దానిని రద్దు చేసుకొని 23 తేదీన భారత్ చేరుకొన్నారు. ఆయన పీఎంవోకు కూడా వెళ్లకుండా.. ఎయిర్‌పోర్టులోనే ఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉగ్రదాడిని ప్రభుత్వం ఎంత సీరియస్‌గా తీసుకొందో.. ఈ పరిణామాలు చెప్పాయి. పాక్‌తో ఉన్న సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసి.. ఆ దేశానికి ఊహించని షాక్ ఇచ్చారు. నీటి విడుదలను బాగా తగ్గించేశారు. ఆ దేశ జీడీపీలో దాదాపు 24శాతం ఈ జలాల నుంచే లభిస్తుంది. ఇవే కాకుండా పాక్ సైనిక, రవాణా, పౌర విమానాల కోసం భారత్ గగనతలాన్ని మూసివేసింది. ఇక పాక్ దేశీయుల వీసాలను రద్దు చేసి.. దేశాన్ని వీడాలని ఆదేశించారు. అట్టారీ-వాఘా బోర్డర్ గేట్లను మూసేసింది. దీంతోపాటు పాక్ నటుడు ఉన్న సినిమా రిలీజ్‌ను ఆపేశారు. అంతేకాదు.. పాక్ నటీనటులు, క్రికెటర్లు, రాజకీయ నాయకులు సహా పలువురి యూట్యూబ్, ఇన్‌స్టా ఇతర సోషల్ మీడియా ఖాతాలను భారత్‌లో బ్లాక్ చేశారు. వీటిలో మహీరా ఖాన్, హానియా ఆమీర్, అలీజఫర్ వంటి వారి ఖాతాలు ఉన్నాయి.

**వాణిజ్యంపై దెబ్బ...** పాక్‌తో వాణిజ్య సంబంధాలను భారత్ పూర్తిగా తెంచుకొంది. మే నెల ఆరంభంలో పాక్ నుంచి దిగుమతులు, ఆ దేశానికి ఎగమతులను నిలిపివేసింది. పాక్ నౌకలు మన ఓడ రేవుల్లోకి రాకుండా నిషేధం విధించింది. ముఖ్యంగా దేశానికి ఎగుమతి అయ్యే ఔషధాలపై కూడా ఆంక్షలు విధించింది. చాలా ఏళ్లుగా ఇరుదేశాల మధ్య నేరుగా వాణిజ్యం జరగకపోయినా.. యూఏఈ, సింగపూర్, ఇండోనేసియా, శ్రీలంక వంటి దేశాల నుంచి మనకు ఎగుమతులు చేసేది. పండ్లు, ఎండు కర్జూరాలు, టెక్స్‌టైల్స్, రాక్ సాల్ట్, లెదర్ వస్తువులు ఉండేవి. వీటి విలువ 500 మిలియన్ డాలర్ల వరకు ఉ ండొచ్చు. ఈ మార్గంలో భారత్‌లోకి పాక్ సరకులు రాకుండా నట్లు బిగించింది. ఐఎంఎఫ్ నుంచి పాక్‌కు లభించాల్సిన రుణాన్ని పునఃసమీక్షించాలని భారత్ ఒత్తిడి పెంచేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది.

**ఉగ్రవాదులకు శిక్ష ఖాయమని ముందే చెప్పి..** ఇటీవల బిహార్‌లో ఓ బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఉగ్రవాదులకు ఊహించని రీతిలో శిక్ష ఉంటుందని పాక్‌ను హెచ్చరించారు. దీంతో సైనిక చర్య ఖాయమన్న విషయాన్ని ఆయన తేల్చేశారు. ఆ మర్నాడే జరిగిన ఆల్‌పార్టీ మీటింగ్‌లో.. అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వం తీసుకోబోయే చర్యలకు మద్దతు తెలిపాయి. మరోవైపు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని పాక్ దళాలు సరిహద్దుల్లో కాచుకు కూర్చొన్నాయి. ఈ క్రమంలో వరుసగా సైనికాధికారులు, మంత్రులతో జరిగిన భేటీలు దాయాది దేశ నాయకుల్లో ఆందోళన పెంచాయి. దీంతో పాక్ నేతలు అణు బెదిరింపులకు దిగారు. అయినా భారత్ మౌనంగా తన ఏర్పాట్లు తాను చేసుకొంటూ వెళ్లింది. అమెరికా, రష్యా ఫ్రాన్స్, సౌదీ, యూఏఈ వంటి కీలక మిత్ర దేశాలకు పరిస్థితిని వివరించింది. ఐరాస భద్రతా మండలిలో కూడా పాక్ ఎటువంటి మద్దతు రాకుండా దౌత్యం నెరిపింది. దేశ ప్రజల కోసం వార్ మాక్ డ్రిల్స్‌ను మే7వ తేదీన నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇవి మొదలుకావడానికి కొన్ని గంటల ముందే పాక్ ఊహించనివిధంగా దాడి చేసి 9 ఉగ్ర స్థావరాలను మట్టుబెట్టింది.

# పాక్ దిమ్మదిరిగింది..సొంత జెండా ఎత్తిన బలూచిస్తాన్



సరైన టైమ్ టైమింగూ లేకుండా పెద్ద దేశం అయిన భారత్ తో పెట్టుకుంటే కథ ముగిసిపోతుంది అన్నది పాకిస్థాన్ కి తెలిసి వచ్చేలోగా పుణ్యకాలం ముగుస్తోంది. పాకిస్థాన్ అంతర్గత సమస్యలతో సతమతం అవుతోంది. బలూచిస్తాన్ సొంత జెండా ఎత్తింది. తమకు సొంతంగా ఉండాలని స్వతంత్ర్యంగా తాను వ్యవహరించాలని చాలా కాలంగా కోరుతూ వస్తున్న బలూచిస్తానీయులు ఇపుడు సరైన సమయం చూసి మరీ పాక్ కి భారీ షాక్ ఇస్తున్నారు. భారత్ వంటి బడా దేశం ఒక వైపు ఆపరేషన్ సింధూర్ పేరిట పాక్ ని చితక్కొడుతూంటే ఇదే సందు అనుకుని బలూచిస్తాన్ తన సత్తా చూపిస్తోంది. దశాబ్దాల తన కలను నెరవేర్చుకుంటోంది. బలూచిస్తాన్ లో తాజా సన్నివేశం ఏమిటి అంటే పాకిస్థాన్ జెండాలు ఎక్కడా కనిపించడం లేదు. అదే ప్లేస్ లో బలూచిస్తాన్ జెండాలను పెట్టి మరీ వారు తమ సొంత ప్రతిపత్తిని చాటుకుంటున్నారు. ఒక వైపు భారత్ చేతిలో చావుదెబ్బ తింటున్న పాకిస్థాన్ కి ఇది చాలదు అన్నట్లుగా బలూచిస్తాన్ నుంచి భారీ ఎటాక్ ఎదురవుతోంది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ దాడులు ముమ్మరం చేయడంతో పాక్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

అంతే కాదు తమ దేశానికి దౌత్య కార్యాలయాలు మార్చాలని ప్రపంచ దేశాలకు బలూచ్ లిబరేషన్ ఆర్మీ విజ్ఞప్తి చేయడం కూడా సంచలనంగా మారుతోంది. ఇక చరిత్ర చూస్తే పాకిస్థాన్ నుంచి వేరు పడిపోవాలని తమకు ప్రత్యేకంగా ఒక దేశం కావలాని బలూచ్ లిబరేషన్ ఆర్మీ 1971 నుంచి సుదీర్ఘ పోరాటం చేస్తూ వస్తోంది. ఈ రోజుకు అది పక్వానికి వచ్చింది. ఎంతలా అంటే అక్కడ పాకిస్థాన్ ఆధిపత్యం చెల్లడం లేదు. భారీ సైనికుల పహారాతో తప్ప పాక్ పాలకులు ఆ గడ్డ మీద అడుగు పెట్టలేరు. ఇక ఎవరైనా అక్కడికి పాక్ అధిపత్యం చూపాలని వెళ్తే తిరిగి రాని పరిస్థితి ఉంది అని అంటున్నారు. ఒక్క ముక్కల్లో చెప్పాలీ అంటే బలూచిస్తాన్ పాక్ నుంచి ఏనాడో చేజారింది. ఇపుడు భారత్ పాక్ మీద తడాఖా చూపిస్తూండడంతో వేయి ఏనుగుల బలం వచ్చిన బలూచ్ లిబరేషన్ ఆర్మీ తమకంటూ కొత్త దేశాన్ని ప్రకటించుకోవడానికి ఇదే సరైన సమయం అని భావిస్తునారు. పలు ప్రాంతాల్లో పాకిస్థాన్ జెండాలు దించివేత, బలూచ్ జెండాల ఆవిష్కరణలల్తో బలూచ్ లిబరేషన్ ఆర్మీ దూకుడు చేస్తోంది. ఇక చూస్తే కనుక బలూచిస్తాన్ లో ఎటు చూసినా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు వినిపిస్తున్నాయి అంతే కాదు బలూచిస్థాన్ స్వాతంత్రానికి అనుకూలంగా నినాదాలు చేస్తున్న దృశ్యాలు సైతం కనిపిస్తున్నాయి. ఇవన్నీ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇక తాజా పరిణామాలు చూస్తే కనుక ప్రపంచ దేశాలు పాకిస్థాన్ నుంచి తమ దౌత్య కార్యాలయాలను ఉపసంహరించుకుని కొత్తగా ఆవిర్భవిస్తున్న బలూచిస్థాన్ దేశానికి మార్చాల్సిన సమయం ఆసన్నమైంది. అని కూడా బలూచ్ లిబరేషన్ ఆర్మీ ట్వీట్ చేయడం సనలనం రేపుతోంది. తాము ప్రపంచ దేశాలకు తమది కొత్త దేశంగా ఉందని దానిని గుర్తినాలని పిలుపునిస్తున్నట్లుగా బలూచ్ లిబరేషన్ ఆర్మీ వెల్లడిస్తోంది ఇక పాకిస్థాన్ సైనికులే లక్ష్యంగా చేసుకుని బలూచ్ లిబరేషన్ ఆర్మీ వారి తొక్క తీసి తోలు కడుతోంది. దొరికిన వారిని దొరికినట్లుగా హతమారుస్తోంది. భారత్ పాక్ మీద ఆపరేషన్ సింధూర్ పేరుతో దాడులు చేయడంతో బలూచిస్తాన్ లో సాధారణ పౌరులకు కూడా ఎక్కడ లేని ధైర్యం వచ్చినట్లుగా ఉంది. వారు సైతం వీధులలోకి వచ్చి పాక్ జెండాలని చించేసి తగలబెడుతున్నారు. ఇవన్నీ చూస్తూంటే నేడో రేపో బలూచిస్తాన్ సొంత దేశంగా ప్రకటించడానికి సన్నాహాలు చేసుకుంటున్నట్లుగానే అంతా భావిస్తున్నారు అదే జరిగితే పాక్ ముక్కచెక్కలు అయినట్లే అని అంటున్నారు.

# దాయాదీకి దడదడ...

# పాక్ రాజధానిలో సైరన్లు స్టార్ట్!


ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్ లో టెన్షన్ మొదలైందని అంటున్నారు. భారత పౌరులపై ఉగ్రవాదులు దాడులు చేస్తే.. అందుకు ప్రతీకారంగా పాక్ సైనిక స్థావరాలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఉగ్ర శిబిరాలపై భారత్ దాడి చేసింది. అయితే.. ఆ దాడికి ప్రతీకారంగా పాక్ దాడులు మొదలుపెట్టింది. దీంతో... పాక్ ను భారత్ విత్‌ఔట్ గ్యాప్ వణికించేస్తుంది. భారత్ లోని 15 నగరాలపై దాడి చేసేందుకు పాక్ ప్రయత్నించగా.. ఆ ప్రయత్నాన్ని బలంగా తిప్పికొట్టింది. అనంతరం కౌంటర్ అటాక్ మొదలుపెట్టింది. ఇందులో భాగంగా.. లాహోర్ తో పాటు 7 ప్రాంతాల్లో పాకిస్థాన్ గగనతల రక్షణ వ్యవస్థలను నాశనం చేసింది! అంతకంటే ముందు లాహోర్ ఎయిర్ పోర్ట్ సమీపంలో భారీ



పేలుళ్లు సంభవించిన పరిస్థితి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పాక్ ఆర్మీ, ప్రజానికంతో పాటు ప్రభుత్వం కూడా ఉక్కిరిబిక్కిరి అవుతుందని అంటున్నారు! ఈ సమయంలో పాకిస్థాన్ సర్కార్ సమీక్ష సమావేశం నిర్వహించింది! ఈ సందర్భంగా పాక్ పార్లమెంట్ లోని నేతలు భారత దాడుల నేపథ్యంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వ్యాప్తంగా సైరన్లు మోగాయి. దీంతో... పాక్ రాజధాని ప్రాంత వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాక్ గగనతల రక్షణ వ్యవస్థలను భారత్ ధ్వంసం చేస్తున్న వేళ.. ఏ క్షణం ఏ డ్రోన్, ఏ క్షిపణి వచ్చి పడుతుందో అనే ఆందోళన వ్యక్తమవుతుందని అంటున్నారు. ఆ సంగతి అలా ఉంటే... పాకిస్థాన్ లోని లాహోర్ లో ఉన్న తన ప్రజలకు అమెరికా అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా.. తక్షణం లాహోర్ ను విడిచి వెళ్లాలని సూచించింది. అయితే... తాజాగా గురువారం నెలకొన్న డ్రోన్ దాడుల నేపథ్యంలో అగ్రరాజ్యం తన ప్రజలకు ఈ సూచన చేసినట్లు చెబుతున్నారు.

# భారత్ దెబ్బకు గుక్క పెట్టి ఏడుస్తున్న పాకిస్తాన్ ఎంపీలు

భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దెబ్బకు పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. భారత్ ఉగ్రవాద స్థావరాలపై చేసిన మెరుపుదాడితో కంగుతిన్న పాకిస్థాన్ లోని రాజకీయ నాయకులు తమ దేశ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీలో పలువురు ఎంపీలు దేశం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితిని తలచుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ముఖ్యంగా ఎంపీ తాహిర్ ఇక్బాల్ మాట్లాడుతూ.. పాకిస్థాన్‌ను భారత్ నుంచి కాపాడాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టింది. ఇందులో భాగంగా పాకిస్థాన్ , పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని పలు ఉగ్రవాద శిబిరాలపై భారత బలగాలు లక్షిత దాడులు నిర్వహించాయి. ఈ ఆకస్మిక దాడుల తీవ్రత పాకిస్థాన్‌ను కలవరానికి గురిచేసింది.




ఆపరేషన్ సిందూర్ మొదటి రోజు ప్రభావం చూసిన పాకిస్థాన్, రెండో రోజు మరింత ఆందోళనకు గురైంది. పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా దేశ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని పలువురు ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఎంపీ తాహిర్ ఇక్బాల్ తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. పాకిస్థాన్‌ను రక్షించమని అల్లాహ్‌ను ప్రార్థించడం మినహా వేరే మార్గం లేదని ఆయన అన్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వేగంగా విస్తరిస్తున్నాయి, ఇది పాకిస్థాన్‌లో నెలకొన్న భయం మరియు అనిశ్చితికి అద్దం పడుతోంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తమ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడం పాకిస్థాన్‌కు మింగుడుపడటం లేదు. ఇది పాకిస్థాన్ అంతర్గత భద్రత , సార్వభౌమత్వంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆ దేశ నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆర్థికంగా అనేక సవాళ్లు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు ప్రస్తుత పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. సరిహద్దు వెంట ఉద్రిక్తతలు పెరగడం, భారత్ నుండి ఊహించని ప్రతిస్పందనలు రావడం పాకిస్థాన్ ను కలవర పెడుతోంది. ఈ నేపథ్యంలో పాక్ ఎంపీల కన్నీళ్లు వారి నిస్సహాయతను, దేశం ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని తెలియజేస్తున్నాయి.

చురకలు



చురకలు

సంపాదకీయం

# పాక్ ఉన్మాదం... ఉనికికే ప్రమాదం

పాకిస్థాన్ ఆవేశంతో ఏర్పడిన దేశం. ఆ ఆవేశానికి తోడు ఉన్మాదంతో కూడిన ఆలోచనలు ఉన్నాయి. దాంతో పాక్ ఈ రోజుకీ ఒక దేశంగా మనలేకపోతోంది. పాక్ పెట్టే నొప్పులు అన్నీ భారత్ గత ఆరున్నర దశాబ్దాలుగా భరిస్తూ వస్తోంది. ఇది చివరికి ఎలా తయారైంది అంటే చూస్తూ లైట్ తీసుకుంటే ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూ రెచ్చిపోతోంది. అలాగని వారి మీద సీరియస్ అయితే మా దేశం మీదకే దండెత్తుతారా అని ఆగ్రహించి మరీ మీదకు వస్తోంది. పాక్ లోని ఉగ్ర శిబిరాలను భారత్ లక్ష్యంగా చేసుకుని వాటిని ధ్వంసం చేసింది ఇది ప్రపంచమంతా చూసింది. మరి పాక్ కి ఎందుకు కోపం ఇక్కడ. ఉగ్రవాద బాధిత దేశంగా మేమూ ఉన్నామని చెప్పుకునే పాక్ కి ఉగ్రవాదుల స్థావరాలు నాశనం అయితే ఏడుపు ఎందుకు అన్నదే ప్రశ్న. ఇక వారి అంత్యక్రియలకు సైనికాధికారులు హాజరు కావడం ఆసుపత్రులలో ఉగ్రవాదులని పరామర్శించడం ద్వారా తమ దేశానిది ఉగ్ర ఉన్మాదమని పాక్ చెప్పకనే లోకానికి చెప్పింది. అంతటా బరితెగింపు బుకాయింపు అబద్ధాలు అసత్యాలతో పాక్ ఇన్నేళ్ళూ నెట్టుకుని వచ్చింది. పాక్ భుజం మీద గురిపెట్టి భారత్ ని టార్గెట్ చేయాలన్న కొన్ని కక్కుర్తి దేశాల వల్లనే పాక్ ఈ రోజుకీ అలా నిలిచి ఉంది అన్నది వాస్తవం. చేసిన తప్పులు ఒప్పుకోక ఉగ్ర మూకలను భారత్ పైకి విచ్చలవిడిగా పంపుతూ ఏకంగా వారికే ఆశ్రయం కల్పిస్తూ ప్రజలను పేదలుగా చేస్తూ పాక్ ఆడుతున్న వింత నాటకాలకు ఫుల్ స్టాప్ పడాల్సిన సమయం ఇపుడేనేమో అనిపిస్తోంది. కవ్వింపు చర్యలతో భారత్ ని యుద్ధం ముగ్గులోకి దింపి ఏదో సాధించాలని పాక్ చూడడం వెనక మూరత్వమే ఉంది తప్ప మరేమీ లేదు. తన దగ్గర అణ్వాయుధాలు ఉన్నాయని తెగ నీలుగుతున్న పాక్ కి అవి టచ్ చేసేలోగానే భారత్ ఆ దేశ చరిత్రను సమాప్తం చేస్తుంది అన్నది కనుక అర్థం అయితే విషయం ఇంతదాకా వచ్చేది కాదు. భారత్ లోని పదిహేను నగరాల మీద దాడులు చేయడానికి పాక్ సిద్ధపడడాన్ని ఎలా చూడాలి. జమ్మూ కాశ్మీర్ ఎయిర్ పోర్టుని ఎటాక్ చేయడానికి చేసిన చర్యలను ఎలా అర్థం చేసుకోవాలి అన్నది కూడా ఈ రోజున ప్రపంచం అంతా ఆలోచించాలి. ఉగ్రవాద బాధిత దేశంగా ఎన్నో దెబ్బలు తిని ఎంతో ఆస్తి ధన ప్రాణాలను ఫణంగా పెడుతున్న భారత్ ఈ రోజు తన దేశం కోసం తన హక్కుగా ఉగ్ర శిబిరాలను ఎటాక్ చేస్తే అందులో కూడా తప్పు వెతికి పాక్ కి ఊతం ఇవ్వాలనుకునే ముష్కర ఆలోచనలు కలిగిన దేశాలకు ఉగ్ర భూతం వారిని సైతం కబలిస్తుంది అన్నది తెలిసి రావాల్సి ఉంది ధర్మ యుద్ధం భారత్ చేస్తోంది. అయితే పెద్దన్నలు తమ్ముళ్ళూ అయిన దేశాలు డబుల్ స్టాండర్డ్ గా వ్యవహరిస్తే అంతిమంగా వారికే నష్టం అన్నది గుర్తెరగాలి ఇక భారత్ ఎవరి మెప్పు కోసమో గొప్ప కోసమో చూడదు, తన దేశం కోసం పాక్ ని ఉరుకులు పెట్టించి పరుగులు తీయించి ఎందాకైనా వెంటపడి మరీ తరుముతుంది. ఈ క్రమంలో పాక్ ఉనికి ఏ విధంగా ఉండబోతోంది అన్నది దేవుడికే ఎరుక. ఒక్కసారి పట్టు పట్టాక వదిలేయడం భారత్ వద్ద లేదు. పాక్ ప్రగల్భాలతో మితిమీరిన అక్కసుతో ఉన్మాదంతో చేసే వికృత చేష్టలకు ఆ దేశమే బలి అయినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. ఏది ఏమైనా పాక్ వంటి దేశం ఒకటి ఉండడం మాత్రం భారత్ కి భౌగోళిక శాపం అయితే దానికి తగిన పరిష్కారాలు వెతికే తెలివిడి కూడా భారత్ కే ఉంది. అది తొందరలోనే అందరికీ తెలిసి వస్తుంది.

# మే 10... సిపాయిల తిరుగుబాటు ప్రారంభ దినం - ప్రథమ స్వాతంత్ర్య సమర చారిత్రక నేపథ్యం.



ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది. ఉత్తర, మధ్య భారతదేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది.

1857 మే 10 న మీరట్‌లో సిపాయీలతో మొదలైన తిరుగుబాటు, ఉత్తర గంగా మైదానంలోను, మధ్య భారతంలోనూ పౌర తిరుగు బాటుగా మారి. తూర్పు భారత దేశంలో కూడా తిరుగుబాటు విస్తరించి, ఆయా ప్రాంతాల్లో బ్రిటిషు వారి అధికారాన్ని పెద్ద ఎత్తున సవాలు చేసి,1858 జూన్ 20 న తిరుగుబాటు దార్లను ఓడించడంతో ముగిసింది. హత్యలకు పాల్పడిన వారికి తప్ప తిరుగు బాటులో పాల్గొన్న మిగతా వారందరికీ బ్రిటిషు ప్రభుత్వం 1858 నవంబరు 1 న క్షమాభిక్ష మంజూరు చేసింది. యుద్ధం ముగిసినట్లు ప్రకటించినది మాత్రం 1859 జూలై 8 నే.

**తిరుగు బాటుకు ముఖ్య కారణం...** 1856 డిసెంబరులో బ్రిటిష్ పాలకులు రాయల్ ఎన్ఫీల్డ్ (పి/53 లీ ఏన్ఫిల్డ్ రైఫిల్ 557 కాలిబర్) తుపాకీని ప్రవేశ పెట్టారు. దానికి వాడే తూటాల చివరి భాగాన్ని నోటితో కొరికి ఉపయోగించాల్సి ఉండేది. ఈ తుటాల చివర ఆవు పంది కొవ్వు పూసినట్లు వదంతులు వ్యాపించాయి. ఆవు హిందువులకు పవిత్రం, పంది ముస్లింలకు నిషేధం. కాబట్టి తూటాలను కొరకడాన్ని భారతీయ సిపాయిలు నిరాకరించారు. ఈ కొత్తరకం తుపాకులు ఇంగ్లండ్ లో ఆయుధ ఫ్యాక్టరీలో తయారయ్యేవి. ఇది హిందూ, ముస్లిం సైనికులను క్రైస్తవులుగా మార్చడానికి పన్నిన కుట్రగా భావించిన సిపాయిలు తిరుగుబాటుకు పూనుకున్నారు. అయితే బ్రిటీష్ వారు ఆ తూటాలను మార్చామనీ, కొవ్వులను తేనె పట్టునుండి లేదా నూనె గింజల నుండి సొంతంగా తయారు చేసుకోవటాన్ని ప్రోత్సహించామని చెప్పినప్పటికీ అవి సిపాయిలకు నమ్మకాన్ని కలిగించలేక పోయాయి. 1857 మార్చినెలలో 34వ దేశీయ పదాతి దళానికి చెందిన మంగళ్ పాండే అనే సైనికుడు బ్రిటిష్ సార్జంట్ మీద దాడిచేసి ఆయన సహాయకుని గాయ పరచాడు. జనరల్ హెన్రీ మంగళ్ పాండేను మతపిచ్చి పట్టినవాడిగా భావించి, మంగళ్ పాండేను బంధించమని జమేదార్ని ఆజ్ఞాపించటం, జమేదార్, హెన్రీ ఆజ్ఞను తిరస్కరించటంతో తిరుగుబాటు ప్రారంభానికి అంకురార్పణ జరిగింది. బ్రిటీష్ వారు మంగళ్ పాండేను, జమేదారును ఏప్రిల్ 8న ఉరితీసి, దళం మొత్తాన్నీ విధులనుండి బహిష్కరించారు. మే 10న 11వ, 20వ అశ్వదళం సమావేశమై అధికారులను ధిక్కరించి 3వ పటాలాన్ని విడిపించారు. మే 11న ఇతర భారతీయులతో కలసి సిపాయిలు ఢిల్లీ చేరుకొని చివరి మొగలు చక్రవర్తి బహదూర్ షా నివాసమైన ఎర్రకోటని ఆక్రమించి చక్రవర్తిని ఢిల్లీసుల్తాన్ గా తిరిగి అధికారాన్ని స్వీకరించాల్సిందిగా వత్తిడి చేసారు. బహదూర్ షా తొలుత అంగీకరించక పోయినా, తరువాత ఒప్పుకొని తిరుగు బాటుకు నాయకత్వాన్ని వహించాడు. 1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి నిస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు. బ్రిటిష్ వారు మొదట వేగంగా స్పందించనప్పటకీ, తరువాత తీవ్రమైన బల ప్రయోగంతో తిరుగు బాటుని అణచి వేసేందుకు యత్నించారు. వారు క్రిమియన్ యుద్ధంలో పాల్గొన్న పటాలాలనీ, చైనా వెళ్ళేందుకు బయలు దేరిన ఐరోపా పటాలాలని తిరుగు బాటును అణచి వేసేందుకు వినియోగించారు. తిరుగుబాటు దారుల ప్రధాన సైన్యానికి, బ్రిటిష్ వారికీ ఢిల్లీకి దగ్గరలోని బద్-కీ-సరై లో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో బ్రిటిష్ సైనికులు మొదట తిరుగుబాటు దారులను ఢిల్లీకి పారద్రోలి తరువాత ఢిల్లీని ఆక్రమించారు. ఢిల్లీ ఆక్రమణ జూలై 1న ప్రారంభమై ఆగస్టు 31 న పూర్తయింది. ఒకవారం పాటు అడుగడుగునా వీధిపోరాటం జరిగింది. అయితే తిరుగుబాటు దారుల మీద బ్రిటీష్ వారు విజయం సాధించి నగరాన్ని తిరిగి ఆక్రమించారు. జూన్ 20న గ్వాలియర్లో చివరి ముఖ్య పోరాటం జరిగింది. ఈ పోరాటంలో రాణీ లక్ష్మీబాయి మరణించింది. అయితే చెదురు ముదురు పోరాటాలు 1859 లో తిరుగుబాటు దారులను పూర్తిగా అణచివేసే వరకూ జరిగాయి. నానా సాహిబ్, రావ్ సాహిబ్ పరివారము, తాంతియా తోపే, రాణీ ఝాన్సీ లక్ష్మీబాయి, కున్వర్సింగ్, బీహారులోని రాజపుత్ర నాయకుడైన జగదీష్ పూర్, ప్రాణ్ సుఖ్ యాదవ్ మరియూ రెవారి తదితరులు బ్రిటిష్ వారిని ఎదియించారు. 1857 తిరుగుబాటు భారతదేశ చరిత్రలో ఒక ముఖ్య మలుపు. బ్రిటిషు వారు ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనను రద్దుచేసి విక్టోరియా రాణి పరిపాలనను ప్రవేశ పెట్టారు. భారత పాలనా వ్యవహారాలను చూసుకోవటానికి వైస్రాయిని నియమించారు. ఈవిధంగా భారత దేశం నేరుగా బ్రిటిషు పాలనలోకి రావడానికి తిరుగు బాటు కారణ భూతమయింది.. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# శతాధిక నాటక రచయిత కొర్రపాటి - మే 10...కొర్రపాటి గంగాధరరావు జయంతి



సమాజంలో పేరుకు పోయిన చెడు భావజాలాన్ని నివారించే సాధనంగా నాటకాన్ని భావించి, నాటక రంగ అభివృద్ధికి విశేష కృషి సల్పారు కొర్రపాటి గంగాధరరావు. ఇందుకోసం నాటక సంస్థను స్థాపించి ఎందరో నటులను కళాకారులను తీర్చి దిద్దారు. నాటకోద్యమాన్ని నలు చేరుగులా విస్తరింప చేశారు. కొర్రపాటి గంగాధరరావు (మే 10, 1922 - జనవరి 26, 1986) నటులు, దర్శకులు, శతాధిక నాటక రచయిత. ఆయన 1922, మే 10న మచిలీపట్నంలో జన్మించారు. ఏలూరు, మద్రాసులో చదివారు. ఎల్.ఐ.ఎం. పరీక్షలో ఉత్తీర్ణులై వైద్యవృత్తిని చేపట్టి బాపట్లలో నివాసమున్నారు. తెలుగు నాటక సాహిత్యంలో వందకుపైగా నాటకాలు, నాటికలు రచించిన మొదటి రచయిత కొర్రపాటి. 1955-65 ప్రాంతంలో రంగస్థల ప్రదర్శనల అనుగుణమైన రచనలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా నాటకొద్యమాన్ని బలోపేతం చేయడంలో పూర్తి సమయాన్ని కేటాయించారు. కళావని అనే నాటక సంస్థ ద్వారా అనేకమంది యువ కళాకారులను నాటక రంగానికి పరిచయం చేశారు. ఆయన నాటకాలలో ఎన్నో ఉత్తమ రచనలుగా బహుమతులు అందుకున్నాయి. నాటక రంగాన్ని గురించి, నాటక ప్రదర్శన విధానాల గురించి అనేక వ్యాసాలను రచించి నాటక కళాభివృద్ధికి కృషిచేశారు. నాటకాన్ని ఒక పదునైన ఆయుధంగా సమాజంలోని చెడ్డ అలవాట్లపై ప్రయోగించాలని ఆయన ఏకైక ఆశయం. కళావని అనే నాటక సమాజాన్ని స్థాపించి, దానికి అధ్యక్షులుగా, దర్శకులుగా వ్యవహరించారు. కళాభారతి అనే సాంస్కృతిక సంస్థకు, బాపట్ల ఫిల్మ్‌క్లబ్ కు అధ్యక్షులుగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వంహించారు. లంబడోళ్ళ రాందాసు, బోధిశ్రీ, ధంసా, నాలుగు నాలుగు నలభై నాలుగు, స్వర్గసీమ, శాంతి తోరణం, నారీ స్వేచ్ఛ బ్రహ్మచారి, అమృత మధనం, లకుమాదేవి- కుమారగిరి, నవతా!మానవతా అనే నవలలు రచించారు.

ఇవేకాక బ్రహ్మచారి పెళ్ళాం, యమలోకంలో సావిత్రి, పతి-పత్ని, వేగుచుక్క, డాక్టర్ గారి అమ్మాయి, సినిమా తారా, చేదుకో మల్లయ్య చేదుకో, ద్వి పాత్ర, పరకాయ ప్రవేశం, ఖబడ్దార్ ఖూనీకోర్ మొదలైన అముద్రిత నవలలు కూడా రచించారు. గంగాధర రావు 130కి పైగా నాటక నాటికలు, 12 రేడియో నాటికలు, 20 నవలలు, 7 కథలు, ఏక పాత్రలు, నాటక రంగంపై 65 వ్యాసాలు రచనలు చేశారు. విషకుంభాలు, కమల, యథాప్రజా - తథారాజా, తస్మాత్ జాగ్రత్త, లోకం పోకడ, పోటీ నాటకాలు, రాగ ద్వేషాలు, రాగ శోభిత, పుడమి తల్లికి పురిటి నొప్పులు మొదలైన నాటకాలు, ప్రార్థన, నాబాబు, పెళ్ళి చూపులు, బంగారు సంకెళ్ళు, తెలుగు కోపం, విధివశం, తనలో తాను, పెండింగ్ ఫైలు, మనిషి వంటి ప్రజాదరణ పొందిన నాటికలు రచించారు. అంతే కాకుండా ఈ రోడ్డెక్కడికి?, పూలదోసిళ్ళు, మర - మనిషి, సంక్రాంతి, సాహసి వంటి నాటకాలను తెలుగులోకి అనువదించారు. రథచక్రాలు (నాటికల సంపుటి) పెండింగ్ ఫైల్ (నాటిక), గుడ్డిలోకం, నిజ రూపాలు, కమల, కొత్త చిగురు, పుడమి తల్లికి పురిటి నొప్పులు, ఈ రోడ్డు ఎక్కడికి? తెరలో తెర ...తదితర రచనలు చేశారు. ఆంధ్ర కళాపరిషత్ నిర్వహించిన పోటీలలో పాల్గొన్న, బహుమతులను అందుకున్న 25 నాటికలను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పక్షాన నాటికా పంచవింశతి అనే పేరుతో సంకలనం చేసి ప్రచురించారు. ఆయన నాటకాలలో ఎన్నో ఉత్తమ రచనలుగా బహుమతులు అందుకున్నాయి. యథాప్రజా - తథారాజా నాటకానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, ప్రార్థన నాటకానికి ఆంధ్రనాటక కళాపరిషత్తు అవార్డు, మద్యపాన నిషేధం వస్తువుగా రాసిన పెడదోవ నాటకానికి కేంద్ర ప్రభుత్వ ప్రథమ బహుమతి లభించాయి.తెలుగు నాటకరంగానికి విశేష సేవ చేసిన కొర్రపాటి 1986, జనవరి 26 తేదీన మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ప్రజాసేవలో ఘనాపాఠి.. రారెవ్వరు ఆయనకు సాటి... మే 10..జువ్వాడి రత్నాకర్ రావు వర్ధంతి సందర్భంగా



పదవులు పొందడం ద్వారా గౌరవాన్ని కొందరు పొందితే, తాము చేపట్టిన పదవులకే వన్నె తెస్తారు మరి కొందరు. రెండవ కోవకు చెందినవారు కరీంనగర్ రాజకీయ కురువృద్ధులు, ఆరడుగుల ఆజాను బాహుడు జువ్వాడి రత్నాకర్ రావు. స్వార్థ ప్రయోజనాల కోసం పదవులు పొందడం అత్యంత సహజ మైనా, తన ఆశ్రితులైన ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలను, అందించడం కోసమే వివిధ పదవులను చేపడతారని పేరొందిన ప్రజా సేవా తత్ప రుడు రత్నాకర్ రావు. ప్రజలకు తానేమో చేస్తానని నమ్మించి, ఎన్నికలలో గెలిచి, ప్రజలను విస్మరించడం కాక, నిస్వార్థంగా, చిత్తశుద్ధితో, ప్రజల సమస్యలు తెలుసుకుని, వారు కోరకుం డానే వారి సమస్యల పరిష్కా రం కోసం కృషి సల్పే వారే నిజమైన ప్రజాప్రతినిధులని రత్నాకర్ రావు పదే పదే నొక్కి చెబుతూ ఉండేవారు. దినచర్యను కుదించుకుని కృష్ణా, రామా అనుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో, మలి సంధ్య జీవిత కాలాన్ని గడపాల్సిన రత్నాకర్ రావు, జీవిత చరమాంకం లోనూ, జీవితానికి అర్థం, పరమార్థం, స్వార్థం కానేకాదని, దృఢంగా విశ్వసిస్తూ, తుది శ్వాస వరకు, ప్రజల గురించి ఆలోచిస్తూనే ఉండేవారాయన. అందుకే కాబోలు సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అలుపెరుగని అవిశ్రాంత శ్రామికునిగా, ప్రజలతో మమేకమై ప్రజలకు సేవలు చేసినా, చేసింది చాలదని, చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది అని, ప్రజల మధ్య లేకున్నా, ప్రజల హృదయాల్లో చోటు పొందిన నేతగా, జీవిత చరమాంకం సమయంలోనూ సేవానిరతి స్ఫూర్తిని ప్రదర్శిం చిన గొప్ప మనసు ఆయనది. తొమ్మిది పదుల వయసులో కనీవినీ ఎరగని రీతిలో నిరంతరం తనను కలిసిన వారినీ, ఫోన్ ద్వారా మాట్లాడే వారినీ సమస్యల గురించే ఆరా తీయడం నిత్య విధిగా కలిగి వున్నారాయన....1928 అక్టోబర్ 4వ తేదీన జన్మించి సర్పంచిగా రాజకీయ జీవితం ప్రారంభించి, 2020 మే 10 కన్ను మూసే వరకూ ప్రజా సేవకే అంకితం అయిన ధన్య జీవి. గ్రామ సర్పంచిగా, జగిత్యాల పంచాయతీ సమితి అధ్యక్షు లుగా, పిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, ఎఐసిసి సభ్యులుగా, వ్యవసాయ విశ్వ విద్యాలయ పాలక వర్గ సభ్యులుగా, స్వతంత్ర... తర్వాత కాంగ్రెస్ 2సార్లు ఎమ్మెల్యేగా, చివరకు వై యస్ హయాంలో రాష్ట్ర దేవాదాయ స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖల మంత్రిగా ఆయన చేసిన కార్యక్రమాలు, అందించిన సేవలు చిరస్మణీయం. రత్నాకర్ రావు, 90వ దశకంలో కదలికలు ఇంటికి, చివరకు పడకకే పరిమితమైనా.... పుట్టినూరు అయిన తిమ్మాపూర్, రాజకీయ వేదికైన ధర్మపురి, రాజకీయ ఉన్నతికి చేయూతనిచ్చిన బుగ్గారం, జగిత్యాల నియోజక వర్గాల ప్రజా సమస్యలను తెలుసుకుని, అవసరమైన వారికి ఫోన్లు చేయడం ఆయన నిత్య కృత్యంగా పెట్టుకున్నారు. మరణానికి కొద్ది రోజుల ముందు నిమ్స్ లో, చికిత్స పొందుతున్న సమయంలో... తాజా మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, తదితరులు వేరు వేరుగా కలిసిన సందర్భాలలో, పలు అంశాలను వారి దృష్టికి తెచ్చి, పరిష్కారం చేయాలని కోరారు. హామీలు పొందారు కూడా. తన ఆరోగ్యం గురించి వాకబు చేసి, వైద్యులతో మెరుగైన సేవలను అందించాలని మంత్రులు కోరిన సందర్భాల లోనూ, తన గురించి, ఆరోగ్యం గురించి కాకుండా, ప్రజా సమస్యలు, అవసరాలు, సౌకర్యాల గురించి మాట్లాడిన జువ్వాడి రత్నాకర్ రావు తీరు నాటి మంత్రులను ఆశ్చర్య చకితులను చేసిన నేపథ్యం, ఆయన నిజమైన ఆదర్శ ప్రజా ప్రాతినిథ్య సేవాభావానికి పరాకాష్టగా చెప్పక తప్పదు. ధర్మపురి ప్రాంత ప్రజలతో విడదీయరాని బంధం, సంబంధం, అనుబంధం కలిగిన జువ్వాడి రత్నాకర్ రావు సేవలకు గుర్తింపుగా, రాజకీయ విపక్షీయులు అయినా, ఇటీవలే ధర్మపురి తాజా మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎవరి సాయం కోరకుండా, స్వంత ఖర్చుతో, జువ్వాడి విగ్రహాన్ని తయారు చేయించి, ప్రతిష్టింప చేయించి ప్రారం భించడం విశేషం.

రాజకీయాలంటే సిద్ధాంతం, రాద్ధాంతాలు కాదు. దాని రహస్యమంతా ఆచరణలో సత్ప్రవర్తనలో ఉంది. అవకాశం ఉన్న మేరకు, పరులకు మేలు చేయడమే రాజకీయ జీవిత పరమార్థం. అదే నిజమైన ఫిలాసఫీ. గొప్పతనం గొప్పలు చెప్పుకోవడం, చెప్పించు కోవడం కాదు. గొప్పగా చేసి చూపిస్తేనే గొప్పవారు అవుతారు. "హ్యాట్సాఫ్ టు ద రియల్ పబ్లిక్ సర్వెంట్".... **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కనిపించని పచ్చదనం

ధర్మపురి : జిల్లాలోని అయిదు పురపాలికల పరిధిలో నాటిన మొక్కల సంరక్షణ మొక్కుబడిగా సాగుతోంది. ఓ వైపు నీటి ఎద్దడి, మరోవైపు అధికారుల పర్యవేక్షణ లోపంతో లక్ష్యం నీరుగారుతోంది. గత ఏడాది నాటిన మొక్కల పెంపకానికి ఏప్రిల్, మే నెలల్లో ట్యాంకర్ల ద్వారా నీరు పట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పుర ఆదాయాల్లో పది శాతం మేర మొక్కల పెంపకానికి వెచ్చించాలి. పచ్చదనం పెంపకానికి తగిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కాని క్షేత్రస్థాయిలో శ్రద్ధ కరవైంది. కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్, జగిత్యాల పురపాలకాల్లో వేసవిలో మొక్కలను సంరక్షించేలా ట్యాంకర్లను, సిబ్బందిని కేటాయించారు. ప్రతిరోజు ఉదయం,



సాయంత్రం తప్పనిసరిగా నీటిని పోయాలని.. సంరక్షణ బాధ్యతలు ఆయా పురపాలికల ఇంజినీర్లకు అప్పగించారు. మందకొడిగా నీటి సరఫరా జరుగుతుండగా.. పచ్చదనం లక్ష్యం నెరవేరేలా లేదు. ధర్మపురిలో ఇంకా నీటి ట్యాంకర్లనే కేటాయించలేదు.

**సంరక్షణ చర్యలు శూన్యం** పట్టణ ప్రగతి, హరితహారం కార్యక్రమాల్లో గత ఏడాది రూ.4 లక్షల వ్యయంతో ధర్మపురిలో 64 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 77 శాతం మాత్రమే లక్ష్యాన్ని సాధించినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. నాటిన వాటిపై కూడా క్షేత్రస్థాయిలో పుర అధికారు లు శ్రద్ధ చూపడం లేదు. నీరు పోసేందుకు, ట్రీగార్డులను ఏర్పాటు చేసేందుకు ఆసక్తిని కనబరచడం లేదు. వచ్చే వర్షాకాలంలో మొక్కలను నాటేందుకు గుత్తేదారు ఎంపికనే ఇప్పటి వరకు చేపట్టకపోవటం గమనార్హం.

# ఏకరూపం.. మహిళలకు ఆదాయం

సారంగాపూర్ : మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించేందుకు ఇప్పటికే పలు పథకాలలో భాగస్వామ్యం చేయగా, గతేడాది నుంచి ఏకరూప దుస్తుల తయారీ బాధ్యతలను అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్, కస్తూర్బా, ఆదర్శ తదితర పాఠశాలలు దాదాపుగా 853 వరకు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో చదివే బాల, బాలికలకు ప్రభుత్వం ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో 57,552 మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించి తయారీకి అందించారు. ఇందులో 26,561మంది బాలురు, 30,991 బాలికలకు దుస్తులు తయారీ చేస్తున్నారు. గతేడాది కంటే ధర పెంచడంతోపాటు పాఠశాలల వారీగా బాధ్యతలు అప్పగించడంతో మహిళా సభ్యుల్లోనే పోటీ ఏర్పడింది. ఇప్పటికే దుస్తుల తయారీ కొనసాగుతుండగా జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా, అప్పటిలోగా తయారీ చేసి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**ధర పెంపు..** గతేడాది ఏకరూప దుస్తుల తయారీ బాధ్యతలకు అప్పగించినప్పటికీ జిల్లాకు చెందిన కొందరికే అప్పగించడంతో విమర్శలు వెల్లువెత్తడమే కాకుండా సరైన సమయంలో అందించకపోవడం, ధర కూడా తక్కువగా ఉండడంతో మహిళలు ముందుకు రాలేకపోయారు. గతేడాది జతకు కేవలం రూ.45 మాత్రమే ఉండడంతో దానిని రూ.75లకు పెంచారు. ప్రస్తుతం ఒకటి నుంచి ఇంటర్ వరకు రూ.75 అందిస్తుండగా, అంగన్‌వాడీ పిల్లలకు రూ.80, వసతి గృహాల విద్యార్థులకు రూ.80 నుంచి రూ.100 అందించేందుకు నిర్ణయించారు. దీనివల్ల మహిళా సభ్యులలో డిమాండ్ ఉండడంతో పాఠశాలల వారీగా దుస్తుల తయారీ బాధ్యతలను అప్పగించారు.

గతంలో తరగతి వారీగా దుస్తులను పంపిణీ చేస్తుండగా ఒకరికి పెద్దగా, మరొకరికి చిన్నగా దుస్తులు అందుతుండేవి. ప్రస్తుతం అలా కాకుండా విద్యార్థి వారీగా కొలతలు తీసుకుని తయారు చేస్తున్నారు. దీనివల్ల దుస్తుల కొలతల్లో తేడాలేకుండా విద్యార్థికి అందనుంది. గతంలో మండల మహిళా సంఘానికి వస్త్రం చేరుకుంటే అక్కడి నుంచి కుట్టు కేంద్రానికి అందిస్తుండేవారు. అలాకాకుండా నేరుగా వారికే అందిస్తున్నారు. దుస్తుల తయారు చేసిన మహిళా సభ్యురాలి వారీగా విద్యార్థి వారీగా కొలతలను ఆన్‌లైన్ చేసి ఉంచడంతో ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. ముందు నుంచే పకడ్బందీగా దుస్తుల తయారీపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించడంతో సమస్య తలెత్తకుండా ఉంటుందని భావిస్తున్నారు.

**ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది**

ప్రభుత్వం మహిళల ఆర్థికాభ్యున్నతికి కృషి చేస్తోంది. సెర్ప్ ద్వారా ఏకరూప దుస్తుల తయారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం పాఠశాలల వారీగా కుట్టు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గంగాధర్, ఏపీఎం, జగిత్యాల

**ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం** మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఏకరూప దుస్తుల తయారీ మంచి అవకాశం. ఇప్పటికే స్వయం సహాయక సంఘాలకు వివిధ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం ఇబ్బందులు లేకుండా ఉంటుంది. పులి సంగీత, స్వశక్తి సభ్యురాలు

# తగ్గిన క్రమబద్ధీకరణ

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని నగరపాలికలు, పురపాలికల్లో లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల ప్రక్రియ తగ్గుముఖం పట్టాయి. 25 శాతం రాయితీ గడువు ఈనెల 3న ముగియడంతో దరఖాస్తుదారులు కార్యాలయాల వైపు రావడం లేదు. మళ్లీ గడువు పొడిగిస్తారనే ప్రచారం జరుగుతున్నా.. ప్రభుత్వం నుంచి స్పందన లేకుండా పోయింది. వేల సంఖ్యలో దరఖాస్తులు అపరిష్కృతంగా మిగిలిపోయాయి.

**సాంకేతిక సమస్యలతో సతమతం**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను సులభంగా పరిష్కరించుకోవాలని ప్రభుత్వం పేర్కొన్నా.. సాంకేతిక సమస్యలు ఇబ్బందులకు గురి చేసింది. దరఖాస్తుదారులు నేరుగా ఫీజు చెల్లించుకునే వెసులుబాటు కల్పించగా, అంతకుముందు ఎల్-1, ఎల్-2 లాగిన్ల ప్రక్రియలో పలు రకాల పత్రాలు నమోదు చేయాల్సి వచ్చింది. అన్ని సవ్యంగా ఉన్న ప్లాట్లకు కూడా కొర్రీలు పెట్టడంతో అర్జీదారులు అవస్థలు పడ్డారు. ఫీజు చెల్లించిన తర్వాత ఎన్‌వోసీలు అడగడం, ఆ తర్వాత ఎల్-1 లాగిన్లకు వెళ్లడం, కొందరి దరఖాస్తులు అసలే కనిపించకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరిగారు. సాంకేతికపరంగా ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేందుకు ముందుకొచ్చిన వారు వెనక్కి తగ్గారు. ఫీజు చెల్లించిన వారికి ఇబ్బందులు రాకుండా వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారు.

**రాయితీ అవకాశం లేనట్లే?** ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు వీలుగా రాయితీ అవకాశాన్ని ప్రకటించింది. ప్లాట్ యజమానులు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ఆసక్తి చూపించారు. ప్రస్తుతం ఆ అవకాశం లేనట్లేనని తెలుస్తోంది.

# ఒక్క క్లిక్కుతో హాస్టళ్ల సమాచారం




హైదరాబాద్: బెంగళూరులోని ప్రముఖ బహుళజాతి సంస్థలో పనిచేస్తున్న యువతికి హైదరాబాద్‌లోని బ్రాంచికి బదిలీ అయ్యింది. నగరంతో కనీస పరిచయం లేని ఆ యువతి ఎక్కడుండాలి..? హాస్టల్‌లో ఉండాలన్నా.. ఎవరి సాయంతో వెతకాలి..? హాస్టల్ దొరికినా అక్కడంతా భద్రంగా ఉంటుందా..? నగరానికి కొత్తగా వచ్చిన వారికి ఇలాంటి సందేహాలెన్నో..? ఈ సమస్యలకు పరిష్కారంగా సైబరాబాద్ పోలీసులు వినూత్న వేదిక సిద్ధం చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని హాస్టళ్ల సమాచారాన్ని ఒక్క క్లిక్కుతో తెలుసుకునేలా సేఫ్ స్టే ప్రాజెక్టులో భాగంగా వెబ్‌సైట్ సిద్ధం చేస్తున్నారు. హాస్టళ్లు ఎక్కడెక్కడ ఉన్నాయి..? గదుల లభ్యత, ధర, కల్పిస్తున్న సదుపాయాలు ఇలాంటి సమాచారమంతా ఇందులో పొందుపరుస్తారు. భద్రతాపరంగానూ దృష్టిసారించేలా దీన్ని రూపొందిస్తున్నారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ) భాగస్వామ్యంతో ఈ వెబ్‌సైట్‌ను త్వరలో ప్రారంభించనున్నారు.

వెబ్‌సైట్ ఎందుకంటే..: ఎస్‌సీఎస్‌సీ ఇటీవల హాస్టళ్ల పరిస్థితులపై నిర్వహించిన సర్వేలో అనేక లోపాలు బయటపడ్డాయి. దాదాపు 75 శాతం వసతి గృహాలు అగ్నిమాపక నిబంధనలు పాటించడం లేదు. రికార్డులు సరిగా నిర్వహించడం లేదు. అనూహ్య ఘటన, ప్రమాదం జరిగినప్పుడు వివరాలు సేకరించడం సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఇలాంటి లోటుపాట్లన్నీ సరిదిద్దనున్నారు.

**ఎలా పనిచేస్తుందంటే..**

ఉద్యోగి, విద్యార్థి ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని దానికి సమీపంలో హాస్టళ్లు ఎక్కడున్నాయో తెలుసుకోవచ్చు.

ఎన్ని గదులు అందుబాటులో ఉన్నాయి..? సదుపాయాలు..? ధర..?వంటి వివరాలు వెబ్‌సైట్‌లో ఉంటాయి. రివ్యూలు చూసి ఎంపిక చేసుకోవచ్చు.

యజమానులు, స్థానిక పోలీసులతో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి.. తరచూ పర్యవేక్షిస్తూ సమన్వయం చేస్తారు.

భద్రతపైనా దృష్టి

వసతి గృహాల్లో తరచూ ఆత్మహత్యలు, నేరగాళ్లు తలదాచుకోవడం, ఇతర ఘటనలు జరుగుతున్న దృష్ట్యా.. వచ్చిపోయే వారి వివరాలు నమోదు చేసుకునేలా రికార్డులు నిర్వహించాలి.

ఉండే వ్యక్తుల తాజా ఫొటో, ఆధార్‌కార్డు, ఎక్కడ పనిచేస్తున్నారు..? అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించేందుకు వారి సంరక్షకులు, కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లు యజమానులు తీసుకోవాలి.

సెక్టార్ ఎస్సైలు తమ పరిధిలోని హాస్టళ్లను మూడు నెలలకోసారి పరిశీలించి భద్రత ఇతర ఏర్పాట్లను గమనిస్తారు.

సురక్షిత గమ్యస్థానంగా సైబరాబాద్

ఐటీ కారిడార్‌కు ఉపాధి కోసం లక్షల మంది వస్తుంటారు. వీరి భద్రత, నివాసం విషయంలో ఇబ్బందులు లేకుండా స్టే సేఫ్ ప్రాజెక్టు ప్రారంభిస్తున్నాం. ముఖ్యంగా మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని అందుబాటులోకి తెస్తున్నాం. సైబరాబాద్‌ను సురక్షిత గమ్యస్థానంగా చేయడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

డాక్టర్ వినీత్, మాదాపూర్ డీసీపీ

# 'సర్వే'శా.. నంబర్లతో బంతాట



హైదరాబాద్: తరాలు మారినా.. భూమి, భూ సర్వే నంబర్లు మారవు. అధికారులు తలచుకుంటే మాత్రం.. భూముల హద్దులు మారుతాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అదే జరుగుతోంది. గ్రామ పటం ఆధారంగా మండల రెవెన్యూ అధికారి, జిల్లా కలెక్టర్ ఇచ్చే నివేదికలు ఒకలా ఉంటే.. జిల్లా సర్వే విభాగం సహాయ సంచాలకులు ఇచ్చే నివేదికలు మరోలా ఉంటున్నాయి. దీంతో పలు స్థిరాస్తి ప్రాజెక్టులు చిక్కుల్లో పడుతున్నాయి. ఈ వ్యవహారంలో రూ.వందల కోట్లు చేతులు మారుతున్నాయి. జీహెచ్‌ఎంసీ ప్రణాళిక విభాగం అందుకు కారణమవుతోందనే విమర్శలొస్తున్నాయి.

**గందరగోళానికి తెరలేపిన బల్దియా**

రెండేళ్ల కిందట మియాపూర్‌లోని 68వ సర్వే నంబరులో ఓ భవనానికి జీహెచ్‌ఎంసీ అనుమతి ఇచ్చింది. భవన నిర్మాణం చివరి దశకు చేరుకోగానే.. ఓ వ్యక్తి సర్వే నంబరు తప్పుగా ఉందంటూ జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేయగా.. భవనం ఏ సర్వే నంబరులో ఉందో తెలపాలంటూ జిల్లా ఏడీకి లేఖ రాసింది. ఆయన ఎమ్మార్వో నివేదికకు భిన్నంగా, సదరు నిర్మాణం సర్వే నెంబరు 69-1లో ఉన్నట్టు నివేదిక ఇచ్చారు. మరో సంస్థ అదే మియాపూర్‌లోని 68వ సర్వే నంబరులో భవన సముదాయం నిర్మాణానికి ఎమ్మార్వో, కలెక్టర్ ఇచ్చిన సర్వే నివేదికలను జత చేసింది. అయినా బల్దియా ప్రణాళిక విభాగం రిపోర్టు ఇవ్వాలంటూ ఏడీకి లేఖ రాసింది. ఇలాగే దాదాపు ఆరు ప్రాజెక్టులకు సంబంధించి జిల్లా ఏడీకి జీహెచ్‌ఎంసీ లేఖ రాసింది.

**సమస్య ఎక్కడంటే..**

జిల్లా కలెక్టర్ లేదా తహసీల్దార్ల నివేదికలను కాదంటూ జిల్లా ఏడీకి లేఖ రాయడంలో తప్పు లేదు. కానీ.. కొందరు ప్రజాప్రతినిధుల ఒత్తిడితో సర్వేలు కోరుతూ బల్దియా మెలికపెడుతోంది. బల్దియా లేఖలను సదరు జిల్లా సర్వే విభాగం అధికారి ఖాతరు చేయకపోవడం అందుకు నిదర్శనం. ఈ విషయమై ఏడీ సర్వేయరు శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. తాను ఇతరత్రా విధుల్లో తీరిక లేకుండా ఉన్నందున.. బల్దియా కోరుతున్న నివేదికలు ఇవ్వలేకపోతున్నానని, వివాదంగా మారిన రిపోర్టును మరోసారి పరిశీలిస్తామన్నారు.

# కొనుగోళ్లలో జాప్యం.. కర్షకుడికి శాపం



కరీంనగర్ : మానకొండూర్ సమీపంలోని ఓ రైస్‌మిల్లు బయట లోపల వాహనాలు సంచులను దించేందుకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఒక్కచోటే కాకుండా నాలుగు జిల్లాల పరిధిలో కాంటా పెట్టిన ధాన్యాన్ని లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. వెళ్లిన వాహనం మళ్లీ తిరిగి రావడానికి ఒక్కో రోజు పడుతోంది. దీంతో తూకం వేసిన బస్తాలు కేంద్రాల్లో నిల్వ ఉంటున్నాయి. కొన్ని రోజుల కిందటి వరకు లారీల కొరత ఉత్పన్నమవడంతో ప్రత్యామ్నాయంగా అధికారులు ఎక్కడికక్కడ ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోవడం, కొత్తగా వచ్చే వాటిని దింపే విషయంలో విపరీతమైన ఆలస్యం జరుగుతుండటంతో కర్షకులకు కల్లాల వద్ద నిరీక్షణ తప్పడం లేదు. ఇప్పటికీ సేకరణ ప్రారంభమైనప్పటి నుంచి మూడుసార్లు వర్షం పడటం వల్ల అన్నదాతలు పంట ఉత్పత్తి నీటి పాలైంది. దీంతో నింగి వైపునకు చూస్తూ రైతులు అమ్మకం గండం గట్టెక్కాలని దేవుణ్ణి వేడుకుంటున్నారు.

ఏ ధాన్యం కేంద్రాల్లో చూసినా కొనుగోళ్ల జాప్యమే కనిపిస్తోంది. సకాలంలో సేకరించకపోవడంతో అన్నదాతలకు విపరీతమైన నష్టం వాటిల్లుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గత నెలలో ఉగాది పండుగ తరువాత ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా తూకాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. తేమశాతం ఎక్కువగా ఉందంటూ కొన్ని చోట్ల కొనుగోళ్లు ఆలస్యం చేస్తున్నారు. సగటున ఒక్కో కేంద్రంలో 50-60 మంది రైతులు నిరీక్షిస్తున్నారు. కేంద్రానికి తీసుకొచ్చిన మూడు నాలుగు రోజుల తరువాత తూకం వేసేందుకు తెచ్చిన ధాన్యానికి అనుమతిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి..**

ఇప్పటి వరకు 5,11,576 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

ఈసారి 10 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించాలని అంచనా వేశారు.

ఇంకా దాదాపుగా 5 లక్షల మెట్రిక్ టన్నులు కల్లాల్లో కొనుగోలు చేయాలి.

నాలుగు జిల్లాల్లో 69,980 మంది అన్నదాతల నుంచి ధాన్యం కొన్నారు.

మరో 50 వేల మంది నుంచి మిగిలిన ధాన్యం సేకరించాల్సి ఉంది.

కేంద్రాల్లో సరైన టార్పాలిన్‌లు లేక కర్షకులు అగచాట్లు పడాల్సి వస్తోంది.

కొన్ని చోట్ల ధాన్యం బస్తాల కొరత కారణంగా కాంటా ఆలస్యమవుతోంది.

# ఆమెకు రక్తం కావాలి..!

నల్గొండ : సాధారణంగా మహిళల్లో 14 శాతానికి మించి హిమోగ్లోబిన్ ఉంటే ఆరోగ్యకరంగా ఉన్నట్లని డబ్ల్యూహెచ్‌వో లెక్కలు చెబుతున్నాయి. కానీ జిల్లాలో ఉన్న 8.25 లక్షల మంది మహిళల్లో 50 నుంచి 60 శాతం మంది మహిళలు హెచ్‌బీ (హిమోగ్లోబిన్) 14 శాతం కంటే తక్కువతో బాధపడతున్నారు. ప్రసవంతో పాటు ఇతర శస్త్రచికిత్సల కోసం కేవలం జనరల్ ఆసుపత్రి మాతాశిశు సంరక్షణ కేంద్రంలోనే రోజుకు 25 నుంచి 30 మంది చేరుతున్నారు. వీరిలో 20 మంది వరకు మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో పాటు నెలసరి రుతుక్రమం మూలంగా ఎక్కువ శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు.

జిల్లా కేంద్రం పరిధిలోని గిరకబాయిగూడెం ప్రాంతానికి చెందిన సౌమ్య(28) ఇంట్లో రోజూవారీ పనులు చేస్తూ వారం క్రితం కింద పడిపోయింది. కారణం తెలియని భర్త వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమెలో కేవలం 4 శాతం మాత్రమే రక్తం ఉందని, తక్షణం రక్తం ఎక్కించాలని సూచించారు.

జిల్లా కేంద్రానికి ప్రసవం కోసం వస్తున్న మహిళల్లో 60 శాతం మందికి రక్తం తక్కువగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. శస్త్రచికిత్స సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని.. అందుకే ముందుగా రక్తం అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వారికి సూచిస్తున్నారు. కారణం ఏదైనా ఇలా నిత్యం రక్తం కోసం వెతుకులాడే వారిలో ఎక్కువ శాతం మంది మహిళలే ఉంటున్నారు.

జంక్‌ఫుడ్ వదిలేయాలి: డా.స్వరూపారాణి, గైనిక్ హెచ్‌వోడి, ఎంసీహెచ్ నల్గొండ

జనరల్ ఆసుపత్రికి శస్త్రచికిత్సల కోసం వచ్చే మహిళల్లో 50 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. పురుషులతో పోల్చితే స్త్రీలకు నెలసరి, ప్రసవం కారణంగా రక్తం తక్కువగా ఉంటుంది. దీనికి తోడు ఎక్కువ మంది జంక్‌ఫుడ్ తీసుకోవడం, కారం ఎక్కువగా తినడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఐరన్ మాత్రలతో పాటు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. గుడ్లు, రోజుకు తగినంత నీరు, బెల్లం ఎక్కువగా ఉండే పదార్థాలు, రాగులు, ములక్కాయలు, పప్పు, కూరగాయలు, పండ్లు, మాంసాహారం తీసుకోవడంతో రక్తం ఎక్కువగా వస్తుంది. వైద్యఆరోగ్యశాఖ అధికారులతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనతతో బాధపడేవారికి పూర్తి స్థాయిల్లో అవగాహన కల్పిస్తున్నాం.

# నెమ్మదిగా.. సాగుతున్న దిద్దుబాట..!

చౌటుప్పల్ : హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై అత్యంత ప్రమాదకర ప్రాంతాల్లో(బ్లాక్ స్పాట్స్) పనులు సాగుతున్నాయి. గతేడాది జూన్‌లో తరచూ ప్రమాదాలు జరిగే 17 ప్రాంతాల్లో పనులను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో ఒక ఫ్లైఓవర్, 13 అండర్‌పాస్ వంతెనలు, 10 చోట్ల సర్వీసు రోడ్డు నిర్మాణాలను చేపడుతున్నారు. 16 బ్లాక్ స్పాట్లు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఉండటం గమనార్హం. మరో బ్లాక్ స్పాట్ ప్రాంతం ఏపీలోని నవాబుపేట వద్ద ఉంది. ఇప్పటికి సగం ప్రాంతాల్లో పనుల్లో వేగం పుంజుకోలేదు. ఈ పనులను హరియాణాకు చెందిన సంస్థ చేపడుతుంది. చౌటుప్పల్‌లో పరిస్థితి మరి దారుణంగా ఉంది. డ్రైనేజి, సర్వీసు రోడ్డు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. తంగడపల్లి రోడ్డు నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు, మీసేవా నుంచి ఆర్డీవో కార్యాలయం వెళ్లే దారి వరకు కంకర వేసి బీటీ వేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లినప్పుడు కంకర ఎగిరి ప్రజలకు తగులుతుంది. టైర్లు కూడా పంక్చర్ అవుతున్నాయని చోదకులు తెలుపుతున్నారు.

**చౌటుప్పల్ నుంచి కోదాడ సరిహద్దు వరకు..**

చౌటుప్పల్ బస్టాండు నుంచి చిన్నకొండూరు రోడ్డు వరకు 150 మీటర్లు ఫ్లైఓవర్ వస్తుంది. మిగతాది మట్టి కట్ట(వెహికల్ అండర్ పాస్)ను నిర్మిస్తారు. పెద్దకాపర్తి, చిట్యాల, కట్టంగూరు జంక్షన్(నల్గొండ రోడ్డు), ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట ఎస్వీకళాశాల- జనగాం కూడలి, జమ్మిగడ్డ కూడలి, దురాజ్‌పల్లి, ముకుందాపురం యూటర్న్ మునగాల, కోమరబండ, కోదాడ, మేళ్లచెర్వు పైవంతెన శ్రీరంగాపురం వద్ద అండర్ పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు కూడా నత్తనడకన నడుస్తున్నాయి. ఏడాదిన్నర కాలంలో పనులను పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ గుత్తేదారు సంస్థను ఆరంభంలోనే ఆదేశించింది. మరో నెల రోజులు గడిస్తే వర్షాలు కురిసే అవకాశముంది. పనులకు ఆటంకం కలగనుంది. వేసవిలో కూడా పనులు వేగంగా చేయకపోతే మరో ఏడాదికి పైగా సమయం పట్టనుంది. చౌటుప్పల్‌లో ఫ్లైఓవర్, అండర్‌పాస్ పనుల ప్రారంభానికి ఇంకా రెండు నెలలకు పైగా సమయం పట్టే అవకాశముంది.

అడ్డుగా అక్రమ నిర్మాణాలు.. దూడల భిక్షంగౌడ్, భాజపా మునుగోడు అసెంబ్లీ కన్వీనర్

చౌటుప్పల్‌లో సర్వీసు రోడ్డు, అండర్‌పాస్ నిర్మాణాలకు అడ్డుగా పలు అక్రమ నిర్మాణాలున్నాయి. వీటిని అధికారులు తొలగించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. పనుల్లో జాప్యానికి కూడా ఇవి కారణంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం పనులను చేపడుతుంటే పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

వేగం పెంచుతాం.. నాగేశ్వర్‌రావు, ఎన్‌హెచ్-65 ప్రాజెక్ట్ డైరెక్టర్

బ్లాక్‌స్పాట్స్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. పెద్దకాపర్తి, చిట్యాలలో అండర్ పాస్ పనులను 50శాతానికి పైగా పూర్తయ్యాయి. తొలుత సర్వీసు రోడ్లు, భూగర్భ మురికి కాల్వ పనులు పూర్తి కావాలి. అండర్ పాస్ పనులకు గోతులు తవ్వి ఫిల్లర్లు నిర్మిస్తాం. ఆ తర్వాత గడ్డర్స్, ప్రికాస్ట్ వాల్స్ అమర్చి మట్టిని నింపుతాం. ఈ పనులు రెండు నెలల్లోనే పూర్తి అవుతాయి. ఇప్పటికే గుత్తేదారు గడ్డర్స్, ప్రికాస్ట్ వాల్స్ సిద్ధం చేసి పెట్టారు. నిర్మాణ పనుల్లో కూడా వేగం పెంచాలని గుత్తేదారుకు సూచిస్తాం.

# భగీరథుడి తీరు.. నిమ్మకు నీరు..!

చిట్యాల : ఏళ్లుగా పెంచుతున్న నిమ్మతోటలను నీటి కొరత నుంచి కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి అవి ఆగి.. ఆగి పోస్తున్న నీటిని బొట్టుబొట్టుగా ఒడిసిపట్టుకుని తోటలను కాపాడుకుంటున్నారు. నకిరేకల్ ఉద్యాన క్లస్టర్ పరిధిలోని పలు గ్రామాల్లో నిమ్మ రైతులు, కూరగాయల పెంపకం రైతులు కరవు పరిస్థితుల్లో తోటలను రక్షించుకునేందుకు నీటి గుంతలను నిర్మించుకుంటున్నారు. చిట్యాలలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు నారబోయిన నర్సింహకు ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో మూడు ఎకరాల్లో నిమ్మతోట ఉంది. ఆయన ఇప్పటి వరకు 20 ఏళ్లలో 36 బోర్లు వేశారు. అందులో ండు బోర్లు మాత్రమే ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం అవి రెండు కూడా ఆగి..ఆగి పోస్తున్నాయి. ఈ నీటిని డ్రిప్‌ద్వారా చెట్లకు పెట్టడం సాధ్యం కావడం లేదు. దీంతో రూ.1.50 లక్షల వ్యయంతో తోటలో 20 అడుగుల లోతు, 30 అడుగుల పొడవు, వెడల్పులతో నీటి గుంతను నిర్మించి పాలిథిన్ షీట్ ఏర్పాటు చేశారు. రెండు బోర్ల నుంచి అరకొరగా వస్తున్న నీటిని ఈ గుంతలో నిల్వ చేసి ఒకేసారి ఒత్తిడితో డ్రిప్ ద్వారా నిమ్మచెట్లకు నీటిని పెట్టి కాపాడుతున్నారు. నేరడ గ్రామానికి చెందిన మరో రైతు సీహెచ్.వెంకన్న రూ.2లక్షలతో పాలిథీన్ షీట్ గుంతను నిర్మించారు. నీటిని నిల్వ చేసి నిమ్మచెట్లను బతికించుకుంటున్నానని వివరించారు. మండలంలో భారీ వర్షాలు వచ్చినపుడు చుట్టుపక్కల ఉన్న చెరువుల్లో నీరు చేరినప్పుడు మాత్రమే బోర్లు ఎక్కువ పోస్తున్నాయని, నీటి వసతులు లేక ఇక్కడ కరవు పరిస్థితి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జాతీయ రహదారి.. ప్రతిపాదనలకే సరి

పెద్దపల్లి : జిల్లాకేంద్రమైన పెద్దపల్లి పట్టణాన్ని జాతీయ రహదారితో అనుసంధానించడం కలగానే మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రెండు మార్గాలను సొంత నిధులతో అభివృద్ధి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఎన్‌హెచ్‌లపై మరికొన్నేళ్లు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దపల్లి నుంచి మంథని మీదుగా కాటారం వరకు ఒకటి, కాల్వశ్రీరాంపూర్ మీదుగా వరంగల్ రామప్ప ఆలయం వరకు మరో మార్గాన్ని జాతీయ రహదారుల కింద అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఇటీవల కేంద్రం సున్నితంగా తిరస్కరించగా రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి మరోసారి అభ్యర్థించేందుకు నేతలెవరూ చొరవ చూపలేదు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సైతం రాజీవ్ రహదారి విస్తరణపై గడ్కరీ దృష్టికి తీసుకొచ్చారే తప్ప జాతీయ రహదారిగా మార్చడంపై అభ్యర్థించలేదు.

**ఆది నుంచి చిన్నచూపే..** పెద్దపల్లి పట్టణం మీదుగా రహదారుల అభివృద్ధిపై మొదటి నుంచీ పాలకుల్లో పట్టింపు లేకుండా పోయింది. రాజీవ్ రహదారికి జాతీయ హోదా కల్పించేందుకు వైఎస్ హయాంలో చేసిన యత్నాలు ఫలించలేదు. దీంతో ప్రపంచ బ్యాంకు సహకారంతో రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను చేపట్టారు. ఇది తెలంగాణలో మొదటి రాష్ట్ర రహదారిగా గుర్తింపు పొందింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాజీవ్ రహదారిపై మూడు టోల్‌గేట్లున్నాయి. దీంతో పాటు కరీంనగర్-రాయపట్నం మార్గాన్ని కూడా రాష్ట్ర



రహదారిగా అభివృద్ధి చేశారు.

**స్థానికుల చిరకాల వాంఛ**

పెద్దపల్లి-మంథని మార్గంలో వాహనాల రద్దీ పెరగడంతో రహదారిని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అయితే నిధుల కొరతతో పాటు మార్గం ప్రాధాన్యత దృష్ట్యా జాతీయ రహదారి కింద కేంద్రానికి ప్రతిపాదించింది.

ఈ రోడ్డును జగిత్యాల నుంచి కాటారం వరకే విస్తరించే విధంగా ప్రతిపాదించారు. కాటారం మీదుగా ఛత్తీస్‌గఢ్ రోడ్డుకు అనుసంధానమవుతుందనే అంశాన్ని ప్రతిపాదనల్లో విస్మరించడంతో జాతీయ హోదా దక్కలేదు.

పెద్దపల్లి-రామప్ప రోడ్డుకు కూడా జాతీయ హోదా ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వమే అభివృద్ధి చేసుకోవాలని, ప్రపంచ బ్యాంకు రుణం ఇప్పిస్తామని కేంద్రం చెప్పింది.

గతంలో రాజీవ్ రహదారికీ ఇదే పరిస్థితి ఎదురైంది. కేవలం పెద్దపల్లి మీదుగా వెళ్లే రహదారులకే జాతీయ హోదా లభించకపోవడం కాకతాళీయమే అయినా ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ మాత్రం అలాగే ఉండిపోతోంది.

**అధ్వానంగా ప్రధాన మార్గాలు** పదిహేనేళ్ల కిందట నిర్మాణం పూర్తయిన జగిత్యాల-పెద్దపల్లి రహదారి గుంతలమయంగా మారింది. గ్రామీణ ప్రాంతాల మీదుగా వచ్చే ఈ రోడ్డుపై ధర్మారం నుంచి జగిత్యాల వైపు ప్రమాదకరమైన మలుపులు న్నాయి. పెద్దపల్లి-మంథని రహదారి కూడా పూర్తిగా దెబ్బతింది. అయిదేళ్ల క్రితం చేపట్టిన మరమ్మతు పనులు కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడంతో మిగిలిన చోట్ల అధ్వానంగా మారింది. పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ మీదుగా వరంగల్ వెళ్లే రహదారిపైనా ప్రమాదకరమైన మలుపులు ఎక్కువగా ఉన్నాయి. విస్తరిస్తే పెద్దపల్లి-జయశంకర్ భూపాలపల్లి జిల్లాల మధ్య రవాణా సౌకర్యం మెరుగవుతుంది.

# మొదట భూగర్భ గనుల్లోకే!

గోదావరిఖని : సింగరేణిలో కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి భూగర్భ గనుల్లోనే విధులు కల్పించనున్నారు. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవు. ఈ మేరకు సీఎండీ ఇటీవల ఆదేశాలు ఇచ్చారు. ఉద్యోగంలో చేరిన మొదట్లో చాలామంది యువకులు సాధ్యమైనంత మేర ఉపరితలల్లోనే పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నా రు. దీంతో భూగర్భ గనుల్లో విధులు నిర్వహించే వారి సంఖ్య తగ్గుతోంది. ఫలితంగా వారిలో పని నైపుణ్యం తగ్గే ప్రమాదం ఉంది. ఇది పరోక్షంగా సంస్థపై ప్రభావం చూపనుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సీఎండీ ఎవరికి మినహాయింపులు లేకుండా కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి తప్పకుండా భూగర్భ గనుల్లోనే విధులు కేటాయించాలని నిర్ణయించారు. దీనివల్ల వారిలో పని నైపుణ్యం పెరిగే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో సంస్థ అభివృద్ధికి అవసరమైన మానవ వనరుల కొరత ఉండదు.

**సాంకేతికత పెరిగినా ముందుకు రాని యువత**

గతంలో కంటే సింగరేణిలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరిగింది. భూగర్భ గనుల్లో ఎక్కువ శాతం యంత్రాలతో చేపట్టే పనులే ఉన్నాయి. అయినా భూగర్భ గనుల్లో పనిచేసేందుకు యువ కార్మికులు ముందుకు రావడం లేదు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల ద్వారా ఇప్పటి వరకు 16 వేల మందికి పైగా చేరారు. కొత్తగా మరో 1000 మంది వరకు నియామక ప్రక్రియలో ఉన్నారు. తట్టా



చెమ్మస్‌తో చేపట్టే పనులు పూర్తిగా లేకుండా పోయినా గనిలోకి దిగేందుకే యువ కార్మికులు వెనుకడుగు వేస్తున్నారు.

**ఉత్పత్తికి మానవ వనరుల కొరత**

సీనియర్ కార్మికులు ఉద్యోగ విరమణ పొందుతుండటంతో బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన ప్రక్రియలు చేపట్టే మానవ వనరుల సంఖ్య తగ్గిపోతోంది. యువ ఉద్యోగులు వాటిని నేర్చుకోవడానికి ఇష్టపడటం లేదు. భూగర్భ బొగ్గు గనుల్లో కోల్‌కటింగ్, సపోర్టుమెన్, రూఫ్‌బోల్టర్, టెండాల్ పనులు కీలకం. సంబంధిత కార్మికుల విధులు పూర్తి కాగానే మైనింగ్ సర్దార్, ఓవర్‌మెన్‌లు, సూపర్‌వైజర్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. బొగ్గు పొరను పేల్చాలంటే ముందుగా కోల్‌కట్టర్‌లు దానికి రంధ్రం వేయాలి. అందులో పేలుడు పదార్థాలు నింపి.. ఆ ప్రాంతంలో పైకప్పు కూలకుండా సపోర్టుమెన్ ద్వారా కర్ర దిమ్మెలు, హైడ్రాలిక్ ప్రాప్స్ బిగించాలి. పైకప్పునకు కూడా రూఫ్‌బోల్టింగ్ చేసి అందులో బోల్టులు అమర్చాలి. బొగ్గు రవాణాకు ట్రాక్ ఏర్పాటు చేసేందుకు టెండాల్ పనులు చేయాలి. భూగర్భ గనిలో కీలకమైన విధులు ఇవే.. కాని కొత్తగా ఉద్యోగంలో చేరిన యువకులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు.

# సంధ్యా కన్వెన్షన్ సెంటర్‌లో కూల్చివేతలు



హైదరాబాద్ : లేఅవుట్‌లోని ఇతరుల ఇళ్ల స్థలాలు, పార్కులు, రహదారులను ఆక్రమించి శ్రీధర్‌రావు అనే వ్యక్తి గచ్చిబౌలిలో నిర్మించిన సంధ్య కన్వెన్షన్ సెంటరు ఆక్రమణలను హైడ్రా నేలమట్టం చేసింది. 6 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో నిర్మించిన రెండు సంధ్యా కన్వెన్షన్ హాళ్లు, వంట గదులు, 10 విశ్రాంతి గదులు, ఆహార విక్రయ కేంద్రాలు, ఇతరత్రా నిర్మాణాలను ధ్వంసం చేసింది. ఈ విషయమై హైడ్రా ప్రకటన విడుదల చేసింది. దేశ, విదేశాల నుంచి ఆయా అక్రమ నిర్మాణాలపై తమకు ఫిర్యాదులు అందాయని, ఆక్రమణదారు అనేక మంది వేధింపులతో ఆర్థికంగా నష్టపోయారంది. ఫిర్యాదుల్లోని వివరాల ఆధారంగా విచారణ చేపట్టి, ఖాళీ స్థలాలు, పార్కుల ఆక్రమణలపై చర్యలు తీసుకున్నట్టు కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ప్రకటించారు. విషయం ఏంటంటే.. 'శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి ప్రధాన రహదారికి ఆనుకుని 1980లో 20 ఎకరాల విస్తీర్ణంలో 162 ప్లాట్లతో ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌ను అభివృద్ధి జరిగింది. దాని పక్కన సంధ్య కన్వెన్షన్ నిర్మాణం చేపట్టిన శ్రీధర్‌రావు.. క్రమంగా మా లేఅవుట్‌లోకి ప్రవేశించారు. లేఅవుట్‌లోని రోడ్లు, పార్కులు, ఖాళీ స్థలాలు, ప్లాట్ల హద్దులను చెరిపేశారు. అతని కన్వెన్షన్ సెంటరుకు అనుబంధంగా మా లేఅవుట్‌లో కొన్ని నిర్మాణాలను అక్రమంగా చేపట్టారు. ప్రశ్నించిన వారిపై ఆయన అనుచరులు దాడి చేశారు. మోసాలను తట్టుకోలేక పలువురు ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనపై ఇప్పటికే భూ కబ్జాలకు సంబంధించి పోలీస్ స్టేషన్లలో 30కిపైగా కేసులున్నాయి. మా లేఅవుట్‌కు సంబంధించి 5కు పైగా కేసులున్నాయి. హైడ్రా న్యాయం చేస్తుందనే ధైర్యంతో.. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ధైర్యంగా ఫిర్యాదు చేస్తున్నాం' అని ఇటీవల బాధితులు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

**కొనసాగుతున్న ఫిర్యాదులు..:** కూల్చివేతల విషయం తెలియగానే..సంధ్య శ్రీధర్‌రావు బాధితులు మంగళవారం మధ్యాహ్నం నుంచి ఆన్‌లైన్ ద్వారా సంప్రదిస్తున్నట్టు హైడ్రా ప్రకటించింది. ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఉద్యోగుల లేఅవుట్ బాధితులతోపాటు.. వేరే ప్రాంతాల్లో తమ భూములను కబ్జా చేశారంటూ శ్రీధర్‌రావుపై ఫిర్యాదులు అందుతున్నాయని హైడ్రా గుర్తుచేసింది.

**15 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా**

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలోని సర్వే నంబరు 354లో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి కాపాడినట్లు హైడ్రా ఓ ప్రకటనలో తెలిపింది. 'రాష్ట్ర ప్రభుత్వం 2009లో రాజీవ్ స్వగృహ సంస్థకు కేటాయించిన భూమిని, కొందరు స్థానిక నేతలు కబ్జా చేసినట్టు స్థానికులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టగా, వాస్తమని తేలింది. ఆక్రమిత భూమిలోని 5ఎకరాలు కె.ఎల్.యూనివర్సిటీ ఆధీనంలో ఉంది. పూర్తి వివరాలతో అధికారులు కమిషనర్ రంగనాథ్‌కు నివేదిక ఇచ్చారు. ఆయన ఆదేశాలతో ఆక్రమణలను తొలగించి ఇది ప్రభుత్వ భూమి తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేశాం.' అని పేర్కొంది. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్‌లోని ఇందిరా సొసైటీ కాలనీలో కొందరు షెడ్లు నిర్మించి, మరికొందరు రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో స్థానికులు ఫిర్యాదు చేయగా విచారించిన హైడ్రా అధికారులు మంగళవారం ఆ ఆక్రమణలు తొలగించింది.

# అసౌకర్యాల ప్రాంగణాలు.. అవస్థల్లో ప్రయాణికులు




పరిగి: జిల్లాలోని ప్రయాణ ప్రాంగణాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. చోరీల కట్టడికి ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పలుచోట్ల సక్రమంగా పనిచేయక చోరీలు పెరిగిపోతున్నాయి. ఫ్యాన్లు అవసరమున్నా ఏర్పాటు చేయడంలేదు. నీటిపంపులు పనిచేయడం లేదు. మహాలక్ష్మి పథకం ప్రారంభం అనంతరం రాకపోకలు పెరిగాయి. అందుకు సరిపడా సౌకర్యాల కల్పన జరగడంలేదు. ఈ నేపథ్యంలో కథనం.

**దుర్వాసన భరించలేకపోతున్నారు**

పరిగి బస్టాండ్ పక్కనే మురుగు పారుతోంది. దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నీటి సౌకర్యం లేని కారణంగా మల మూత్ర విసర్జన పరిసర ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ చేస్తున్నారు. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు కేఎస్ఆర్ ట్రస్టు ఛైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంటు వృథాగా మారింది. రెండు సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి.

**సెల్‌ఫోన్ చోరీలు ఎక్కువ**

కొడంగల్ బస్‌స్టాండ్‌లో సీసీ కెమెరాలు సరిగ్గా లేక అత్యధికంగా సెల్‌ఫోన్ దొంగతనాలు జరుగుతున్నాయి. గత ఆరుమాసాల్లో నాలుగు సెల్‌ఫోన్ కేసులు, రెండు బంగారు దొంగతనం కేసులు నమోదైతే, నమోదుకు ముందుకు రానివెన్నో ఉన్నాయి. ఆర్టీసీ నిర్వాహకుల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నారు. 7 సీసీ కెమెరాలకు ప్రతిపాదనలు పంపించినట్లు కంట్రోలర్ పీఎన్‌రెడ్డి తెలిపారు. నిత్యం పెట్రోలింగ్ చేస్తున్నామని కొడంగల్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

**35 ఏళ్ల క్రితం కట్టినా.. నేటికీ అంతే**

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణాన్ని 35 సంవత్సరాల క్రితం ప్రారంభించగా నాడు కల్పించిన సౌకర్యాలే నేటికీ ఉన్నాయి. సీసీ కెమెరాలు లేవు. ఆరు నెలల క్రితం ఓ మహిళ మెడలో గొలుసును దొంగిలించారు. ఇప్పటి వరకు ఆచూకీ దొరకలేదు. వికారాబాద్ డిపోలో 19 సీసీ, డిపో పరిధిలోని బస్టాండ్‌లలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లేఖ రాశామని విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ నర్సింహులు తెలిపారు.

**ఆవరణంతా అపరిశుభ్రం** జిల్లాలో పెద్దదిగా పేరు ఉన్న తాండూరు ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో చోరీలు అరికట్టడానికి పోలీసులు మొత్తం 5 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా దొంగతనాలు ఆగడం లేదు. గత ఆరునెలల్లో మూడు చోరీలు జరిగితే ఒకదాన్ని మాత్రమే పోలీసులు ఛేదించారు. దీంతో పాటు ప్రాంగణంలో పరిశుభ్రతా చర్యలు కరవవుతున్నాయి. ప్లాట్‌ఫారాలు లేక చెట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అపరిశుభ్రతను తొలగించటానికి, చోరీల కట్టడికి చర్యలు తీసుకుంటామని డిపో మేనేజరు సురేష్ కుమార్ తెలిపారు.

# తవ్వేపోదురుగాక.. మాకేటి సిగ్గు

హైదరాబాద్ : ఇది షాబాద్ మండలం హైతాబాద్ సమీపంలోని సోలిపేట గ్రామంలోని ఎసైన్డ్ భూమి. కొన్ని నెలల క్రితం భూ ఉపరితలానికి సమానంగా ఉండేది. మట్టి కోసం తవ్వడంతో భారీ గుంత ఏర్పడింది. పదిహేను, ఇరవై అడుగుల లోతు వరకు తవ్వేశారు. రాత్రివేళ పొక్లెయిన్లతో మట్టి తవ్వుతున్నా.. లారీల్లో తరలిస్తున్నా.. మైనింగ్ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

చందనవెల్లి, మద్దూరు, సోలిపేట, దైవాలగూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. షాబాద్ మండలంలోని కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు అక్రమ తవ్వకాలకు సూత్రధారులు. రాత్రిపూట పొక్లెయిన్లతో మట్టిని తవ్వి.. షాబాద్, మహేశ్వరం, తుక్కుగూడ, కొంగర్‌కలాన్ ప్రాంతాల్లో ఏర్పాటవుతున్న పరిశ్రమలు, ప్రైవేటు నర్సరీలకు విక్రయిస్తున్నారు. రోజుకు 300 నుంచి 400 ట్రిప్పుల మట్టిని తవ్వేస్తున్నారు. తవ్వుతున్నకొద్దీ రూ.లక్షలే.. శంషాబాద్, షాబాద్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఆయా పరిశ్రమల్లో పునాదులు తీశాక నాణ్యమైన మట్టితో నింపాలని ఇంజినీర్లు సూచిస్తున్నారు. సమీపంలో ఎసైన్డ్ భూములుండడం, వాటిలో పంటలు సాగు చేయకపోవడంతో కొందరు సోలిపేటలోని సర్వే నంబర్ 350లో 110 ఎకరాల ఎసైన్డ్ భూముల్లో మట్టి తవ్వుతున్నారు. ఒక లారీ ఎర్రమట్టిని రూ.5 వేల చొప్పున విక్రయిస్తున్నారు. రోజుకు గరిష్ఠంగా 400 ట్రిప్పులు అనుకుంటే.. వారి ఆదాయం రూ.20 లక్షలు... పొక్లెయిన్, లారీల కిరాయి రూ.వెయ్యి తీసేసినా... రోజుకు రూ.16 లక్షలు సంపాదిస్తున్నారు. ఎర్రమట్టి లారీలను హైతాబాద్,



చందనవెల్లి, షాబాద్ మీదుగా శంషాబాద్ వైపు రాత్రి వేళల్లో పంపుతున్నారు. లారీల రాకపోకలతో రహదారులపై మట్టి పడి ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**రైతులను బెదిరించి..**

షాబాద్ పరిధిలోని కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలకు ఎర్రమట్టి బంగారంలా మారడంతో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. కొందరు రైతులను బెదిరిస్తున్నారు. మరికొందరికి ఎంతో కొంత ఇస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. మీ భూములు 111 జీవోలో ఉన్నాయని బెదిరిస్తున్నారు. 'మీ భూములు సర్కారు తీసుకుంటుంది. డబ్బులు ఎప్పుడొస్తాయో తెలియదు. మేం డబ్బులిస్తామంటూ' నచ్చజెబుతున్నారు. మట్టి తవ్వకాలపై మైనింగ్ శాఖ అధికారులను వివరణ కోరగా వారు స్పందించలేదు.

# అంగన్‌వాడి టీచర్ పోస్టుల భర్తీలో చేతివాటం?

ఎల్లారెడ్డిపేట : అంగన్‌వాడీ టీచర్ల పోస్టుల భర్తీలో కొందరు భారీ మొత్తంలో చేతివాటం ప్రదర్శించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో ఆయాలుగా పనిచేస్తున్న వారికి అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతులు కల్పించారు. పైసలిస్తేనే పదోన్నతులుంటాయంటూ అంగన్‌వాడీ టీచర్ల సంఘం ప్రతినిధులు కొందరు రూ.లక్షల్లో వసూలు చేశారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం ఫిర్యాదు మేరకు సంఘం ప్రతినిధులు ఎదురుగట్ల మమత, కొర్రి సునీత, సింగారపు పద్మలపై గత నెల 26న ఎల్లారెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూడగా ముడుపుల వసూళ్లలో కొందరు అధికారుల హస్తం కూడా ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**జిల్లాలో మొత్తం 13 మంది నియామకం**

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసీడీఎస్) పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషకాహారలోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం కొత్తగా వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో మొత్తం 587 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 53 అంగన్‌వాడీ టీచర్లు, 159 మంది ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరో 14



కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కూడా లేరు. ఈ నేపథ్యంలో ఆయాలకు అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు గతేడాది డిసెంబరులో మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులు విడుదల చేసింది. ఇంటర్మీడియట్ విద్యనభ్యసించి అయిదేళ్లపాటు ఆయాలుగా పనిచేసి ఉండాలని లేదా పదో తరగతి చదివి పదేళ్లపాటు ఆయాలుగా కొనసాగినవారై ఉండాలనే నిబంధన విధించారు. ఈ మేరకు సిరిసిల్ల ఐసీడీఎస్ కింద 12 మంది, వేములవాడ ఐసీడీఎస్ పరిధిలో ఒకరికి అంగన్‌వాడీ టీచర్లుగా డిసెంబరు 28న పదోన్నతులు కల్పించారు. కాగా పదోన్నతులు రావాలంటే రూ.లక్ష చొప్పు చెల్లించాలని పేర్కొంటూ ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ముగ్గురు అర్హులైన ఆయాలు ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. విషయం బయటకు పొక్కగానే జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

**విచారణ కొనసాగుతోంది**

ఆయాలకు అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పించే విషయంలో డబ్బుల వసూళ్లపై విచారణ కొనసాగుతోంది. ఉన్నతాధికారుల హస్తముందనే ఆరోపణలు అవాస్తవం. పదోన్నతుల కోసం ఎవరూ డబ్బులు ఇవ్వవద్దని.. ఎవరి మాటలూ నమ్మవద్దని చాలా సార్లు చెప్పాం. సిరిసిల్ల ఐసీడీఎస్ పరిధిలో ముగ్గురి వద్ద రూ.3 లక్షలు తీసుకోవడంతోపాటు మరొకరిని బెదిరించినట్లు మా వద్ద సమాచారం ఉంది. 13 మంది ఆయాలకు అంగన్‌వాడీ టచర్లుగా పదోన్నతులు కల్పించగా మిగతా కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమాధికారి

# అక్రమ నిర్మాణాలకు అడ్డేది?

సిరిసిల్ల : వర్షాకాలం వచ్చిందంటే చాలు.. చెరువుల సమీపంలోని నివాస ప్రాంతాల వారికి వణుకు మొదలవుతుంది. జలవనరులు, నాలాల సమీపంలో ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలో నిర్మాణాలు చేపట్టిన వారికి ముంపు భయం పొంచి ఉంది. సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లో చెరువులకు హద్దులు ఏర్పాటు చేసేందుకు అధికారులు నేటికీ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ఫలితంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిలో ఆక్రమణల పర్వం జోరుగా సాగుతోంది. పట్టణంలోని కార్గిల్‌లేక్ 12.36 ఎంసీఎఫ్‌టీలు. ఎగువన వరదనీరు వచ్చేందుకు కాల్వలు ఉన్నాయి. ఈ చెరువు అలుగు పారితే ఆ నీరంతా దిగువన మానేరువాగులోకి వెళ్లాలి. వరదనీరు వెళ్లే కాల్వను పూడ్చేసి రియల్ వ్యాపారులు ప్లాట్లుగా చేసి విక్రయించారు. చెరువులోకి వరదనీరు పోటెత్తితే ఎగువన ఉన్న తారకరామానగర్, ఇందిరానగర్ కాలనీలు ముంపునకు గురవుతాయి. ముష్టిపల్లి,



చిన్నబోనాల, కార్గిల్‌లేక్, చంద్రంపేట ప్రాంతాల్లో రియల్ వ్యాపారులు ప్లాట్లకోసం నాలాలను ఆక్రమించి విక్రయించేస్తున్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, నాలాల పరిధిలో ఇళ్ల నిర్మాణాల కోసం సిరిసిల్ల పురపాలికలో 75 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. రగుడు మల్లన్నకుంటను చదునుచేసి పంటలు సాగుచేస్తున్నారు. వేములవాడ పట్టణంలోని మూలవాగు వెంబడి బఫర్ జోన్ గుర్తించలేదు. దీంతో ఈ వాగువెంట నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో 40 నిర్మాణాలను పురపాలిక అధికారులు బఫర్‌జోన్‌లో ఉన్నట్లు గుర్తించారు.

**సీఅండ్‌డీ లేక**

రెండు పురపాలికల్లో నెలకు సగటున 25 టన్నుల నిర్మాణ వ్యర్థాలు వెలువడతాయి. నిర్మాణ వ్యర్థాలను పునరుత్పాదక వనరుగా మార్చేందుకు సీఅండ్‌డీ (కన్‌స్ట్రక్షన్ అండ్ డెబ్రిస్) మేనేజ్‌మెంట్ ప్లాంటు లేదు. ఆ వ్యర్థాలన్నీ చెరువులు, మానేరు, మూలవాగుల్లోకి చేరుతు న్నాయి. జలవనరులు కనుమరుగయ్యేందుకు, ఆక్రమణలకు ఇవి కారణం అవుతున్నాయి. నిర్మాణ వ్యర్థాల తరలింపును నిలువరించాల్సిన పురపాలిక, రెవెన్యూశాఖల అధికారులు ఆ దిశగా చర్యలేవీ చేపట్టడంలేదు.

సిరిసిల్ల పట్టణంలో ఈదుల చెరువు సామర్థ్యం 26.67 ఎంసీఎఫ్‌టీలు. ఎగువన కోనరావుపేట మండలం నుంచి గొలుసుకట్టు చెరువుల ద్వారా ఇందులోకి వరదనీరు వస్తుంది. ఇది నిండిన అనంతరం కొత్తచెరువులోకి నీరు చేరుతుంది. ప్రస్తుతం ఈ చెరువు సగానికిపైగా కబ్జా అయింది. రాజీవ్‌నగర్, చంద్రంపేట రెండువైపులా నిర్మాణవ్యర్థాలతో చదునుచేస్తూ తాత్కాలిక కట్టడాలు చేపడుతున్నారు. ఈ చెరువు ఎఫ్‌టీఎల్‌లో 48 ఇంటి నిర్మాణాలు వెలిశాయి.

## విడిదిల్లు.. విందులతో చిందు

మొయినాబాద్ : 'మత్తు.. మజా.. కలిపితే ముజ్రా'.. రాజధాని శివారులో మరోసారి సాగుతున్న రేవ్‌పార్టీలను మించిన సరికొత్త అశ్లీల నృత్య వినోదం వెలుగు చూసింది. సైబరాబాద్ ఎస్‌వోటీ బృందం నిఘా లోపాన్ని ఎత్తి చూపుతోంది. శివారుల్లో విడిదిళ్లు (ఫాంహౌస్‌లు), వ్యవసాయక్షేత్రాలు, రిసార్టులలో రేవ్ పార్టీలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నా పట్టుకునే నాథుడే కరవయ్యారనే విమర్శలు ఉన్నాయి. కొంతమంది పోలీసులు తెరవెనుక సహకారమందిస్తూ ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 5 వరకు జరిగే ఈ తంతులో యువతులు పాటలకు అనుకూలంగా నాట్యం చేస్తూ హద్దులు దాటుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వాళ్లు రాజధాని శివార్లకు వచ్చి మరీ విందులు చేసుకుంటున్నారు.

**కమిషనర్ ఆగ్రహంతోనే..** సైబరాబాద్ కమిషనరేట్ పరిధి ఇంజినీరింగ్



కళాశాలల ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వెలుగు చూస్తోంది. కమిషనర్ ఆగ్రహంతోనే పోలీసులు నిఘా పెంచి ముజ్రాపార్టీని భగ్నం చేశారనే ప్రచారం జరుగుతోంది.

**పోలీసుల అదుపులో 20 మంది..** మొయినాబాద్ మండలం ఎత్బార్‌పల్లిలోని 'హలిదే హెవెం' ఫాంహౌస్‌లో బోరబండకు చెందిన అబ్దుల్ లుక్మన్(35) పుట్టినరోజు సందర్భంగా స్నేహితులకు విందు ఏర్పాటు చేశారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాతనగరం, బాగ్‌లింగంపల్లి, మాసబ్‌ట్యాంక్, బోయిన్‌పల్లి, లింగంపల్లి, ఖైరతాబాద్, గోల్కొండ, ఆసిఫ్‌నగర్, జీడిమెట్ల, యూసుఫ్‌గూడ, బోరబండ ప్రాంతాలకు చెందిన 13 మంది స్నేహితులతోపాటు సికింద్రాబాద్, రాజేంద్రనగర్, రాంనగర్, మెహిదీపట్నంకు చెందిన ఏడుగురు యువతులను విందుకు ఆహ్వానించారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు దాడి చేసి 20 మందిని అదుపులోకి తీసుకొని మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు. యువతుల్లో ఇద్దరు గతంలో ముజ్రాపార్టీలో పాల్గొని పోలీసులకు చిక్కారు. పార్టీ నిర్వహణలో వారికి అనుభవం ఉండటంతోనే అబ్దుల్ లుక్మన్ వారిని సంప్రదించారని ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గంజాయి, హుక్కా, విదేశీ మద్యం సీసాలతోపాటు కండోమ్ ప్యాకెట్లు దొరకడం గమనార్హం. డీజేసౌండ్ సిస్టం, చరవాణులు, కార్లతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు.

## సహాయ ఆచార్యుల పోస్టులు 'ఈసీ'గా భర్తీ

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో ఆరు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల పోస్టులను భర్తీ చేసేందుకు విశ్వవిద్యాలయ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. పోస్టులను భర్తీ చేసేందుకు న్యాయపరంగా, సాంకేతికంగా కార్యనిర్వాహక కమిటీలు (ఈసీ)లు ఉండాలి. నగరంలోని 6 వర్సిటీల్లో ఒక్క విశ్వవిద్యాలయంలోనూ పూర్తి స్థాయిలో ఈసీలు లేకపోవడంతో తొలుత వీటిని నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాల దృష్ట్యా పూర్తిస్థాయి కార్యనిర్వాహక కమిటీని ఏర్పాటు చేయాలని ఉన్నత



విద్యామండలి వీసీలను ఆదేశించింది. దీంతో వర్సిటీల్లో పరిపాలనా విభాగంలో విధులు నిర్వహించిన ఆచార్యులు, విద్యానిపుణులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల పేర్లను అధికారులు పరిశీలిస్తున్నారు. ఉస్మానియా, సురవరం ప్రతాపరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహిళా విశ్వవిద్యాలయం వీసీలు, రిజిస్ట్రార్లు వేర్వేరుగా ఈసీలో సభ్యుల నియామకాలపై సీనియర్ ప్రొఫెసర్లతో చర్చించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సభ్యుల ఎంపికను వీలైనంత వేగంగా పూర్తిచేయాలని, విద్యానిపుణులు, అనుభవజ్ఞులకు ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించారు. సభ్యుల ఎంపిక పూర్తయ్యాక జాబితాను ఉన్నత విద్యామండలికి పంపి ఆమోదం పొందనున్నారు.

## మిల్లుల్లోకి ఆమె..!

మిర్యాలగూడ :గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. మహిళా సమాఖ్యలకు రైస్ మిల్లులు నిర్మించి ఇస్తామని అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు జిల్లాలోని ఆరు నియోజకవర్గాల మహిళా సమాఖ్యలను గుర్తించి వారికి రైస్ మిల్లులు నిర్మించి ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పౌరసరఫరాలు, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించగా ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**జిల్లాలో పరిస్థితి** నల్గొండ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో నిర్మించాలని నిర్ణయించారు. దీనికి ప్రభుత్వ భూమి ఒకటిన్నర ఎకరాలు అందుబాటులో ఉన్న చోట ఎంపిక చేసి ఉచితంగా అందించనున్నారు. మిర్యాలగూడ, నల్గొండ, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్ , నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో అందుబాటులో ఉన్న స్థలాలను పరిశీలిస్తున్నారు. నాలుగు మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన మిల్లు నిర్మాణానికి రూ.3.50 కోట్లు, యంత్ర సామగ్రికి రూ.1.10 కోట్లు, సార్టెక్స్ యంత్రానికి రూ.75 లక్షలు ( మట్టి పెళ్లలు, రాళ్లు బెరుకులు తొలగించే యంత్రం)తో నిర్మించాలని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నల్గొండ జిల్లాలో 31 మండలాలు ఉండగా 32 మండల మహిళా సమాఖ్య, ఒక జిల్లా సమాఖ్య ఉంది. వీటిలో మంచిగా చేస్తున్న మండల సమాఖ్యలను అనుసరించి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంపిక చేసి రైస్‌మిల్లుల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ పరిశీలించి స్థలం ఎంపిక చేసిన తర్వాత విజయవంతంగా నిర్వహిస్తున్న మహిళా సమాఖ్యలను ఎంపిక చేయనున్నారు. మిల్లుల నిర్వహణకు, ధాన్యం కొనుగోళ్లు పెట్టుబడులకు నాబార్డ్ రుణాలు తీసుకుంటే మహిళా సంఘాలకు అప్పులు తప్పవు పెట్టుబడి అవసరం లేకుండానే ప్రభుత్వం భరోసా ఇస్తుంది. ఐకేపీ ధాన్యం, కస్టమ్ మిల్లింగ్ నిధులు, వ్యాపారంలో లాభాల ఆధారంగా రుణాలు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత అర్హత కలిగిన మండల సమాఖ్యలను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు.

# పొదుపు పాటిద్దాం.. వేసవి దాటేద్దాం



హైదరాబాద్:ఎండలు మండిపోతుండటంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇంట్లో ఫ్యాన్‌లు, ఏసీలు, కూలర్లు గంటల తరబడి వినియోగిస్తుండటంతో మీటర్ గిర్రున తిరుగుతోంది. నెలాఖరులో బిల్లు చూసి గొల్లుమనడం సామాన్యుడి వంతవుతోంది. గ్రేటర్‌లో ఫిబ్రవరిలో సగటు డిమాండ్ 2,715 మెగావాట్లు, మార్చిలో 3,714కు పెరిగింది. మేలో 5వేలకు చేరుకోనుందని అధికారులు అంచనా. వినియోగంలో జాగ్రత్తలు, పొదుపుమంత్రం పాటించకపోతే జేబుకు చిల్లు పడటం ఖాయంగా కనిపిస్తోంది.

**పెరుగుతున్న విద్యుత్ డిమాండ్..** వెస్ట్‌మారేడ్‌పల్లిలో ఉండే కుమార్ ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ఏసీ కొనుగోలు చేశారు. రోజుకు 8గంటల చొప్పున నెల రోజుల వినియోగించారు. మార్చి నెలలో రూ.2,880 కరెంట్ బిల్లు వచ్చింది. ఒక్కసారిగా అంత బిల్లు రావడంతో ఆందోళన చెందిన కుమార్.. మే నెలాఖరు వరకు ఎలా నెట్టుకు రావాలనే ఆయోమయంలో పడ్డారు. గది ఉష్ణోగ్రతను ప్రభావితం చేసే ఎలక్ట్రిక్ ఉపకరణాలు టీవీ, రిఫ్రిజిరేటర్, ఓవెన్ వంటివి వాడకూడదు.

నిర్వహణను విస్మరించడంతో ఏసీల్లో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఫిల్టర్లు మార్చకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎల్ఈడీ బల్బుల వినియోగం, ఇన్వర్టర్ ఏసీలు, గదిలోకి రాగానే గుర్తించి వెలిగేలా సెన్సర్లు ఏర్పాటు చేసుకోవాలి.

ఏసీని వినియోగిస్తున్నప్పుడు గది ఉష్ణోగ్రతను లెక్క చేయకుండా 16 నుంచి 18 డిగ్రీలు పెట్టడంతో లోడ్ పెరిగి ఎక్కువ విద్యుత్ ఖర్చవుతోంది. అందుకు 24 డిగ్రీల ఉష్ణోగ్రత గదిలో ఉండేలా చూసుకోవాలి. గది చల్లబడే వరకు ఫ్యాన్ వేస్తే గది త్వరగా చల్లబడి ఏసీపై భారం తగ్గుతుంది.

వినియోగం తగ్గించే పరికరాలు..

విద్యుత్ వినియోగం తగ్గించుకునేందుకు అనేక రకాల ఉత్పత్తులు మార్కెట్‌లోకి వచ్చాయి. 'పవర్ సేవర్' పేరుతో అందుబాటులో ఉన్నాయి. సాకెట్‌లో వీటిని బిగించగానే విద్యుత్‌లోడ్ హెచ్చుతగ్గులను క్రమబద్ధీకరిస్తున్నాయి.

స్మార్ట్ ప్లగ్ - రాత్రి ఏసీ ఆన్ చేస్తే ఉదయం వరకు నడుస్తూనే ఉంటుంది. గది చల్లబడినా వినియోగం పెరుగుతోంది. నియంత్రించేందుకు మార్కెట్‌లోకి 'స్మార్ట్‌ప్లగ్' అందుబాటులోకి వచ్చింది. ఏసీ, ప్రధాన సాకెట్‌కి అనుసంధానం చేయడంతోపాటు యాప్‌తో చరవాణికి అనుసంధానించొచ్చు. యాప్‌లోని 'షెడ్యూల్ ఆన్-ఆఫ్' ఫీచర్‌తో రోజువారీ వినియోగాన్ని సగానికి తగ్గిస్తుంది.

# పల్లె మురిసె.. ఖ్యాతి మెరిసె!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో నిలబెట్టే విధంగా పలు గ్రామ పంచాయతీలు ఆదర్శనీయ పంథాను చూపించాయి. ఏడు పల్లెలు జాతీయ స్థాయిలో పురోగతి సూచికలో ముందువరుస (ఫ్రంట్ రన్నర్) విభాగంలో మంచి మార్కులను సాధించాయి. కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ విడుదల చేసిన ర్యాంకుల్లో రాష్ట్రస్థాయిలో తొలి 25 స్థానాలున్న జాబితాలో మన పల్లెలే ఏడు ఉండటం గమనార్హం.

**వసతుల్లో 'అద్వితీయం'**

మండల కేంద్రమైన తిమ్మాపూర్ రాష్ట్ర స్థాయి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించిన గ్రామాల జాబితాలో 82.79 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వైకుంఠధామం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ప్రభుత్వ, ప్రైవేటు బడులు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండటంతో ఈ గ్రామం మెరుగైన మార్కులను పొందింది. ఉపాధి అవకాశాలున్న పంచాయతీగా సూచికలో ముందు వరుసలో నిలిచింది.

**గంగ్రపల్లి ఉత్తమంగా..** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గంగ్రపల్లి గతంలోనూ ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. పరిసరాల శుభ్రతతోపాటు ఇంటింటికీ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకునే విషయంలో ప్రత్యేకతను చాటిన పల్లెగా గుర్తింపు పొందింది. 1500 జనాభా కలిగిన ఈ చిన్న పల్లె వంద శాతం సీసీరోడ్ల నిర్మాణంతోపాటు స్వచ్ఛతకు లోగిలిగా గుర్తింపు అందుకుంది. గత పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధతో పల్లె ప్రకృతి వనాలతోపాటు క్రీడా ప్రాంగణాలను సుందరంగా తీర్చిదిద్దారు. 2021-22లోనూ పూర్తిస్థాయిలో నీటి సౌకర్యం ఉన్న గ్రామంగా జిల్లాస్థాయిలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ వికాస్ పురస్కారాన్ని ఈ గ్రామం అందుకుంది.

**ఉపాధి కల్పన ఊరుగా..**

పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం శివపల్లి గ్రామ జనాభా 1,597 కాగా.. ఉపాధి హామీ పనులను వీలైనంత ఎక్కువ మందికి కల్పించడంతో గ్రామస్థుల ఆర్థికాభ్యున్నతికి దోహదపడింది. గ్రామంలో అభివృద్ధి పనులకు ఉపాధి హామీని వరంగా మలుచుకున్నారు. చెరువుల పూడికతీత, కాలువల మరమ్మతుతో కూలీలకు వేతనం అందించే విధంగా పంచాయతీ సభ్యులు చొరవ చూపించారు. 398 గడపలున్న ఈ పల్లెలో మంచినీటికి కొరత రాకుండా ప్రత్యేకమైన ప్రణాళికతో తాగునీటిని ఇంటింటికి అందించడంలో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. గ్రామం అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలబడాలనే తపన ఇలా సుస్థిర అభివృద్ధి ప్రగతి రూపంలో సాకారమైంది.

**ఆరోగ్యపరమైన అంశంలో..**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం బండపల్లి గ్రామం ఆరోగ్యపరమైన అంశంలో మంచి పురోగతిని అందుకుంది. 2,500 జనాభా కలిగిన ఈ గ్రామంలో మొత్తం 690 కుటుంబాలున్నాయి. ఇక్కడ గ్రామ పంచాయతీ ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిచ్చే చర్యలు తీసుకుంది. మురుగు కాల్వలను శుభ్రపర్చడంతోపాటు చెత్తాచెదారం నిల్వ ఉంచకుండా చేస్తూ పరిసరాల శుభ్రతతో ఆరోగ్యానికి బాటలు వేశారు. వచ్చిన నిధులను ప్రణాళిక ప్రకారంగా సద్వినియోగపర్చుకోవడంలో ప్రత్యేక చొరవను చూపించి పల్లెను ఆదర్శంగా నిలబెట్టారు.

# అందని 'పట్టా' పాసుపుస్తకం




ధర్మపురి : భూపట్టా పాసు పుస్తకాలు సకాలంలో అందక రైతులు అనేక విధాలుగా నష్టపోతున్నారు. ధరణిలో స్లాట్ బుక్ చేసుకుని భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి పాసు పుస్తకాలు భూపరిపాలన ముఖ్య కార్యాలయం పోస్ట్ ద్వారా పంపిస్తోంది. ఇప్పటివరకు 30 నుంచి 120 రోజుల మధ్య పుస్తకాలు రైతులకు అందుతుండేవి. కాని అందుకు నెలలుగా అందడం లేదు. జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉన్నాయి. చిన్న మండలాల్లో మినహా పెద్ద మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో రోజుకు కనీసం పది నుంచి పదిహేను మాత్రమే భూరిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. వీరిలో వందల మంది రైతులు పాసుపుస్తకాల కోసం ఎదురుచూస్తున్నారు.

**ప్రయోజనాలు దూరం**

పాసు పుస్తకాలు సకాలంలో రాకపోవడంతో రాయితీ ఎరువులు, ప్రభుత్వ పథకాలు, రుణాలకు రైతులు దూరం అవుతున్నారు. గతంలో కూడా ఇదే పరిస్థితి ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం చాలామంది రైతులు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, రైతు భరోసా వంటి పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోతోంది.

**ముద్రణలో నాణ్యత లేక ఇబ్బందులు**

పాసుపుస్తకం ఉన్నవాళ్లు భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఉన్నదాంట్లోనే ప్రింట్ వస్తోంది. ప్రింట్ సరిగ్గా కనిపించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిరాక్స్ తీయిస్తే ప్రింట్ కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లోనే ముద్రణ సామగ్రిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్థికభారం, ఉదాసీనతతో ప్రింటింగ్‌కు సంబంధించిన సామగ్రి కొనుగోలు చేయకపోవడంతో సమస్య ఏర్పడిందని రైతులు ఆరోపిస్తున్నారు.

**నాలుగు నెలలుగా..**

నా భర్త చనిపోతే 14 గుంటల భూమిని నాలుగు నెల కిందట విరాసత్ చేయించుకున్నాను. పాసు పుస్తకం ఇప్పటికీ రావడం లేదు. అధికారులను అడిగితే వస్తుందని చెబుతున్నారు. పాసు బుక్కు రాకపోవడంతో పలు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోలేక పోతున్నాను.-దాసొజ్జ నీలమ్మ, నేరెళ్ల

**కచ్చితంగా వస్తాయి**

పాసు బుక్కులు తప్పనిసరిగా వస్తాయి. ఆలస్యమవుతుందవచ్చు కానీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి ఒక్కరికి పాసు పుస్తకం పోస్ట్ ద్వారా అందుతోంది.-కృష్ణచైతన్య, తహసీల్దార్, ధర్మపురి

## సొమ్ము వచ్చేసింది..!

భువనగిరి : జిల్లాలోని ఆయిల్‌పాం సాగు చేసిన రైతులకు మంచి రోజులు వచ్చాయి. ప్రభుత్వ పరంగా వచ్చే ప్రోత్సాహం, రాయితీ డబ్బుల కోసం నాలుగేళ్లుగా వారి ఎదురు చూపులు ఫలించాయి. ఎట్టకేలకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం, రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవనున్నట్లుగా అధికార వర్గాలు వెల్లడించాయి. సంబంధిత వివరాలు క్లుప్తంగా..

**ఉపాధిహామీతో గుంతలు, రాయితీపై మొక్కలు..** జిల్లాలో 2021-22 సంవత్సరం నుంచి ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు ఆయిల్‌పాం సాగును ప్రారంభించారు. మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు ఉపాధిహామీ పథకం కింద తీయించడంతో పాటు రాయితీపై మొక్కలను ప్రభుత్వం అందించింది. మొక్కలకు నీరందించేందుకు బిందుసేద్యం పరికరాలు కూడా రాయితీపై అందించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 4,107 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్నారు. ఈ తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం మొక్కల సరఫరా, సంరక్షణ, అంతర పంటల సాగు, యాజమాన్య నిర్వహణ ఖర్చులు ఇలా అన్నీ కలిపి ఎకరాకు రూ.58,918ల చొప్పున ప్రోత్సాహకంగా అందిస్తామని అప్పట్లో ప్రభుత్వం తెలిపింది.

## మొరాయిస్తున్న సర్వర్.. లబ్ధిదారుల ఒక్కట్లు

కోనరావుపేట: ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్ఠాత్మకంగా రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. కాగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీకి ఈ-పోస్ యంత్రాల సర్వర్ మొరాయించడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. బియ్యం తీసుకునేందుకు పలుమార్లు రేషన్ దుకాణాలకు రావాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పాత రేషన్‌కార్డులు-1,73,728, కొత్తగా మంజూరైన కార్డులు 9,731 ఉన్నాయి. జిల్లాలో 12 మండలాలు, రెండు పురపాలికల్లో మొత్తం 345 చౌక ధరల దుకాణాలు ఉండగా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో సుమారు ఐదు లక్షలకు పైగా ఉన్న లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున నెలకోటా సుమారు 3,300 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. సాంకేతిక లోపం కారణంగా ఈ-పోస్ యంత్రం పనిచేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. లోపాన్ని సరిదిద్ది బియ్యం సక్రమంగా పంపిణీ చేసేలా



అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**నాలుగు సార్లు వచ్చా**

మా కుటుంబంలో నలుగురికీ కలిపి 24 కిలోల బియ్యం వస్తాయి. ప్రభుత్వం అందించే సన్నబియ్యం తీసుకోవడానికి రేషన్ దుకాణానికి నాలుగుసార్లు వచ్చాను. ఈ-పోస్ యంత్రంపై వేలిముద్ర వేయాల్సి ఉండగా సర్వర్ పనిచేయడం లేదు. దీంతో రేషన్ బియ్యం కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. సాంకేతిక అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తే బాగుంటుంది.

**మెండె లక్ష్మి, లబ్ధిదారు, నాగారం**

20 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ

నాకు సుమారు 90 క్వింటాళ్లకు పైగా బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది. రెండు విడతలుగా బియ్యం సరఫరా చేశారు. మొదటి విడత 20 క్వింటాళ్లు, రెండవ విడత 70 క్వింటాళ్ల మేర వచ్చాయి. ఐదారు రోజులుగా ఈ-పోస్ యంత్రంలో సర్వర్ మొరాయించడంతో సాంకేతిక సమస్య తలెత్తుతోంది. ఉదయం, సాయంత్రం కొద్ది సమయమే సర్వర్ పనిచేస్తోంది.

సైండ్ల అంజయ్య రేషన్ దుకాణదారుడు నాగారం


అధికారుల దృష్టికి సమస్య

బియ్యం పంపిణీకి ఈ-పోస్ యంత్రంలో తరచూ సర్వర్ మొరాయించటం, సాంకేతిక సమస్య వస్తున్నట్లు రేషన్ దుకాణదారులు మా దృష్టికి తీసుకువచ్చారు. గతంలో బియ్యం పంపిణీ సజావుగానే కొనసాగింది. ప్రభుత్వం ఈ-పోస్ యంత్రంలో నూతన సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసింది. ఒకటి, రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. నరేశ్ ఈ-పోస్ యంత్రం సాంకేతిక నిపుణుడు

## పొదుపుతోనే 'గృహలక్ష్మి'

జగిత్యాల : జగిత్యాల పట్టణానికి చెందిన శేఖర్ 200లోపు యూనిట్లు వాడుతుండటంతో గృహలక్ష్మి(జీరోబిల్లు) లబ్ధి పొందారు. మార్చిలో విద్యుత్తు వాడకం 201 యూనిట్లు ఉండడంతో రూ.1028 బిల్లు వచ్చింది. దీంతో గృహలక్ష్మి లబ్ధి అందలేదు. ఇలా జిల్లాలో దాదాపు 10 నుంచి 20 వేలకు పైగా లబ్ధిదారులు విద్యుత్తు వినియోగం పెరిగి జీరోబిల్లుకు దూరమయ్యారు.

ప్రభుత్వం నిరుపేదల కోసం ఉచిత విద్యుత్తు(గృహలక్ష్మి) పథకాన్ని ప్రవేశపెట్టినా వినియోగం 200 యూనిట్లు దాటడంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గుతోంది. జిల్లాలో మొత్తం 5,04,252 విద్యుత్తు కనెక్షన్లు ఉండగా 3,56,526 గృహ కనెక్షన్లు ఉన్నాయి. గతేడాది అక్టోబరులో పరిశీలిస్తే 1,94,544 మంది లబ్ధిదారులు ఉచిత విద్యుత్తు పథకం కింద రూ.7.47 కోట్లు లబ్ధిపొందగా నవంబరులో 1,93,996



మందికి రూ.7.78 కోట్లు లబ్ధికలిగింది. డిసెంబరులో చలికాలం కావటంతో వాడకం తగ్గి 2,01,340 మంది రూ.5.56 కోట్లు మాత్రమే లబ్ధిపొందారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలోనూ 2 లక్షలకుపైగా లబ్ధిపొందారు. ఏప్రిల్ నెలలో ఎండలు ముదరటంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గినట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరుకు బిల్లుల నమోదు పూర్తయితే లబ్ధిదారుల సంఖ్య లక్ష ఎనభై వేలకు తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వేసవి ప్రారంభంలో ఎండలు మండిపోతుండటంతో విద్యుత్తు వాడకం బాగా పెరిగి ఉచిత విద్యుత్తు పథకానికి లబ్ధిదారులు దూరమవుతున్నారు. పొదుపుగా 200 యూనిట్లలోపు వాడుకుంటే ఉచిత విద్యుత్తు పథకానికి అర్హులని ఎస్‌ఈ సాలియా నాయక్ వినియోగదారులకు సూచిస్తున్నారు. ఉక్కపోత పెరగడంతో ఉదయం 9 గంటల నుంచే కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు వినియోగిస్తున్నారు. ఇనుప కూలర్లు వాడితే విద్యుత్తు వాడకం బాగా పెరుగుతుందని, నాణ్యమైన బీఈఈ కంపెనీ కూలర్లు వాడాలని సూచిస్తున్నారు. ఏసీలు 26 డిగ్రీలు ఉండాలని, ఎల్ఈడీ బల్బులు, నాణ్యమైన బీఎల్‌డీసీ గుర్తింపున్న ఫ్యాన్లు వాడాలని పేర్కొంటున్నారు. యాసంగి కోతలు మొదలైన నేపథ్యంలో రైతులు మోటార్ల వద్ద ఆటో స్టార్టర్లు తొలగించుకోవాలని కోరారు.

# ఉద్రిక్తతల వేళ.. అంతటా అప్రమత్తం!



విశాఖపట్నం : పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో యుద్ధం జరిగితే పౌరులు ఏ విధంగా స్పందించాలనే అంశంపై 'మాక్ డ్రిల్' నిర్వహించాలని కేంద్ర హెూంశాఖ రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసింది. తెలుగు రాష్ట్రాల్లో కేటగిరి-2లో ఉన్న విశాఖలో బుధవారం సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో రెండు చోట్ల మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. సైరన్లు మోగించినప్పుడు, దాడుల సమయంలో ఎలా స్పందించాలో అవగాహన కల్పించనున్నారు.

**విశాఖపైనే దృష్టి ఎందుకంటే..**

యుద్ధం వస్తే చాలా అప్రమత్తంగా ఉండాల్సిన ప్రాంతాల్లో విశాఖ ఒకటి. ఎందుకంటే... తూర్పునౌకాదళ ప్రధాన స్థావరం విశాఖలోనే ఉంది. డీఆర్‌డీవో పరిధిలోని ఎన్ఎస్‌టీఎల్ (నేవల్ ప్రయోగశాల), జెట్ ఫైటర్లు, మిగ్-29కేలకు శిక్షణ ఇచ్చే ఐఎన్ఎస్ డేగ, మెరైన్ కమెండోలకు శిక్షణ ఇచ్చే ఐఎన్ఎస్ కర్ణ, సబ్‌మెరైన్‌లో పనిచేసేవారికి శిక్షణ ఇచ్చే ఐఎన్ఎస్ శాతవాహన ఇక్కడే ఉన్నాయి.

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్), యుద్ధ నౌకల నిర్మాణం, పాతవాటికి కొత్త జవసత్వాలిచ్చే హిందూస్థాన్ షిప్ యార్డు ఉన్నాయి. ముంబై తర్వాత ఎక్కువ సామర్థ్యం ఉన్న హెచ్‌పీసీఎల్‌కు సంబంధించిన భారీ రిఫైనరీ విశాఖలో ఉంది. డాల్ఫిన్‌నోస్ వద్ద వ్యూహాత్మక ముడి చమురు నిల్వల కేంద్రం పూర్తి రక్షిత ప్రదేశంలో భూగర్భంలో ఉంటుంది. దేశంలో 15 రోజుల అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలను భూగర్భంలో భద్రపరిచారు. అక్కడ 24 గంటలూ సాయుధ బలగాల పహారా ఉంటుంది.దేశంలో మేజర్ పోర్టుల్లో ఒకటైన విశాఖ పోర్టు అథార్టీ ఇక్కడే ఉంది. వాణిజ్య పరంగా, వ్యూహాత్మకంగా ఈ సహజ నౌకాశ్రయం ఎంతో కీలకం. దగ్గరిలోనే గంగవరం పోర్టు ఉంది. విశాఖ స్టీలు ప్లాంటు, భారీ ఫార్మా కంపెనీలు ఉన్నాయి.

**54 ఏళ్ల తర్వాత మళ్లీ..**

పూర్తిస్థాయి యుద్ధ సన్నాహాలు సాగినప్పుడే భారత్ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు గత పరిణామాలను విశ్లేషిస్తే 1971లో ఇండియా-పాక్ మధ్య యుద్ధం సమయంలో విశాఖ ఓల్డ్‌టౌన్ ప్రాంతంలో ఓ స్కూలు ఆవరణలో బాంబులు పడ్డాయని నాటి ఘటనలను వృద్ధులు వివరిస్తున్నారు. రెండు వారాలపైగా దీపం వెలిగించకుండా కారుచీకటిలో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బతికామన్నారు. విశాఖ సమీపంలో ఐఎన్ఎస్ విక్రాంత్ నౌక ఉన్నట్లు తెలిసి పాకిస్థాన్ సబ్‌మెరైన్ పీఎన్ఎస్ ఘాజీ భారత జలాల్లోకి ప్రవేశించగా, ఐఎన్ఎస్ రాజ్‌పుత్ సమర్థంగా ఎదుర్కొని ఘాజీని పేల్చివేసింది. అందుకే ఏటా డిసెంబరు 4న తూర్పు తీరంలో నేవీ డే వేడుకలు నిర్వహిస్తారు.

మాక్ డ్రిల్‌లో ఏం చేస్తారంటే: యుద్ధ సైరన్ మోగగానే ఎలా అప్రమత్తంగా ఉండాలో అవగాహన కల్పిస్తారు. రాత్రి సమయంలో శత్రువులకు చిన్న కాంతి కూడా కనిపించకుండా ఇల్లు, కార్యాలయాల్లో దీపాలు, కాంతి వచ్చే అన్నింటిని ఆర్పి చీకటిమయం చేయాలి. అద్దాల కిటికీలు, తలుపులు కర్టెన్లతో కప్పేయాలి. గాయపడిన పౌరులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించడం, అగ్ని కీలలు వ్యాపిస్తే ఆర్పివేయడం, ప్రథమ చికిత్సతోపాటు, ఆసుపత్రులకు స్వయంగా బాధితులను తీసుకెళ్లేలా అప్రమత్తం చేయడంపై చైతన్యం కల్పిస్తారు. ఇప్పటికే శిక్షణ పొందిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, వివిధ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులను ఇందులో పాల్గొనేలా చేస్తారు. భయంతో గుండె సమస్యలు తలెత్తినప్పుడు సీపీఆర్ చేయడం, ఆందోళనలతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా చూడటం, అగ్నిమాపక యంత్రాలు సిద్ధంగా ఉంచడంపై శిక్షణ ఇస్తారు.

**భారత్ సమర్థంగా ఎదుర్కొంటుంది..**

భారత్ సైనిక సామర్థ్యం బాగా పెరిగింది. పాకిస్థాన్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా భారత్ సమర్థంగా ఎదుర్కొంటుంది. ఏ యుద్ధమైనా రెండు వైపులా ఎంతోకొంత నష్టపోతారు. భారత్‌కు ఎన్నో దేశాలు మద్దతిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా నెలకొన్న పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్‌లో వేర్పాటు వాదం ఊపందుకుంది. కొన్ని ప్రాంతాలు పాకిస్థాన్ నుంచి విడిపోవడానికి ఎదురుచూస్తున్నాయి.

జగన్ మోహనరావు, విశ్రాంత వింగ్ కమాండర్, భారత వాయుసేన

# కూలిన గదులు.. కుదరని పనులు

కర్నూలు : ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారుస్తామని గొప్పలు చెప్పిన వైకాపా ప్రభుత్వం.నిధులు ఇవ్వకుండా విద్యార్థులకు తిప్పలు మిగిల్చింది. ఉమ్మడి జిల్లాలో 75 పాఠశాలల భవనాలు నేలమట్టం చేశారు. పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో 2023 చివరి నాటికే అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇప్పటి వరకు వాటిని మళ్లీ చేపట్టనే లేదు. 80 శాతం వరకు పూర్తయిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. మిగతా పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. మొదటి విడత కింద ఉమ్మడి జిల్లాకు సుమారు రూ.41.6 కోట్లు కేటాయించింది. వేసవి సెలవులు ముగిసేలోగా చివరి దశ పనులు పూర్తిచేస్తే విద్యార్థులకు సౌకర్యాలు మెరుగవుతాయని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**పదండి ముందుకు బడిని బాగు చేసుకుందాం**

అక్షరాలు నేర్పిన బడి అంటే ఎవరికైనా మమకారమే.. మనం ఓ స్థాయికి చేరాక.. తిరిగి అదే పాఠశాలకు వెళ్లినప్పుడు వచ్చే ఉద్వేగాన్ని మాటల్లో చెప్పలేం.. అలాంటి విద్యాలయాలు పాడై ఉంటే గుండె తరుక్కుపోతుంది.. చదివిన బడిని బాగు చేయడంలో మనమూ ఓ



చేయి కలుపుదాం.. మనకు ఎన్నో గుర్తులు.. అనుభూతులు.. జ్ఞాపకాలు మిగిల్చిన పాఠశాలలను బాగు చేసుకుందాం. తలో చేయి వేస్తే సమస్యను పరిష్కరించడం చాలా సులువు.. ఇప్పుడు వేసవి కాలం.. బడులకు సెలవులొచ్చాయి.. తడ'బడి'న చదువులమ్మ నేలను బాగు చేయించడానికి ఇది చక్కని సమయం.. ఇంకా ఆలోచన ఎందుకు.. పదండి మన బడిని బాగు చేసుకుందాం..!!

పాఠశాలల్లో రెండో విడత కింద ఆగిపోయిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. 80 శాతం వరకు నిర్మాణాలు జరిగి ఆగిపోయిన వాటి వివరాలను సేకరించింది. వీటిని వెంటనే పునః ప్రారంభించి పూర్తి చేయాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

గతంలో మాదిరిగా సిమెంటు కొనుగోలు, సరఫరాపై ఉన్న ఆదేశాలను సడలించింది. బహిరంగ విపణిలోనే సిమెంటు కొనుగోలు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని ఇటీవల ఎస్ఎస్‌ఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రివాల్వింగ్ ఫండ్‌తో చేపట్టనున్నారు.

**రూ.423 కోట్లు అవసరం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాడు - నేడు కింద అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి కావాలంటే రూ.423 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఇందులో నంద్యాల జిల్లాకు రూ.180 కోట్లు, కర్నూలు జిల్లాకు 243 కోట్లు అవసరం ఉంది.

కర్నూలు జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో రెండో విడత కింద 594 పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టారు. ఇందులో అరకొరగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం రూ.29.83 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రూ.3.73 కోట్లను ఆయా పాఠశాలల పీడీల ఖాతాలో జమ చేశారు.

నంద్యాలలోని 973 బడుల్లో పనులు ప్రారంభించారు.రూ.11.77 కోట్లు కేటాయించగా రూ.3 కోట్లు వచ్చాయి.

పడగొట్టి పంపించారు

కర్నూలు బండిమెట్టలోని పొట్టిశ్రీరాములు స్మారక నగరపాలక పాఠశాలలో 279 మంది విద్యార్థుల చదువుకొంటున్నారు. ఉన్న గదులు కూలగొట్టారు.. పిల్లలను పక్కనే ఉన్న అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో సర్దుబాటు చేశారు.రూ.2.16 కోట్లు కేటాయిస్తే రూ..49.21 లక్షలు వెచ్చించారు.

**సిమెంటు ఇస్తే పనులు మొదలు**

ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 780 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. రూ.48 లక్షలు వెచ్చించి నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించాలని అనుకొన్నారు. ఇప్పటి వరకు రూ.25 లక్షలు వెచ్చించారు. సిమెంట్ సరఫరా లేకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి.. వాటిని చేపట్టాలంటే రూ.23 లక్షలు అవసరం..ప్రస్తుతం పాఠశాల ఖాతాలో రూ.6 లక్షలు ఉన్నాయి.

**అమ్మాయిల అవస్థ**

ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1,612 మంది విద్యార్థినులున్నారు. రూ.2.16 కోట్లతో 18 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పునాది వేశారు. నాలుగు గదులు రూఫ్ లెవర్ వరకు పూర్తవగా.. మరో రెండు గదులు పునాదులకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం రూఫ్ లెవల్‌లో ఆగిపోయిన నాలుగు అదనపు గదుల నిర్మాణాలు పూర్తిచేస్తే విద్యార్థినులకు సౌకర్యంగా ఉంటుంది. ఇందు కోసం సుమారు రూ.10 లక్షలు మంజూరు చేస్తే నాలుగు తరగతి గదులు వినియోగంలోకి తీసుకురావచ్చు.

మంజూరైన అదనపు గదులు: 1986
తుది దశలో ఆగినవి: 587
పైకప్పు దశలో ఉన్నవి : 489
యూనిట్ లెవల్‌లో నిలిచినవి : 48
బేస్‌మెంట్ దశలో ఉన్నవి : 59
పూర్తయిన నిర్మాణాలు : 198
పనులు మొదలే కానివి: 32

# విరబూసి.. నష్టాలు మిగిల్చి..!

కుప్పం : శాంతిపురం మండలం దండికుప్పంకు చెందిన శీనప్ప రెండెకరాల్లో చెండు మల్లి సాగుకు రూ. లక్ష ఖర్చు చేశాడు. కోతకు వచ్చే సమయానికి ధరలు పడిపోయాయి. పూలను తోటలోనే ఎండబెట్టాల్సిన దుస్థితి. విరబూసిన పొలంలోనే వాడిపోతున్న పూలను చూసి శీనప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. అంతకు మునుపు రూ.50 వేల పెట్టుబడితో పండించిన కర్బూజా పండ్లకు కూడా గిట్టుబాటు ధర లేక నష్టపోయినట్లు కంటనీరు పెట్టుకోన్నారు. తోటల్లోనే ఎండుతూ.. కుప్పం, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో ఉద్యాన రైతులు వందలాది ఎకరాల్లో బంతి పూలు సాగు చేశారు. అప్పులు చేసి.. నీటి ఎద్దడిని అధిగమించి పండించిన పూలకు గిట్టుబాటు ధరలు కొరవడటంతో తీవ్రంగా నష్టపోయారు. చాలా చోట్ల తోటల్లోనే వదిలిపెట్టడంతో ఎండిపోతున్నాయి. కొన్ని చోట్ల పశువులకు ఆహారంగా మారాయి.

**శుభకార్యాలు లేక**ప్రస్తుతం పండుగలు, శుభకార్యాలు లేనందున విపణిలో పూలకు డిమాండు గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా పూజలు, అలంకరణలకు వినియోగించే బంతి, చెండుమల్లి వినియోగం తగ్గింది.

# సొంత లెక్కలు.. పనులు ముక్కలు



అనకాపల్లి : జిల్లా పరిషత్తు నిధులతో చేపట్టే పనులను అయినవారికి అప్పగించేందుకు జడ్పీ సభ్యులు, అధికారులు తాపత్రయ పడుతున్నారు. అంచనా విలువలను పూర్తిస్థాయిలో చూపకుండా ఒకే పనిని ముక్కలు ముక్కలుగా విభజించి నామినేషన్ పద్ధతిలో తమవారికి కట్టబెడుతున్నారు. టెండర్లు పిలిస్తే గుత్తేదారులు ఎవరూ రావడం లేదంటూ.. అందుకే ఇలా చేయాల్సి వస్తుందని అధికారులు సమర్థించుకుంటున్నా వారి వెనుక జడ్పీ నేతల ఒత్తిళ్లు ఉన్నట్లు తెలుస్తోంది.

సాధారణంగా రూ. 5 లక్షల లోపు అంచనా విలువున్న పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగిస్తారు. ఆపై దాటిన పనులకు తప్పకుండా టెండర్లు పిలవాలి. ఒకటి, రెండుసార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారుల నుంచి కనీస స్పందన రాకుంటే ఆయా పనులను ఉన్నతాధికారుల ఆమోదంతో నామినేషన్ పద్ధతిలో కేటాయించాలి. కాని జిల్లా పరిషత్తులో అంతా ఇష్టారాజ్యంగా సాగుతోంది. అసలు టెండర్ల జోలికే పోకుండా ముందుగానే పనులను రూ. 5 లక్షల లోపు ఉండేలా అంచనా విలువలు నిర్ణయిస్తున్నారు. జడ్పీ అతిథిగృహాల మరమ్మతుల మొదలుకొని సీసీ రోడ్లు, కొన్ని శాఖల కార్యాలయాల్లో వసతుల కల్పన వరకు ఒకే పనిని నాలుగు నుంచి పది వర్కులుగా చూపించి నామినేషన్‌లో అప్పగిస్తుండటంపై ఆరోపణలు వస్తున్నాయి.

**అతిథి గృహం.. 10 ముక్కలు..**

జిల్లా పరిషత్తు ఆవరణలోని అతిథిగృహానికి సుమారు రూ.40 లక్షలతో మరమ్మతులు చేపడుతున్నారు. మరి అంత విలువతో పనిచేస్తే టెండర్ పిలవాలి కదా. కాని అలాంటిదేమీ చేయకుండా చక్కగా రూ. 40 లక్షల పనిని 10 వర్కులుగా విభజించి నామినేషన్ పద్ధతిలో ఓ గుత్తేదారుకి అప్పగించారు. అతిథి గృహం స్లాబ్ తొలగించడం, గదుల వారీగా పునరుద్ధరణ పనులకు అంచనా విలువలు కట్టడం గమనార్హం. ఛైర్‌పర్సన్ బంగ్లాలో మరో రెండు పనులు, సమావేశ మందిరం, అతిథిగృహానికి ఎయిర్ కండిషనర్ల ఏర్పాటుకు వేరుగా అంచనాలు తయారుచేసి అప్పగించారు.

మాడుగుల మండలం ఉరకగెడ్డ వద్ద రక్షణ గోడ, క్రాస్ చెక్‌వాల్ పేరిట గతంలో మంజూరు చేసిన పనులను రద్దుచేసి వాటి బదులు అతిథిగృహానికి మరమ్మతులు చేస్తున్నారు.

దేవరాపల్లి మండలం నర్సింగి పంచాయతీలో శ్మశానవాటిక నుంచి దువ్వారి కల్లాల వరకు సీసీ రోడ్డు నిర్మాణాన్ని అయిదు పనులుగా విభజించారు. ఒక్కో పని రూ. 4.98 లక్షలు అంచనా విలువ ఉండేలా చేసే నామినేషన్‌లో అప్పగించారు.

జిల్లా పరిషత్తు ఆవరణలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సంఘం భవనానికి రూ. 5 లక్షలు కేటాయించారు. ఆ సంఘానికి గతంలోనే స్థలం ఇచ్చి భవన నిర్మాణానికి సహకారం అందించారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను ఓ ఆసుపత్రి ల్యాబ్‌కు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. మళ్లీ వారికి జడ్పీ నిధులు కేటాయించడంపై స్థానిక ఉద్యోగుల నుంచే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పాడేరు ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో మౌలిక వసతుల పనులను రూ. 20 లక్షలతో ఆమోదించారు. వీటిని కూడా నాలుగు పనులుగా విభజించి నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు.

పనులు చేస్తుండగా పెరిగాయి

అతిథి గృహం పనులు మొదట తక్కువ మొత్తంలోనే అవుతాయనుకున్నారు. పనిలోకి దిగాక ఒక్కోటి పెరుగుతూ వస్తుండటంతో అంచనా విలువలు పెంచాల్సి వచ్చింది. బిల్లులు సక్రమంగా అందడం లేదని టెండర్లు పిలిచినా గుత్తేదారులు రావడం లేదు. అందుకే నామినేషన్ మీద ఇవ్వాల్సి వస్తుంది. ఇందులో మరో ఉద్దేశమేం లేదు. గతంలో మంజూరు చేసిన పనుల్లో అవసరం లేనివాటిని సమీక్షించి రద్దు చేస్తున్నాం.

నారాయణమూర్తి, జిల్లా పరిషత్తు ముఖ్య కార్యనిర్వహణాధికారి

# ఈనెలా కందిపప్పు లేనట్టే!

బుచ్చెయ్యపేట : జిల్లాలోని రేషన్ లబ్ధిదారులకు మూడు నెలలుగా కందిపప్పు సరఫరా చేయడం లేదు. బియ్యం, పంచదారతో సరిపెడుతున్నారు. మేలో కందిపప్పు, రాగులు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారులు ఆశగా ఎదురుచూశారు. తీరా పంచదార, బియ్యం మాత్రమే పంపిణీ చేస్తుండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 5,37,038 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెల గతంలో 7652 మెట్రిక్ టన్నుల బియ్యం, 264 మెట్రిక్ టన్నుల పంచదార, 546 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 544 మెట్రిక్ టన్నుల గోధుమపిండి, 1628 మెట్రిక్ టన్నుల రాగులు పంపిణీ చేసేవారు. మూడు నెలలుగా బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. అయిదు నెలల నుంచి రాగులు, గోధుమ పిండి ఊసేలేదు. పౌరసఫరాల వ్యవస్థను గాడిలో పెట్టి పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు సరకులు అందించడం కూటమి ప్రభుత్వానికి పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం కార్డుదారులకు 258.4 మెట్రిక్ టన్నుల పంచదార, 7836.63 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నారు. నిత్యావసర సరకుల్లో కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు మండిపడుతున్నారు. రేషన్ వాహనాల ద్వారా కేజీ కందిపప్పు రూ. 67కు లబ్ధిదారులకు అందించేవారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ. 120 వరకు పలుకుతోంది.

టెండర్లు పూర్తికాలేదు: పంచదార, కందిపప్పు పూర్తిస్థాయిలో కార్డుదారులకు సరఫరా చేస్తున్నాం. డిసెంబరు, జనవరి నెలలో కార్డుదారులకు కందిపప్పు అందించాం. టెండర్లు ప్రక్రియ పూర్తికాక కందిపప్పు సరఫరా జరగలేదు. మూర్తి, డీఎస్‌వోడిపోలు: 1063జిల్లాలో కార్డుదారులు: 5,37,038

బియ్యం:7836.063 మెట్రిక్ టన్నులు
పంచదార 258.485 మెట్రిక్ టన్నులు

# మట్టికుండలకు మంచిరోజులు

బద్వేలు : వేసవి ఎండలు మండుతుండడంతో చల్లని తాగునీటి కోసం జనం మట్టికుండలను వాడుతున్నారు. ప్రతి ఇంటా ఫ్రిజ్‌లు ఉన్నప్పటికి ఆరోగ్య రీత్యా మట్టికుం డలు మేలంటూ జనం ఆ దిశగా ముందుకె ళు తున్నారు. మట్టికుండ.. ఒకప్పుడు లేని ఇళ్లు ఉం డేది కాదంటే అతిశయోక్తికాదు. నీరు పట్టుకో వడానికి.. నీటిని నిల్వ ఉంచడానికి.. వంటలకు.. ఇలా అన్ని అవసరాలకు వాటిని వినియోగించే వారు. వంట పాత్రలను కూడా మట్టిపా త్రలనే వాడేవారు. కాలక్రమేణ వాటి ఉప యోగం తగ్గుతూ వచ్చింది. అయితే ఇటీ వల కాలంలో ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాలే కాకుం డా పట్టణ ప్రాంతాల వారు సైతం మట్టికుండలను తాగునీటి కోసం వాడు తుండడంతో వాటి వినియోగం పెరిగి మట్టికుండలకు మంచిరోజులు వచ్చాయని పేర్కొంటున్నారు. మట్టికుండల్లో నీరు తాగి తే ఎంతో మేలు చేకూరుతుందని వైద్యనిపుణులు పేర్కొంటుండడం ఇందు కు ప్రధాన



కారణంగా నిలు స్తోంది. గొంతునొప్పి, జలు బు ఇతరత్రా వ్యాధులను నివారించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. చిన్న పట్ట ణాలతోపాటు పెద్ద పెద్ద నగరాల్లో కూడా మట్టికుండలు, కూ జాల విక్రయాలు పెరుగుతున్నాయి. ప్రస్తుత అవసరాలు, మా ర్పులకు తగ్గట్టుగా మట్టికుం డలకు నీటి కొళాయిలు బిగించి విక్రయిస్తుండడం గమనార్హం. ఒక్కొక్క కుండలో 10, 20, 30 లీటర్ల నీటి సామర్థ్యంతో ఉంటాయి. మట్టికుండలు రూ.200 నుంచి రూ.500 వరకు మార్కెట్లో ధరలు పలు కుతున్నాయి. అలాగే ఆలయ నిర్మాణంలోని విగ్రహ ప్రతిష్ఠకు ముంతలను అధికంగా విని యోగిస్తుండటంతో మట్టికుండలకు గిరికీ అద రోహెూ అనిపిస్తోంది.

# జలఘోష తప్పేనా..?

భీమవరం : కూటమి ప్రభుత్వంలో పంట కాలువలకు ప్రాధాన్యం ఇస్తారని అంతా భావించారు. అందుకు తగ్గట్టుగానే జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపించారు. అయితే నిధులు లేమి ఉందంటూ ఆర్థిక శాఖ అనేక మెలికలు పెడుతోంది. ఇప్పుడదే పశ్చిమ డెల్టా రైతులకు శాపంగా మారుతోంది. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కృషితోఈ ఏడాదైనా జలఘోష తప్పేనా అని రైతులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

పంట కాలువల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. వేసవిలో కాల్వలు, డ్రెయిన్‌లకు మరమ్మతు పనులు చేపట్టాలి. ప్రభుత్వానికి ఏనాడో ప్రతిపాదనలు పంపారు. పశ్చిమ డెల్టా పరిధిలో వేసవి మరమ్మతులకు రూ.40 కోట్లు అవసరమని అంచనా వేశారు. ప్రణాళికలు రూపొందించారు. నీటి సంఘాలు ఏర్పడడంతో రైతుల్లోనూ ఆశలు చిగురించాయి. కాలువలు ప్రక్షాళన జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ ఏడాది రైతుల ఆశలు తల్లకిందులయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా జలవనరుల శాఖ అధికారులు పంపిన ప్రతిపాదనలు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అక్కడ క్లియరెన్స్ అయితేనే నిధులు మంజూరవుతాయి. ఒక దశలో ప్రతిపాదనలను ఆర్థిక శాఖ తిరస్కరించింది. ప్రతిపాదనల విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఆమోదం పొందేలా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పనుల నిర్వహణకు కాలాతీతమైంది. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉన్నాయి. వాతావరణ శాఖ ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. అదే జరిగితే మంచినీటి చెరువుల్లో నీరు అడుగంటిపోనుంది. జూన్ మొదటి వారంలోనే మళ్లీ కాలువలకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఇటువంటి లెక్కలు వేసుకుని జలవనరుల శాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నెల రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఆలోగా కాలువలు, డ్రెయిన్‌లలో పూడిక తీయాలి. గుర్రపుడెక్క, తూడు, కర్రనాచు తొలగించాలి. గట్లు బలహీనంగా ఉన్నచోట పటిష్టం చేయాలి. లేదంటే గండ్లు పడి పంట పొలాలు ముంపుబారిన పడే ప్రమాదం ఉంది. గడచిన ఖరీఫ్‌లో గండ్లతో అధిక నష్టం వాటిల్లింది. మరోవైపు డ్రెయిన్‌లు ఎగదన్ని పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. వేసవిలో పనులు చేపడితే ముంపు నుంచి గట్టెక్కవచ్చని అంతా అభిప్రాయపడ్డారు.

**నీటి సంఘాల్లోనూ నిరుత్సాహం**

వేసవి పనులు చేపట్టడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫల మైంది. ఆ ప్రభావం రైతులపై పడుతోంది. రెండు రోజులపాటు వర్షాలు కురిస్తే పొలాలు నీట మునుగుతున్నాయి. నారుమళ్లు దెబ్బతింటున్నాయి. లేదంటే నాట్లు కుళ్లిపోతున్నాయి. గడచిన ఖరీఫ్‌లో రైతులు ఇలాంటి ఇబ్బందులే పడ్డారు, రెండు పర్యాయాలు పంటకు నష్టం వాటిల్లింది. డ్రెయిన్‌లు, కాలువలు పూడుకుపోవడంతో కొద్దిపాటి వర్షాలకు డ్రెయిన్‌లు ఎగదన్నుతున్నాయి. జలవనరుల శాఖ ఈ విషయాన్ని గుర్తించింది. పనులు చేపట్టాలని ముందుగానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. పశ్చిమ డెల్టా పరిధిలో కాలువలు, డ్రెయిన్‌ల మరమ్మత్తుల కోసం రూ.40 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నీటి సంఘాలను ఏర్పాటు చేయడంతో రైతుల్లోనూ ఉత్సాహం నెలకొంది. నీటి సంఘాల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. కాలువులు, డ్రెయిన్‌లలో సమస్యలను గుర్తించారు. అధికారులకు వివరాలు సమర్పించారు. పనుల అవసరాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ స్థాయిలో ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండడంతో నీటి సంఘాల్లోనూ నిరుత్సాహం నెలకొంది.

**నెల రోజులే గడువు** వేసవిలో పనులు చేపట్టడానికి నెల రోజులు మాత్రమే గడువు ఉంది. జూన్ మొదటివారంలో కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. వేసవి పనులకు మే నెల కీలకం. ప్రభుత్వ స్థాయిలో నిధులు మంజూరు చేస్తే పనులు కేటాయిస్తారు. నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. వాస్తవానికి రూ.10 లక్షలపైన పనులు అయితే టెండర్‌లు పిలవాలి. లేదంటే నీటి సంఘాల ద్వారా నామినేషన్ పద్ధతిలో చేస్తారు. ప్రస్తుతం నిధులు మంజూరు చేసినా సరే టెండర్‌లు పిలిచే అవకాశం లేదు. అంత సమయం లేదు. స్వల్పకాలిక టెండర్లు పిలిచినా వారం రోజుల సమయం పడుతుంది. అయినా సరే టెండర్లు ఖరారవుతాయన్న భరోసా లేదు. కాంట్రాక్టర్‌లకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో జలవనరుల శాఖ పనులుంటేనే హడలి పోడుతున్నారు. దీంతో నీటి సంఘాల ద్వారానే పనులు చేయించాలని అధికారులు యోచిస్తున్నారు. ఈసారి నామినేషన్‌లోనే పనులు చేపడితే వేగవంతంగా పూర్తవుతాయన్న నమ్మకంతో అధికారులు వేచి చూస్తున్నారు.

## ప్రభుత్వానికి అప్పగించిన భూముల్లో ఆక్రమణలు

బుచ్చెయ్యపేట : ఆర్.భీమవరం రెవెన్యూ పరిధిలో ఆక్రమణ దారులకు అడ్డూఅదుపు ఉండటం లేదు. ప్రభుత్వానికి అప్పగించిన డి.పట్టా భూముల్లో పాకలు వేసి హస్తగతం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. సుమారు 30 ఎకరాల డి.పట్టా భూములను గాజువాకకు చెందిన పారిశ్రామికవేత్త కడియాల రాజేశ్వరరావు గత నెలలో ప్రభుత్వానికి అప్పగించిన సంగతి తెలిసిందే. వీటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ నుంచి బుచ్చెయ్యపేట తహసీల్దారుకు ఆదేశాలొచ్చాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టాదారులకు 15 రోజుల గడువుతో నోటీసులు ఇచ్చి వారు పీఓటీ యాక్టు నిబంధనలు ఉల్లంఘించినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. డి.పట్టాలను రద్దు చేసి వాటిని ప్రభుత్వ స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దారు లక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే చాలా వరకు ప్రభుత్వ భూములను



తమ గుప్పెట్లో పెట్టుకుని అనుభవిస్తున్న గ్రామానికి చెందిన కొంతమంది నాయకులకు ఇది రుచించలేదు. అధికారులు స్వాధీనం చేసుకున్న డి.పట్టా భూములనూ సొంతం చేసుకునేందుకు వ్యూహాలు పన్నుతున్నారు. ఇందులో భాగంగా రాత్రికి రాత్రే డి.పట్టా భూముల్లో పాకలు వేయించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. 'గతంలో ఐదుగురి పేరిట సుమారు 30 ఎకరాల భూములను డి.పట్టాలుగా ఇచ్చాం. పీఓటీ యాక్టు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో పట్టాలను రద్దు చేశా'మని తహసీల్దారు లక్ష్మి పేర్కొన్నారు.

## భూచోళ్లు!

నరసాపురం : 'భూమి నా కళ్ల ముందే వుంది. దీని డాక్యుమెంట్లు మా ఇంటి బీరువా లాకర్‌లో భద్రంగానే ఉన్నాయి' అని ధీమాగా ఉన్నారా ? అయితే మీరు పొరబడినట్లే..! మీకు తెలియకుండా మీ భూమిని.. మీ డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలతో లీజుకు తీసుకున్నట్లు అగ్రిమెంట్లు సృష్టించే మహా మాయగాళ్లు మీ చుట్టూనే ఉన్నారు. కాబట్టి రైతులందరూ తస్మాత్ జాగ్రత్త. ఒకసారి మీ భూమిపై ఏమైనా బ్యాంకుల్లో రుణాలు ఉన్నాయేమో తెలుసుకోండి. ఎందుకంటే నిన్న నరసాపురంలో భూ యజమానికి తెలియకుండా.. భూములకు లీజు అగ్రిమెంట్ సృష్టించి నాలుగు కోట్లు రుణం తీసుకున్నారు.

రెండేళ్ల క్రితం కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన ఓ రైతు రుణం కోసం బ్యాంకుకు వెళ్లాడు. సర్వే నెంబర్లను కంప్యూటర్‌లో పరిశీలించిన అధికారులు భూమిపై రుణం ఉందని చెప్పడంతో ఆ రైతు షాక్ తిన్నాడు. వెంటనే పరిసర ప్రాంతాల రైతులు తమ భూములను ఎవరైనా బ్యాంకుల్లో పెట్టి రుణం తీసుకున్నారేమోనన్న భయంతో చెక్ చేసుకున్నారు. చూస్తే వంద ఎకరాలకుపైగా రైతులకు తెలియకుండా లీజు చేస్తున్నట్లు చూపించి, కొందరు కేటుగాళ్లు బ్యాంకుల్లో పెట్టి రుణం కొట్టేశారు. పోలీసులు విచారించగా.. ఈ మోసం వెనుక జిల్లాలో ఓ ముఖ్య వ్యక్తి పాత్ర ఉన్నట్లు తేలింది.అదే ఏడాది మొగల్తూరుకు చెందిన కొందరు రైతులకు రుణం కట్టాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు వచ్చాయి. తాము తీసుకోని రుణానికి డబ్బులు చెల్లించడమేమిటని రైతులు షాక్ తిన్నారు. విచారిస్తే.. మొగల్తూరు, కాళీపట్నంకు చెందిన రైతుల భూములను వారికి తెలియకుండా లీజు డాక్యుమెంట్లు సృష్టించి గణపవరం బ్యాంకులో రుణం తీసుకున్నారు. చివరికి ఈ కేసును సీబీసీఐడీ విచారణలో ఇంకా కొనసాగుతూనే వుంది. నరసాపురం సెంట్రల్ బ్యాంకులోను ఇదే తరహా మోసం తాజాగా వెలుగు చూసింది. అయితే ఇక్కడ రుణం తీసుకున్న వ్యక్తికి లీజు గురించి తెలియదు. తన ఆస్తులను తాకట్టు పెట్టి లోన్ తీసుకున్నాడు. ఇందులో కీలకపాత్ర పోషించింది పట్టణానికి చెందిన ఒక బ్రోకర్ అని తేలింది. కేవలం తక్కువ వడ్డీకి రుణం దక్కుతుందని ఆశ పడి బ్రోకర్ చెప్పిన మాట నమ్మడం వల్ల అల్లరిపాలు కావాల్సి వచ్చింది.

**నేడు ఊరూరా బ్రోకర్లు**

గతంలో పెళ్లిళ్లు... రియల్ ఎస్టేట్ రంగాల్లోనే బ్రోకర్లను చూసేవాళ్లం. నేడు ప్రజల అవసరాలను గుర్తించి కొందరు కేటుగాళ్లు బ్యాంకు బ్రోకర్ల అవతారం ఎత్తారు. బహిరంగంగానే కన్సల్టెంట్స్ బోర్డులు పెట్టుకుని బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తామని అమాయక ప్రజలను ఊబిలోకి దించుతున్నారు. కొందరు బ్యాంకు మేనేజర్లను మచ్చిక చేసుకుని వారి ద్వారా లక్షలు, కోట్ల రూపాయల రుణాన్ని ఇప్పిస్తున్నారు. ఇందులో కొందరు నిజాయితీగా చేస్తుంటే.. మరికొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. కేవలం 'మీ ఆస్తుల్ని తాకట్టు పెట్టండి.. మీకు ఇంత పెద్ద మొత్తంలో రుణం ఇప్పిస్తా'మని బురిడీ కొట్టిస్తున్నారు. రుణం సక్రమంగా చెల్లిస్తే.. అంతా ఓకే. లేకపోతే అందులోని లోపాలు బయటకు పొక్కి అల్లరిపాలు కావాల్సిందే. ఇటు రైతులకు తెలిసినా... సీన్ రివర్స్ అవుతుంది.

**ఆ వివరాలు ఎలా తెలుస్తున్నాయి ?**

రైతులు చెరువులు తవ్వే సమయంలో భూములకు సంబంధించిన దస్తావేజులను జిరాక్స్ తీసి వీఆర్వో ద్వారా మత్స్యశాఖకు అందిస్తుంటారు. లేదా కొన్ని సమయాల్లో దస్తావేజుల నకళ్లను వీఆర్వో, మీసేవలకు ఇస్తుంటారు. కొందరు రుణం ఇప్పిస్తామని రైతుల నుంచి జిరాక్స్ కాపీలను తీసుకుంటారు. ఇదే సమయంలో ఆధార్‌కార్డు, పాస్‌బుక్ జిరాక్స్‌లను నకలు కాపీలు ఇవ్వడం సర్వ సాధారణం. ఇచ్చింది జిరాక్స్ కాపీలేనన్న ధీమాతో చాలా మంది పట్టించుకోవడం లేదు. ఇక్కడే మోసానికి తెరలేస్తోంది. కేటుగాళ్లు వీటిని సంపాదించి రుణం లీజు అగ్రిమెంట్లు సృష్టిస్తున్నారు. బ్యాంకుల్లో వెలుగు చూస్తున్న మోసాలన్నీ ఇలా బయటకు వచ్చినవే.

**తస్మాత్ జాగ్రత్త..**

భూమే కదా ఎక్కడికి పోతుంది ? ఒరిజనల్ డాక్యుమెంట్స్ అన్నీ బీరువాలోనో, సొసైటీలోనో ఉన్నా యి కదా అన్న ధీమాతో ఉంటే ప్రస్తుత పరిస్థితుల్లో బోల్తా కొట్టినట్లే! ఇళ్లు, పొలాల దస్తావేజులను బ్యాంకు లో పెట్టి రుణం తీసుకోకపోతే వాటిని తరచూ చెక్ చేసుకోవాలి. లేకుంటే కేటుగాళ్లు మనకు తెలియ కుం డానే వాటిని బ్యాంకుల్లో పెట్టి రుణం కొట్టేస్తున్నారు.

**కొనసాగుతున్న విచారణ**నరసాపురం సెంట్రల్ బ్యాంకులో వెలుగుచూసిన రూ.4 కోట్ల స్కామ్ తీరప్రాంత రైతులనే కాదు. జిల్లాలోని అందరినీ ఉలికిపాటుకు గురిచేసింది. రుణం తీసుకున్న కూనపరెడ్డి ప్రసాద్, దుడే చంద్రశేఖర్ ఇద్దరూ వారి ఆస్తుల డాక్యుమెంట్లను బ్యాంకులో తాకట్టు పెట్టారు. అయితే వీరికి లోన్ ఇప్పించిన బ్రో కర్ మాత్రం ఆక్వా సాగు రుణం తీసుకుంటే తక్కువ వడ్డీ పడుతుందని వీరిని మభ్యపెట్టాడు. పొలాలు లేకపోయినా.. వీరి పేరున లీజు అగ్రిమెంట్లు సృష్టించి కోట్ల రుణం ఇప్పించాడు. ఇందుకు పెద్ద ఎత్తున కమీషన్లు దండుకున్నారన్న వాదనలు లేకపోలేదు. ఇందులో బ్యాంకు అధికారుల పాత్రపైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రకృతి వినాశనం.. తప్పదు మూల్యం



రాయదుర్గం : : ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసుతో అనంతపురం జిల్లా దేశస్థాయిలో సంచలనంగా మారింది. 2004-09 మధ్యలో అప్పటి పాలకుల అండతో గాలి జనార్దన్‌రెడ్డి సాగించిన మైనింగ్ దందా బయటకు రావడంతో ప్రధాన దర్యాప్తు సంస్థలతో పాటు మీడియా దృష్టి జిల్లాపై పడింది. 2009లో కేసు నమోదు నుంచి 2011లో ఛార్జిషీటు దాఖలు చేసే వరకు సీబీఐ అధికారులు అనంతపురం, రాయదుర్గం, డి.హీరేహాళ్ ప్రాంతాల్లో పర్యటించారు. కలెక్టరేట్‌తో పాటు మైనింగ్ కార్యాలయాల్లో పలు దస్త్రాలను పరిశీలించి కాపీలను వెంట తీసుకెళ్లారు. మైనింగ్ జరిగిన ప్రాంతం రిజర్వు ఫారెస్టులో ఉండటంతో కేంద్ర అటవీశాఖ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ సమయంలో ఫారెస్టు అధికారిపై దాడి జరగ్గా పోలీసులు కేసు నమోదు చేశారు. సింగరేణి కాలరీస్ మైన్స్ జనరల్ మేనేజర్, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ రెండు బృందాలుగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సీబీఐకు నివేదిక అందించారు. విచారణ సమయంలో రోజుకో అక్రమం బయటకు వచ్చేంతవరకు జిల్లా వాసులకు తమ ప్రాంతంలో ఈ స్థాయిలో అవినీతి జరిగిందనే విషయం తెలియరాలేదు.

**అసలేం జరిగింది?**

బళ్లారికి చెందిన గాలి జనార్దన్‌రెడ్డి ఓబుళాపురం మైనింగ్ కంపెనీ పేరుతో ఓబుళాపురం పరిధిలోని భూములను లీజుకు తీసుకున్నారు. తనకు కేటాయించిన భూమిలో కాకుండా ఇతర ప్రాంతాల్లో అక్రమంగా ఖనిజం తవ్వేసి సొమ్ము చేసుకున్నారు. ఈ ప్రాంతం ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో ఉంటుంది. దీనిపై టప్పాల్ శ్యాంప్రసాద్ 2007లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

**2004, అక్టోబరులో ఓ రోజు రాత్రి...**

డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిద్రలో నుంచి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎందుకంటే భూకంపం వచ్చిందా.. అన్నంతగా పెద్దశబ్దం రావడంతో... ఎంతమాత్రం కాదు.. ఓబుళాపురం కొండల్లో నాణ్యమైన ఇనుప ఖనిజం తవ్వడానికి అడ్డుగా ఉన్న సుంకులమ్మ ఆలయాన్ని పేల్చి వేయడంతో.. ఈ విషయం మరుసటిరోజు తెలిసింది. అప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకులేకుండా పోయింది.

**ఎందుకు..**

ప్రకృతితో పెట్టుకుని.. అక్రమంగా కొండలనే కొల్లగొట్టి.. కోట్లకు పడగలెత్తడంతో.. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ఇనుప ఖనిజం తరలించడం.. డి.హీరేహాళ్ నుంచి కృష్ణపట్నం దాకా టిప్పర్ల దూకుడు.. దారి పక్కన గ్రామాల రోడ్లు కనుమరుగై.. ఎంతోమంది అమాయకులు మట్టిలో కలిసిపోయారు. ఎంతటి రాక్షసుడికైనా అంతం తప్పదన్నట్లుగా... ఓబుళాపురం మైనింగ్ కంపెనీ యజమాని గాలి జనార్దన్‌రెడ్డి పాపం పండింది. న్యాయస్థానం శిక్ష విధించింది.

**అక్రమాలపై పోరాటం**

అప్పట్లో ప్రతిపక్షం తెదేపా పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టింది. తెదేపా నాయకుల బృందం 2007, జులై 22న ఓబుళాపురం పరిశీలనకు వచ్చింది. కాలవ శ్రీనివాసులు, పయ్యావుల కేశవ్, పరిటాల సునీత, పల్లె రఘునాథ్‌రెడ్డి, హనుమంతరాయచౌదరి, మెట్టు గోవిందరెడ్డితో పాటు ప్రస్తుతం తెలంగాణకు చెందిన నాగం జనార్దన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులను రాయదుర్గంలోనే పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. 23, 24 తేదీల్లోనూ తెదేపా నాయకుల ఆందోళనలు కొనసాగాయి. పోలీసుల నిర్బంధాలను దాటుకుని ఎట్టకేలకు తెదేపా నాయకులు ఓబుళాపురం మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు.

## పేదల స్థలాల్లో గుంట నక్కలు



గుత్తి: గుత్తి పురపాలికలో పేదలకు ప్రభుత్వం ఇస్తున్న నివాస స్థలాల్లో నాయకులు వాటాలు పంచుకుంటున్నారు. పట్టణంలో ఎక్కువగా అసైన్డ్ భూములు, స్థలాలు ఉన్నాయి. ప్రైవేట్ భూములు తక్కువగా ఉన్నాయి. ఇదే అదునుగా భావించిన కొందరు ప్రభుత్వ భూములను గుర్తిస్తూ ఆక్రమిస్తున్నారు. కొందరు నాయకులు రెవెన్యూ అధికారులు వద్ద ఉండాల్సిన దస్త్రాలు తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఇంకొందరు రెవెన్యూ సిబ్బంది సహకారంతో డైగ్లాట్లు, ఎఫ్‌ఎంబీలను తీసుకున్నారు. ఆయా దస్త్రాలను తమ వద్ద ఉంచుకుని ఎంచక్కా రూ.కోట్లు విలువైన స్థలాలు కాజేస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి**

సర్వేనంబర్ 609లో ప్రభుత్వం సుమారు 400 మంది పేదలకు నివాస స్థలాలు ఇచ్చింది. వీటిలో వాటిలో వైకాపాకు చెందిన ఓ నాయకుడు 10 సెంట్లు స్థలాన్ని పొందాడు. ఎంచక్కా పేదల కాలనీలో ఆయన పెద్ద భవంతి నిర్మించాడు. ఇలాగే పోరాటాలు చేసి తాము ప్రభుత్వం నుంచి పేదలకు నివాస స్థలాలు వచ్చేలా పాటుపడ్డామని చెబుతూ మరో ముగ్గురు నాయకులు వాటాలు పొందారు. ఆ ప్లాట్లను తమకు ఇష్టం వచ్చిన వారికి విక్రయించారు.

సదరు నాయకులు ఓ స్టాఫ్ నర్సుకు కూడా స్థలాన్ని ఇచ్చి ప్రయోజనం పొందారు. తమ వద్ద ఖాళీ స్థలాలు ఉంచుకుని తమకు అవసరమైనప్పుడల్లా అమ్ముకుంటూ వచ్చారు. నాయకులు స్థలాల్లో ఇళ్లను నిర్మించుకుని తమ వాటా కింద వచ్చిన స్థలాలను విక్రయిస్తున్నారు. ఓ పార్టీకి చెందిన నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేయగా ఆయన సుమారు 40 పట్టాలు మంజూరు చేశారు. ఆ పట్టాలను దస్త్రాలు లేకుండానే కట్టబెట్టారు. సర్వేనంబర్ 515లో దివ్యాంగులకు 15 ఏళ్ల కిందట నివాస స్థలాలు ఇవ్వగా గత ఏడాది ఓ ప్రజాప్రతినిధి కుమారుడు 10 సెంట్లు స్థలాన్ని తీసుకున్నాడు. ఓ మహిళా నాయకురాలు సైతం నాలుగైదు ప్లాట్లు ఒకే చోట తన కుటుంబీకుల పేర్లతో తీసుకుని ఇంటి నిర్మాణాలు చేపట్టారు.

తాజాగా సర్వేనంబర్ 321లోని నాలుగు ఎకరాల స్థలాన్ని కొందరు ఆక్రమించగా ఓ నాయకుడు తనకు 60 ప్లాట్లు ఇవ్వాలని మెలికపెట్టాడు. అదనంగా మరో రెండు ఎకరాల భూమిని కూడా ఆయన చెట్లు తొలగించి శుభ్రం చేయించాడు. చెట్లు తొలగించేందుకు రూ.లక్ష ఖర్చు అయిందని, ఆసొమ్మును తనకు ప్రజలతో వసూలు చేసి ఇవ్వాలని చెబుతున్నాడు.

సర్వేనంబర్ 644-3లో 4.60 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా వైకాపా ప్రభుత్వ హయాంలో ఓ నాయకుడు తన వాటా కింద కొన్ని ప్లాట్లు తీసుకోగా వరుస కథనాలు ప్రచురించడంతో ఆక్రమణలు ఆగిపోయాయి. ఇప్పుడు కొందరు నాయకులు ఆస్థలాన్ని శుభ్రం చేయించే పనిలో ఉన్నారు.**ప్రభుత్వ స్థలాలను సంరక్షిస్తాం**

గుత్తిలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం. ఇప్పటికే వీఆర్వోలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఆక్రమణలు జరిగితే మిమ్మల్నే బాధ్యులుగా చేస్తామని సిబ్బందిని హెచ్చరించాం. ప్రభుత్వ స్థలాలకు కంచె ఏర్పాటు చేస్తాం. ఆక్రమణలు ఎక్కడున్నా గుర్తించి తగు చర్యలు తీసుకుంటాం. ఓబులేశు , తహసీల్దారు, గుత్తి

## తప్పులుంటే సరిచేసి.. అర్హతకే పీటవేసి..

అనంతపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందే సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించింది. అందులో అన్నదాత సుఖీభవ పథకం ఒకటి. ఈ నెలాఖరుకు అన్నదాతల ఖాతాలకు జమ చేసేందుకు సన్నాహాలు ప్రారంభించింది. అందులో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం చేశారు. అందులో మరణించినవారు, ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షన్ పొందేవారు, ఆదాయపు పన్ను చెల్లించేవారి వివరాలన్నీ వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం చేసి తొలగించాలని వ్యవసాయ, రెవెన్యూశాఖకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. వెబ్‌ల్యాండ్‌లో సర్వే నంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం, కచ్చితంగా ఉన్నాయా? లేదాన్నది తహసీల్దార్లు పరిశీలించాలి. ఏమైనా తప్పులుంటే సరిచేసి, ప్రభుత్వానికి నివేదించాలి. రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) వారీగా వెబ్‌ల్యాండ్ డేటాను వీఏఏలు, వీఎస్‌ఏలు, వీహెచ్‌ఏల లాగిన్లకు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. అన్నదాత సుఖీభవ పథకానికి కొత్తగా వెబ్‌సైట్ రూపకల్పన చేయడానికి కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ దిల్లీరావు అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు, డివిజన్, మండలస్థాయి అధికారులకు వెబ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆయా జిల్లాల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. అర్హులైన ప్రతి రైతుకు సాయం అందేలా చూడాలని రాష్ట్ర అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**ఉమ్మడి జిల్లాలో 5,76,972 మంది రైతులు**

అన్నదాత సుఖీభవ పథకం అమలులో భాగంగా గతంలో రైతు భరోసా పథకం





కింద ఉన్న గణాంకాల ప్రకారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5,76,972 మంది రైతులు ఉన్నారు. వారిలో అనంతపురం జిల్లాలో 2,89,114 మంది రైతులు ఉండగా శ్రీసత్యసాయి జిల్లాలో 2,87,858 మంది రైతులు ఉన్నారని ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు నివేదించారు. వెబ్‌ల్యాండ్ డేటా సరిచేసిన తర్వాత ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనర్హులుంటే తొలగించి, అర్హులను అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేస్తారని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు తెలిపారు.

## మీటరు తిరిగింది.. నియంత్రిక కాలింది

చిత్తూరు : జిల్లాలో తీవ్రమైన ఎండలు.. పెరిగిన ఉక్కపోతతో విద్యుత్తు వినియోగం మరింతగా పెరిగింది. గృహ, వ్యవసాయ సర్వీసుల విద్యుత్తు వాడకం పెరగడంతో ఉప కేంద్రాలు, నియంత్రికలపై అధిక లోడు ఫలితంగా నియంత్రికలు దగ్ధమవుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే జిల్లాలో సుమారు 622 నియంత్రికలు దగ్ధమైనట్లు జిల్లా విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**శరవేగంగా మరమ్మతులు**

జిల్లాలో చిత్తూరు, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో నియంత్రికల మరమ్మతు కేంద్రాలున్నాయి. మార్చి నెలలో చిత్తూరు నియంత్రికల మరమ్మతు కేంద్రానికి 355, పలమనేరుకు 125, పుంగనూరుకు 165 నియంత్రికలు తరలించారు. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం విద్యుత్తు శాఖ ప్రక్షాళనకు దృష్టి సారించింది. లో ఓల్టేజి, సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాల్లో అదనపు నియంత్రికలు, కొత్త లైన్ల ఏర్పాటు చేస్తున్నారు. నియంత్రికల మరమ్మతులకు అవసరమైన పరికరాలు, తీగలు, ఆయిల్ వంటి సామగ్రి కొరత



లేకుండా అందుబాటులో ఉంచారు. కేంద్రాలకు తరలిస్తున్న నియంత్రికలను సత్వరమే మరమ్మతులు చేసి రైతులకు అందజేస్తున్నామని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.

**వైకాపా నిర్లక్ష్య ఫలితమే**

ఐదేళ్ల వైకాపా పాలనలో విద్యుత్తు లైన్లు, ఉప కేంద్రాల నిర్వహణ పట్టించుకోలేదు. అయితే నిర్వహణ పేరుతో పనులు చేపట్టకనే వైకాపా పెద్దలు, గుత్తేదారులు నిధులు స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి. లో ఓల్టేజి సమస్యలున్న ప్రాంతాల్లో అదనపు లైన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, నియంత్రికలను అమర్చలేదు. కేవలం అప్పటి విద్యుత్తు శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంలోనే అవసరం లేనప్పటికీ ఇష్టానుసారంగా ఉప కేంద్రాల ఏర్పాటుతో రూ.కోట్ల నిధులు దుర్వినియోగం చేశారని ఆ శాఖ అధికారులే బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఉప కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనల దశలోనే ఆగిపోగా విద్యుత్తు లైన్ల నిర్వహణ మరిచిపోయారు. నిర్లక్ష్యం ఫలితంగా పూతలపట్టు, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం, పెనుమూరు, ఐరాల, నగరి, విజయపురం యాదమరి, గంగవరం, బైరెడ్డిపల్లె తదితర మండలాల్లో ప్రస్తుత వేసవిలో సరఫరాలో అంతరాయాలు, లో ఓల్టేజి సమస్యలు అధికంగా ఉన్నాయి.

జిల్లాలోని సర్వీసుల వివరాలు (లక్షల్లో)
విద్యుత్తు: 7.35
గృహ : 4.96
వ్యవసాయ : 1.92

## పత్తి సాగుపై రైతుల అనాసక్తి

బి.కోడూరు : పత్తి పంట సాగుపై రైతులు ఆసక్తి చూపడంలేదు. పత్తి పైరుకు తెగుళ్లకు మందులు, ఎరువులు, సేద్యాలు, కూలీల ఖర్చు అన్నీ పోను పైరు బాగా పండితే మిగిలేది ఎకరాకు రూ.20వేలు మాత్రమే.బి.కోడూరు మండలంలో ప్రతి సంవత్సరం పత్తి దాదాపు 7వేల ఎకరాలు పైనే సాగు చేసేవారు. రాను రాను పెట్టుబడి ఎక్కువ కావడం, రోగాలు అధికంగా రావడం, వాటికి సరైన మందులు పిచి కారి చేసేందుకు సరైన సలహాలు అందించలేని అధికారులతో రాను రాను సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఈ సంవత్సరం మండలం 50ఎక రాలలోపే పత్తి సాగు చేశారు. పత్తిపైరు నవంబ రు, డిసెంబరులో సాగు చేస్తే ఏప్రిల్, మేలో కోత లకు వస్తుంది. ఆ సమయంలో ఎండలు ఎక్కువ కావడం, కూలీలు దొరక్కపోవడం, సరైన రేటు లేకపోవడంతో రాను రాను రైతులు పత్తి సాగుపై ఆసక్తి చూపడంలేదు. దీంతో మండలంలో పత్తి సాగు పూర్తిగా కనుమరుగయ్యేటట్లు ఉంది.

**ఎండలు ఎండలు.. దొరకని కూలీలు**

ఏప్రిల్, మే మాసంలో పత్తి పంట కోతకు వస్తుం ది. అయితే మంచి ఎండలు , కూలీలు దొరక్క పోవడం, కూలీలు వచ్చినా అధిక రేటు కూలీ చెబుతుండడంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అష్టకష్టాలు పడి పత్తి పండిం చుకున్నా తీరా రేటు దగ్గరకు వచ్చేసరికి పెట్టుబ డి కూడా రానంతగా ఈ దళారులు చేస్తుండడం తో పూర్తిగా పత్తిని ఆపివేశారు.

**తెగుళ్లు ఉన్నా .. పర్యవేక్షణ సున్నా**

పత్తి పూత, పిందె దశకు వచ్చేసరికి అధికంగా తెగుళ్లు సోకడం, రైతులు తెలిసీ తెలియని మం దులు తీసుకువచ్చి పిచికారి చేయడంతో దిగుబ డులు పూర్తిగా తగ్గిపోయాయి. అధికారులు రైతు లకు సరైన సమయంలో సలహాలు అందించి వచ్చిన రోగాలకు సరైన మందులు పిచికారి చేసే విధంగా అవగాహన కల్పించడంలో విఫలమవ డంతో రైతులు పత్తిపై ఆసక్తి చూపడంలేదు.

**పెట్టుబడి భరించలేక పత్తిసాగు తగ్గించారు**

పత్తి పంట సాగునకు పెట్టుబడి ఎక్కువగా ఉండడంతో రైతులు పంట సాగు తగ్గించారు. అలాగే కూలీల కొరత రైతులకు ఇబ్బందికరంగా మారింది. ఇది కూడా పంట సాగు విస్తీర్ణం తగ్గడానికి మరో కారణంగా చెప్పవచ్చు.-కౌశిక, వ్యవసాయాధికారి, బి.కోడూరు

**ఏటా పది ఎకరాలు పత్తి సాగు చేసేవారం**

ప్రతి సంవత్సరం పత్తి 10 నుంచి 15 ఎకరాల వరకు సాగు చేసేవారం. రాను రాను విత్తనాల ఖర్చు ఎక్కువ కావడం, రాను రాను రోగాలు అధికంగా రావడం, దిగుబడి తగ్గు తుండడంతో పత్తిని పూర్తిగా సాగు చేయకుండా మానేశాం. ప్రస్తుతం సజ్జ, మొక్కజొన్నలాంటి పంటలు వేసు కుంటున్నాం. కనీసం క్వింటా రూ.10వేలు అమ్మితే రైతుకు కాస్తో కూస్తో పెట్టుబడి పోను మిగులు తుంది. దీంతో పత్తిని పూర్తిగా మానివేశాం.

- దుగ్గిరెడ్డి. రైతు, ఐత్రంపేట

# అక్రమార్కులు.. ఆటవిక తవ్వకాలు

నంద్యాల : గనులకు నిలయమైన డోన్ ప్రాంతంలో ఖనిజాల అక్రమ తవ్వకాలకు అంతే లేకుండాపోతోంది. అక్రమార్కులు అటవీ భూములను ఇష్టానుసారం తవ్వేసి ఖనిజాలు కొల్లగొడుతున్నారు. భారీ యంత్రాలను పెట్టి తవ్వకాలు సాగిస్తున్నా అటవీ, మైనింగ్, రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. అక్రమార్కులకు రాజకీయ అండ ఉండటంతో అధికారులు చర్యలకు వెనకాడుతున్నారు. దీంతో ఖనిజాల దోపిడీ పక్కా ప్రణాళికతో సాగుతోంది.

**నిషేధిత ప్రాంతంలో దందా**

డోన్ అటవీ ప్రాంతంలో డోలమైట్, క్వార్ట్జ్, వైట్‌క్లే, ఇనుప ఖనిజం, తెల్లసుద్ద అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా ఖనిజాలు వెలికితీస్తున్నారు. డోన్, ప్యాపిలి మండలాల్లోని నిషేధిత అటవీ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా ఈ దందా కొనసాగుతోంది. డోన్ మండలం కొచ్చెరువు అటవీ ప్రాంతంలో డోలమైట్, తెల్లసుద్ద ఖనిజాలను వెలికితీస్తున్నారు. ధర్మవరం- కమలాపురం గ్రామాల మధ్య, కన్నప్పకుంట సమీపంలో ఎర్రమట్టిని కొల్లగొడుతున్నారు. వెంకటనాయనిపల్లె సమీపంలో జోరుగా తవ్వకాలు సాగుతున్నాయి.

ప్యాపిలి మండలం కొమ్మెమర్రిలో వైట్‌క్లేను దోచుకునేందుకు పెద్దఎత్తున గుంతలు తవ్వారు.

**అక్రమాలకు గేట్లెత్తిన వైకాపా**

గతంలో ప్రభుత్వ ఆధీనంలో పర్మిట్లు ఇచ్చిన సమయంలో రవాణా చేసే వాహనాలకు జియోట్యాగింగ్ కచ్చితంగా ఉండేది. దీంతో ఈసీ, ఇతర అనుమతులు లేని క్వారీల నుంచి ఖనిజాల ఎగుమతులకు అధికారులు అనుమతించేవారు కాదు. గత వైకాపా ప్రభుత్వంలో



వసూళ్ల బాధ్యతను ఓ సంస్థకు అప్పగించారు. ఇదే అదనుగా ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్న అక్రమార్కులు అక్రమంగా తవ్విన ఖనిజాన్ని దొడ్డిదారిన రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**మోసాల్లో ఘనులు**

అక్రమార్కులు మోసాల్లో ఆరితేరారు. అటవీ ప్రాంతాల్లో తవ్విన ఖనిజాన్ని పక్కనే ఉన్న ప్రైవేటు భూముల్లో నిల్వ చేస్తున్నారు. ఒకవేళ అధికారులు ప్రశ్నిస్తే లీజు ప్రాంతంలో వెలికి తీసినదని బుకాయిస్తున్నారు. ప్యాపిలి మండలం కొమ్మెమర్రిలో అటవీ భూములు అనుకుని సర్వే నంబరు 763లో 42 ఎకరాల ప్రైవేటు భూమి ఉంది. ఇందులో పెద్దఎత్తున వైట్‌క్లేను నిల్వ చేస్తున్నారు. అధికారులు తనిఖీ చేసినా ఇబ్బందులు రాకుండా మొదట ఇక్కడ నిల్వ చేసి అవసరమైన మేరకు రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

డోన్, ప్యాపిలి మండలాల్లో తవ్విన వైట్‌క్లేను డోన్ నియోజకవర్గంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఎర్రమట్టిని ప్రైవేటు వెంచర్లు, లేఅవుట్లకు, గుంతలు పూడ్చడానికి ఉపయోగిస్తున్నారు. తెల్లసుద్దను పౌడర్ పరిశ్రమలకు రవాణా చేస్తున్నారు.

తవ్వకాలు అక్కడ.. చూపేది ఇక్కడ

అటవీ భూముల్లో అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్న వారు డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో ఏళ్లుగా అనుమతులున్న క్వారీలను నిర్వహిస్తున్నారు. క్వారీల పేరుతో అటవీ భూముల్లో తవ్వకాలు సాగిస్తున్నారు. అక్రమంగా తవ్విన ఖనిజాన్ని లీజు ఉన్న ప్రాంతాల్లో తవ్వినట్లు చూపుతూ రవాణా చేస్తున్నారు. అధికారుల కళ్లుగప్పి పరిశ్రమలకు చేరవేస్తున్నారు. గతే ఏడాది ప్యాపిలి మండంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా తవ్విన ఐరన్‌ఓర్‌ను వైకాపా నాయకులు ప్రైవేటు స్థలాల్లో పెద్ద ఎత్తున నిల్వ చేశారు. ఎన్నికల ఫలితాలకు కొద్దిరోజుల ముందు ఈ నిల్వలను హడావుడిగా తరలించి సొమ్ము చేసుకున్నారు.

# మారిన నేల.. మారని ఖాతా

కర్నూలు : కల్లూరు మండలం దూపాడు గ్రామ పరిధిలో సర్వే నంబరు-85ఏలో స్థిరాస్తి వెంచరు వేసి ప్లాట్లు విక్రయించారు. రెవెన్యూ దస్త్రాల్లో మాత్రం సాగు భూమిగానే ఉంది. 12 సబ్ డివిజన్లు చేశారు. కేవలం రెండింటికి " 3 లక్షల ఖాతాలు ఇవ్వగా.. ఒక సబ్ డివిజన్ వివాదాస్పదంగా ఉందని 2 లక్షల ఖాతా ఇచ్చారు. ఓ మహిళ పేరున 4.08 ఎకరాలను ఆరు సబ్ డివిజన్లు చేశారు. పచ్చని పొలాలు వెంచర్లుగా మారుతున్నాయి. రంగు రంగు రాళ్లు పాతి ప్లాట్లు విక్రయిస్తున్నారు. భూమార్పిడి చేయకుండా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో ఉమ్మడి జిల్లా ఉంది. కుడా అనుమతి లేకనే స్థలాల విక్రయాలు జరుగుతున్నాయి. ఆయా సర్వే నంబర్లు రెగ్యులర్ ఖాతాలుగానే వెబ్‌ల్యాండ్‌లో ఉంటున్నాయి. దీంతో కొనుగోలు చేసిన వ్యక్తుల పేర్లు సాగుదారులుగా ఉండిపోతున్నాయి. పంట నమోదు.. రుణాలు, పెట్టుబడి సాయం.. ఇతర వ్యవసాయ రాయితీ పథకాలను రియల్టర్లు పొందుతున్నారు. వాస్తవంగా వ్యవసాయ భూముల విస్తీర్ణం తగ్గిపోతున్నప్పటికీ రెవెన్యూ రికార్డులు, వెబ్‌ల్యాండ్‌లో అలానే ఉంటున్నాయి.

**ఎనిమిది వేల ఎకరాలు**గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాయకుల అనుయాయులు పెద్దఎత్తున స్థిరాస్తి వ్యాపారాలు చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి భూ మార్పిడి ఫీజు చెల్లించకుండా.. కుడా అప్రూవల్ లేకుండా లేఅవుట్లు వేసి దోచుకున్నారు. నాలుగేళ్ల కిందట 600కుపైగా అనధికారిక లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో 2 వేలకుపైగా అనధికారిక లేఅవుట్లు ఉన్నట్లు సమాచారం. ఎకరా రూ.కోటికిపైగా పలుకుతోంది. స్థిరాస్తి వ్యాపారులు రూ.కోట్ల విలువ చేసే భూములను కొనుగోలు చేసి కుడా అనుమతి లేకుండా లేఅవుట్లు వేసి ప్లాట్లు అమ్మేస్తున్నారు.

అనధికారిక లేవుట్ల కారణంగా 3 శాతం ఫీజు రూపంలో రావాల్సిన రూ.60 కోట్లకుపైగా నిధులు ప్రభుత్వ ఖజానాకు జమకాకుండా పోయింది. **'కూటమి' ప్రభుత్వం దృష్టి**

ప్రభుత్వ మార్కెట్ విలువ ఆధారంగా భూమార్పిడికి సంబంధించి గతంలో గ్రామాల్లోని భూములకు 2 శాతం, పట్టణాల్లో మూడు శాతం ఫీజు ఉండేది. దానిని వైకాపా ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో 5 శాతానికి పెంచింది. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి సచివాలయం, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే అవి తహసీల్దారు లాగిన్‌కు వెళ్తాయి. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆర్డీవో, సబ్ కలెక్టర్‌కు పంపుతారు. నిబంధనలకు అనుగుణంగా ఉంటే వారు ఆమోదించాలి. లేదంటే తిరస్కరించాలి. దరఖాస్తు చేసుకున్న 21 రోజుల గడువులోగా ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే అట్టి దరఖాస్తులు డీమ్డ్ అప్రూవ్డ్ అవుతాయి. దీంతో కొనుగోలు చేసిన భూములతోపాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూములు, పంట కాల్వలు, పోరంబోకు భూములు ఆటోమేటిక్‌గా రియల్టర్ల పరమవుతాయి.

# రవాణా.. కాలయాపన



ముమ్మిడివరం : ముమ్మిడివరం మండలం సోమిదేవరపాలేనికి చెందిన ఓ రైతు గత ఏడాది రబీలో తాను పండించిన 65 బస్తాల ధాన్యం సొంత వాహనంలో ఆర్ఎస్‌కే ద్వారా మిల్లుకు పంపించారు. ధాన్యంలో తేమ ఉందని.. తూకంలో తేడా వచ్చిందని.. దిగుమతి చేసుకోవడానికి నానా ఇబ్బందులు పెట్టారు. విసుగు చెందిన ఆ రైతు చివరకు దళారులకు విక్రయించాడు.

ఐ.పోలవరం మండలం కేశనకుర్రులో గత ఖరీఫ్ సీజన్‌లో బొంతు దుర్గారావు కొనుగోలు కేంద్రాన్ని సంప్రదించగా రవాణా వాహనం సమకూర్చుకోవాలని చెప్పారు. ఆ ఇబ్బందులు పడలేక గిట్టుబాటు ధర కంటే బస్తాకు రూ.200 తక్కువకు దళారులకు విక్రయించాడు. 50 బస్తాలకు రూ.10 వేల వరకు ఆయన నష్టపోవాల్సి వచ్చింది.

అన్నదాతకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. వైకాపా పాలనలో నిబంధనలు అటకెక్కించారు. మిల్లర్లు, దళారులదే పైచేయిగా నిలిచేది. కూటమి వచ్చాక గత ఖరీఫ్ సీజన్ నుంచి కొనుగోలు సులభతరం చేసింది. 48 గంటల్లో రైతులకు డబ్బులు వేస్తున్నారు. రవాణా వాహనాల విషయంలో మాత్రం మిల్లర్ల మాయ కొనసాగుతోంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం తరలింపునకు వాహనాల ఏర్పాటుపై అధికారులు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాల్సి ఉంది.

**కూటమి అధికారంలోకి వచ్చాక..**

కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో మార్పులు చేసింది. రైతులు కోరుకున్న మిల్లులకే ధాన్యం విక్రయించవచ్చు. 48 గంటల్లో ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. రవాణా వాహనాలను సమకూర్చడంలో సమస్యలను పరిష్కరిస్తే మరింత ప్రయోజనం.

**దళారులను ఆశ్రయించి..**

ఆర్ఎస్‌కేల ద్వారా రైతుల నుంచి సరకు కొనుగోలు చేసినా వాటిని మిల్లులకు తరలించడానికి వాహనాలు పంపించడం లేదు. రైతులే వాహనాలు ఏర్పాటు చేసుకోవాల్సి రావడంతో ఆ పాట్లు పడలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. ఎక్కడైనా రైతు ధైర్యం చేసి సొంతంగా వాహనంతో మిల్లులకు తరలిస్తే అక్కడ సరకు దించేందుకు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుసంబంధంగా పనిచేసే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్) ద్వారా సంచులు, హమాలీ, రవాణా వాహనాలను సమకూర్చాల్సి ఉంది. ఈ ప్రక్రియ క్షేత్ర స్థాయిలో సక్రమంగా జరగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బస్తాకు రూ.200కు పైగా తగ్గించి దళారులకు విక్రయిస్తున్నారు.

**వాహనాలు సిద్ధం చేస్తున్నాం..-ఎం.బాలసరస్వతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు**

రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రవాణా వాహనాలను ఏర్పాటు చేస్తున్నాం. రైతు సేవా కేంద్రాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను బట్టి వాహనాలు, గోనె సంచులు అందుబాటులో ఉంచుతున్నాం. ఎవరైనా రైతులు సొంతంగా వాహనాలు ఏర్పాటు చేసుకుని ఆర్ఎస్‌కేల్లో నమోదు చేసి మిల్లులకు తరలిస్తే రవాణా ఛార్జీలు చెల్లిస్తాం.

**జిల్లాలో పరిస్థితి...**

రబీలో సాగు విస్తీర్ణం: 1.64 లక్షల ఎకరాలు
దిగుబడి అంచనా: 6.17 లక్షల టన్నులు
కొనుగోలు లక్ష్యం: 3.22 లక్షల టన్నులు
ధాన్యం కొనుగోలు కేంద్రాలు: 404

# అత్యవసరమే.. కాస్త ఆలోచించండి!



కొవ్వూరు : తూర్పు గోదావరి జిల్లాలో 50 పడకలతో ఉన్న ఏకైక సామాజిక ఆరోగ్య కేంద్రం కొవ్వూరు. దీనిని ప్రాంతీయ ఆసుపత్రిగా స్థాయి పెంచుతారని పదహారేళ్లుగా ఎదురు చూస్తున్నా ఆ ప్రక్రియ పట్టాలెక్కడం లేదు. జిల్లా ఆసుపత్రిగా (150 పడకలు) తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత, అత్యవసరం ఉన్నా ఆ దిశగానూ అడుగు పడడం లేదు. ప్రజాప్రతినిధుల ప్రకటనలు, అధికారుల విశ్లేషణలు నివేదికలకే పరిమితమవుతున్నాయి. జిల్లాల పునర్విభజనతో జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి కార్యాలయం కొవ్వూరు రావడం తప్ప ఈ ఆసుపత్రికి ఒరిగిందేమీ లేదు. రెండేళ్లలో జరిగే పుష్కరాల కార్యాచరణలోనైనా జిల్లా ఆసుపత్రి కల సాకారం కావాలని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

**హంగులన్నీ ఉన్నా..**

తూర్పు గోదావరికి ప్రస్తుతం ప్రాంతీయ ఆసుపత్రి లేదు. ఒకవేళ వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఆ స్థాయి ఇవ్వాలంటే అన్ని సౌకర్యాలు, అనువైన పరిస్థితులు ఉన్నది కొవ్వూరు సీహెచ్‌సీకి మాత్రమే. 50 పడకలతో ఉన్న సేవలందించేందుకు 100 పడకలు సిద్ధంగా ఉన్నాయి. వైద్య సేవలు, పాలన, శస్త్రచికిత్సలు, ఇతర అవసరాలకు సరిపడా భవనాలు, గదులు, సువిశాల ప్రాంగణం ఉంది.

**అత్యవసర సేవల కోసం..**

కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో జాతీయ రహదారి ఉంది. నిత్యం పదుల సంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గోదావరి ఉండటంతో గల్లంతులు, ఆత్మహత్యలు, ప్రమాదాలు జరుగుతుంటాయి.

**ఆ భవనాలన్నీ ఆసుపత్రివే..**

సీహెచ్‌సీకి రెండు అంతస్తుల భవనాలు, అధునాతన రీతిలో సౌకర్యాలు ఉన్నాయి. డీసీహెచ్ఎస్ కార్యాలయ భవనం, పీపీ యూనిట్ ఇతర విభాగాలున్న భవనాలన్నీ ఆసుపత్రికి చెందినవే.

**జిల్లా స్థాయికి పెంచితే..**

కొవ్వూరు సీహెచ్‌సీకి నెలకు సుమారు 5 వేల మంది ఓపీ, 500 మంది ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఏడుగురికిగాను అయిదుగురే ఉన్నారు. జిల్లా స్థాయికి మారితే 16 మంది వస్తారు. ఇంకా అనేక మంది సమకూరడానికి అవకాశం ఉంది. ః చర్మవ్యాధులు, ఈఎన్‌టీ, మానసిక, అనస్తీషియా, రేడియాలజీ వైద్య నిపుణులు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఐసీయు, ట్రామాకేర్ వంటి పరీక్షలు, సేవలతోపాటు రక్త నిధి కేంద్రం సౌకర్యాలు ఒనగూరతాయి.

**ఇప్పటికే పలు మార్లు నివేదించారు..-** డాక్టర్ ఎం.పద్మ, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారిణి

50 పడకలతో ఉన్న కొవ్వూరు సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రికిగా మార్చాల్సిన అవశ్యకతపై గతంలో ఉన్నతాధికారులకు పలుమార్లు నివేదించాం. సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

# ఎత్తిపోతలు.. ఉత్త చేతలు

బొబ్బిలి: జిల్లాలోని మెట్ట భూములకు ఖరీఫ్‌లో కన్నీరే మిగులుతోంది. వీటిని సాగులోకి తీసుకువచ్చేందుకు తలపెట్టిన ఎత్తిపోతల పథకాలు నీరుగారిపోతున్నాయి. వీటిని గాడిలోకి తీసుకొస్తామని గత అయిదేళ్ల ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. కూటమి ప్రభుత్వంలోనైనా పథకాలపై దృష్టి పెట్టాలని రైతులు విన్నవిస్తున్నారు. తెర్లాంలోని తోటపల్లి ప్రధాన కాలువల వద్ద, బొబ్బిలి మండలం రాముడువలసలోని కాలువపై ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి గత తెదేపా హయాంలోనే దాదాపు రూ.8 కోట్లు మంజూరయ్యాయి. ఆపై వచ్చిన వైకాపా గాలికి వదిలేసింది. ఈ సమస్యను ఇటీవల ఎమ్మెల్యే బేబినాయన అసెంబ్లీలో ప్రస్తావించారు. రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద వేగావతి నది ఒడ్డున ఉన్న పథకం మూడేళ్లుగా పనిచేయడం లేదు. సుమారు 400 ఎకరాలకు ఆధారం. బీ బాడంగి మండలం వాడాడలో వేగావతి ఒడ్డున నిర్మించిన పథకం ద్వారా 200 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. నీటి లభ్యత ఉన్నా నిర్వహణ సక్రమంగా లేదు. ఎస్.కోట మండలం వేములాపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా 300 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఇది పని చేయలేదు. రైతుల ఫిర్యాదు మేరకు ఇటీవల మరమ్మతులు చేపట్టినా ప్రైవేటు పొలాల్లో విద్యుత్తు స్తంభాలు వేయడంతో వివాదం రేగి, వినియోగంలోకి రాలేదు. గజపతినగరం మండలం లింగావలస పథకం మోటార్లు తుప్పుపట్టాయి. 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాల్సి ఉన్నా.. ఏనాడూ పనిచేయలేదు. దీని పరిధిలోని రైతులు కరవు పరిస్థితులను చవిచూస్తున్నారు. ఏడొంపులగెడ్డ పరివాహకంలో నిర్మించారు. **కమిటీల ఏర్పాటు గాలికి..**

వాస్తవానికి ఆయకట్టు రైతులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతలను అప్పగించాలి. అలా చేయకుండా గాలికి వదిలేయడంతో మోటార్లు పాడవుతున్నాయి. నదుల్లోకి వరద వస్తే మోటార్లు కొట్టుకుపోతున్నాయి. ప్రభుత్వం చెల్లించాల్సిన విద్యుత్తు ఛార్జీలు బకాయి ఉన్నాయి. ఆయకట్టు కమిటీలు నిర్వహణకు అయ్యే 20 శాతం ఖర్చు భరిస్తే మిగిలిన 80 శాతం ప్రభుత్వం భరించాల్సి ఉంది. కానీ అధికారులు దీనిపై రైతులకు అవగాహన కల్పించడం లేదు.

# ఎలుకల మందు.. గుత్తేదారు విందు

కర్నూలు : " నిత్యం 3 వేల మంది ఓపీ.. మూడు వందల మంది (ఐపీ).. చికిత్స పొందుతున్న సర్వజన ఆసుపత్రిలో 428 మూషికాలు రూ.60 లక్షలు తినేశాయి.. అవును మీరు చదివింది నిజమే..!"కర్నూలు సర్వజన వైద్యశాలలో క్రిమికీటకాల నియంత్రణకు సైంటిఫిక్ శానిటేషన్ పాలసీ (ఎస్ఎస్‌పీ)ని 2015 నుంచి అమలు చేస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందే రోగులకు ఎలుకలు, దోమలు, పాముల బెడద లేకుండా చూడటమే ఎస్ఎస్‌పీ ప్రధాన లక్ష్యం. ఇందుకు ద్రావణాల పిచికారీతోపాటు ఎలుకలు, పాములు తదితరాలు రాకుండా గుత్తేదారుడు చర్యలు తీసుకోవాలి. ఫాగింగ్, స్ప్రే ట్యాంకర్ల ద్వారా ఎప్పటికప్పుడు ద్రావణాలు పిచికారీ చేస్తూ ఉండాలి. 2019 నుంచి హైదరాబాద్‌కు చెందిన సాయి సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థకు ఎస్ఎస్‌పీ నిర్వహణ బాధ్యతలను సర్వజన ఆసుపత్రి అధికారులు అప్పగించారు. సదరు గుత్తేదారు మూషికాలు పట్టుకొన్నట్లు దొంగ లెక్కలు రాసుకొని రూ.లక్షలు వెనకేసుకొంటున్నారు. గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు 428 ఎలుకలు పట్టుకున్నట్లు.. ఒక్కోదానికి రూ.14 వేలు ఖర్చు చేసినట్లు గుత్తేదారుడు చూపడం గమనార్హం.

**ప్రతి నెలా రూ.5.90 లక్షలు**

వైఎస్సార్ జిల్లాకు చెందిన వెంకటయ్య అనే ఉప గుత్తేదారుడు ఎస్ఎస్‌పీ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇందుకు ప్రతినెలా రూ.5.90 లక్షల వరకు వెచ్చిస్తున్నారు.

సిబ్బంది నిత్యం ఫాగింగ్ చేస్తుండాలి. రోగుల చెంతకు ఎలుకలు, పాములు లాంటివి రాకుండా పర్యవేక్షిస్తూ 19 రకాల మందులను వినియోగించాలి. పురుగు మందుల పిచికారీ తదితరాలను హెల్త్ ఇన్‌స్పెక్టర్ల నిర్వహణలో మధ్యాహ్నం వరకు చేయాలి.

ఆసుపత్రి అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి నిత్యం గుత్తేదారుడు అందించే సేవలకనుగుణంగా మార్కులు వేయాలి. వాటి ఆధారంగా గుత్తేదారుడికి బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.

**ఏడాదిగా పనిచేయని యంత్రం**

ఆసుపత్రి స్టోర్ గదిని పరిశీలిస్తే ఒక్క ర్యాట్‌ప్యాడ్ మాత్రమే ఉండగా ఒక లీటరు లీథల్, రెండు ప్యాకెట్ల పెస్ట్‌లో కలిపే పౌడర్ మాత్రమే ఉండటం గమనార్హం.

ఫాగింగ్ చేయాల్సిన యంత్రం ఏడాదిగా పనిచేయకపోయినా ఎవరూ పట్టించుకోలేదు. కేవలం రెండు స్ప్రే ట్యాంకర్లతో నామమాత్రంగా పిచికారీ చేయిస్తున్నారు. హెల్త్ ఇన్‌స్పెక్టరు గోవిందు మాట్లాడుతూ ఏడాదిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా.. ఇంతవరకు పురుగు మందుల స్టాక్, ర్యాట్‌ప్యాడ్స్‌ను గుత్తేదారుడు ఇచ్చిన దాఖలాలు లేవు. సిబ్బంది.. రెండు నీళ్ల ట్యాంకులతో వచ్చి శుభ్రం చేస్తున్నారన్నారు.

**రెండేళ్లుగా మొక్కుబడి సేవలు**

ఆసుపత్రి ఆవరణలో ప్రస్తుతం పలు నిర్మాణాలు జరుగుతున్నాయి. మురుగు కాల్వల వ్యవస్థ అధ్వానంగా ఉంది. రోగుల, వారి సహాయకులు ఆహార పదార్థాల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడే వేస్తున్నారు. దీంతో ఎలుకలు, దోమలు పెరిగాయి. వీటి కట్టడికి గత రెండేళ్లుగా గుత్తేదారుడు నామమాత్రంగా చేపడుతున్నారు. అయినా అధికారులు రూ.కోటికిపైగా నిధులను అప్పనంగా చెల్లించారు.

గతేడాది 428 ఎలుకలను పట్టుకున్నట్లు గుత్తేదారుడు పుస్తకాల్లో రాసినప్పటికీ అధికారుల సంతకాలేవీ లేకపోవడం గమనార్హం. ఎస్ఎస్‌పీ నిర్వహణకుగాను గుత్తేదారుడు తమ సిబ్బందికి నెలకు వేతనాల రూపంలో రూ.లక్ష, పురుగు మందులకు సుమారు రూ.30 వేలు ఖర్చు చేసి మిగిలినదంతా మిగుల్చుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. గుత్తేదారుడు బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం లేదన్న ఉద్దేశంతో గత మూడు నెలలుగా బిల్లులు ఆపేశాం. టెండరు కాలపరిమితి ముగిసిందని గుత్తేదారుడు పట్టించుకోవడం లేదు. అతడిని పిలిపించి చర్యలు తీసుకుంటామని" ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

# స్లాట్ స్వీటు

కర్నూలు : కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ సేవలకు ఆదరణ పెరుగుతోంది. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎంపిక చేసుకునే రోజుల్లో నిర్ణీత సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం స్లాట్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఈనెల 4వ తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. తొలివిడతగా జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభించారు. ఇక్కడ నిత్యం 80కిపైగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి.

**పెరిగిన ఆదాయం** కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆదాయం పెరిగింది. వైకాపా ప్రభుత్వ పాలనలో స్థిరాస్తి వ్యాపారం క్షీణించిన నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ కార్యాలయానికి రూ.59.48 కోట్ల ఆదాయమే వచ్చింది. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల కిందటరాగా.. 2024-25లో రూ.85.45 కోట్ల ఆదాయం లభించడం విశేషం. దీనిని పరిశీలిస్తే గత ఆర్థిక సంవత్సరానికన్నా



రూ.25.97 కోట్ల ఆదాయం అధికంగా వచ్చినట్లు స్పష్టమైంది. స్థిరాస్తి వ్యాపారం పుంజుకుంటున్న నేపథ్యంలో భవిష్యత్తులో స్లాట్ బుకింగ్‌కు మరింత ఆదరణ పెరిగే అవకాశాలున్నాయి.

**విస్తృత ప్రచారం**

స్లాట్ బుకింగ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కర్నూలు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్, ఉద్యోగులు వివిధ రూపాల్లో ప్రచారం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా 39 మంది ఈ విధానంలో తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. నిత్యం సగటున 9 మందిపైగా రిజిస్ట్రేషన్ చేసుకుంటన్నారు. కొత్త విధానంపై జనానికి అవగాహన లేకపోవడం.. చిన్నచిన్న సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో కొంత జాప్యం జరుగుతోంది. అతి కొద్దిరోజుల్లోనే ఇది సమసిపోతుందని అధికారులు భావిస్తున్నారు. నిర్ణీత సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకోనివారు సాయంత్రం 5.30 తర్వాత సాధారణ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుంది. లేకుంటే మళ్లీ స్లాట్ బుకింగ్ రీషెడ్యూల్ చేసుకునేందుకు అదనంగా రూ.200 చెల్లించాల్సి ఉంది. నిత్యం ఉదయం 10.30 నంచి సాయంత్రం 5.30 వరకు 72 స్లాట్లకు అనుమతి ఇస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు స్లాట్ విధానాన్ని ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు.

# ఫ్చ్.. ఇంకా బలహీనమే!

అనకాపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పౌష్టికాహారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. కోట్లు ఖర్చుచేస్తున్నాయి. అయినా పిల్లల్లో పోషకాహార లోపాలు కనిపిస్తూనే ఉన్నాయి. వయసుకు తగ్గ ఎత్తు పెరగడం లేదు. ఎత్తుకు తగ్గ బరువు ఉండటం లేదు. నెలనెలా పోషణ్ ట్రాకర్ ద్వారా పిల్లల పోషకాహార స్థితిని అంచనా వేస్తుంటారు. లోపాలను సరిదిద్దుకుని పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఈ విషయంలో గతేడాది ఆగస్టుతో పోల్చితే అల్లూరి జిల్లా కాస్తనయం అనిపించగా, అనకాపల్లి జిల్లా ఇంకాస్త వెనుకబడటం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో ఆరేళ్లలోపు చిన్నారులు 4.23 లక్షల మంది పైగా ఉన్నారు. మైదాన ప్రాంతంలో పిల్లలకు బాల సంజీవని, మన్యంలో లబ్ధిదారులకు బాలసంజీవని ప్లస్ పేరుతో పోషకాహారం అందిస్తున్నారు. అయితే ఈ ఆహారం పంపిణీ నుంచి వినియోగం వరకు సక్రమంగా జరగక పోవడంతో తల్లులు, పిల్లల్లో పోషకాహార లోపాలు వెలుగుచూస్తున్నాయి. పైగా ఆహారపు అలవాట్లు,



జీవనశైలిలో మార్పుల కారణంగా అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ఈ నివేదికలపై చర్చించారు. బరువు తక్కువ, ఎదుగుదల లోపం వంటి అంశాల్లో గతంలో కంటే అల్లూరి జిల్లా కొంత మెరుగైన ఫలితాలు సాధించినా రాష్ట్రం సగటుతో ఇంచుమించు సమానంగానే నిలవడం ఆందోళన కలిగిస్తోంది. అనకాపల్లి జిల్లాలో గతంలో కంటే పరిస్థితులు కాస్త అదుపు తప్పినట్లు స్పష్టమవుతోంది.

**ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం:** పిల్లల పోషకాహార స్థితిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వాటి లోటు భర్తీ చేయాలని వారికి అదనపు పోషకాహారం అందించేలా కుటుంబ సభ్యులకు సూచిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పోషకాహారం లబ్ధిదారులు మాత్రమే తినాలి. కొన్నిచోట్ల వారి ఆహారాన్ని కుటుంబం మొత్తం కలిసి తినడం కూడా వారి ఎదుగుదలలో లోటుపాట్లకు కారణమవుతోంది.

కె.అనంతలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్

# అనుమతులుండవ్.. అడ్డంగా కట్టేయడమే!

మునగపాక : మునగపాక మండలంలో స్థిరాస్తి వ్యాపారుల దందాకు అడ్డు, లేకుండా పోతోంది. సాగునీటి కాలువ గట్టును ఆక్రమించి లేఅవుటుగా మార్చేశారు. మునగపాక ఎన్టీఆర్ కాలనీని ఆనుకొని వంద అడుగుల వెడల్పు ఉండే అనకాపల్లి ఆవకాలువకు ఆవల ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు దారి ఏర్పాటు కోసం రెవెన్యూ, జలవనరులశాఖ అధికారుల అనుమతులు తీసుకోకుండానే నేరుగా పూడ్చి వంతెన నిర్మిస్తున్నారు. వంతెన నిర్మాణంపై ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నా సమాధానం లేదు. కాలువను పూడ్చివేసి నిర్మిస్తున్న వంతెన కారణంగా 500 గృహాలతో ఉన్న ఎన్టీఆర్ కాలనీ ముంపునకు గురయ్యే ప్రమాదముందని భాజపా, తెదేపా నాయకులు బద్దెం సూర్యనారాయణ, మొల్లేటి సత్యనారాయణ, ఆవకాలువ సాగునీటి సంఘం అధ్యక్షుడు



ఆడారి సన్యాసినాయుడు తదితరులు బుధవారం మునగపాకలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమంగా వంతెన నిర్మిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు జలవనరులశాఖ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. వర్షాకాలంలో తమ పంటపొలాలకు ముంపు ఏర్పడే ప్రమాదముందని సాగునీటి సంఘం అధ్యక్షుడు సన్యాసినాయుడు తెలిపారు. వంతెన నిర్మాణానికి అనుమతి ఇచ్చారా? అని అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించగా.. తాము ఇవ్వలేదని వారు స్పష్టం చేశారు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# కాలువ మారాలి.. కలత తీరాలి

రాజమహేంద్రవరం : వైకాపా అయిదేళ్ల పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సాగునీటి పారుదల వ్యవస్థను దశలవారీగా చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుటుంది. ఈ నెల 16 నుంచి కాలువలకు నీటి విడుదల నిలిపివేస్తున్న నేపథ్యంలో క్లోజర్‌లో చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించింది. తక్కువ సమయంలో పెద్ద పనులు చేపడితే టెండర్లు, ఇతర ప్రక్రియల వల్ల సకాలంలో పూర్తికాని పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం నిర్వహణకే ప్రాధాన్యమిచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 18 నియోజకవర్గాల్లో 972 పనులు చేపట్టేందుకు సుమారు రూ.40 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. తొలుత ఒక్కో నియోజకవర్గం నుంచి రూ.10 కోట్ల విలువైన పనులకు రూపొందించారు. సాధ్యాసాధ్యాల పరిశీలన తరువాత స్థానిక పనుల ప్రాధాన్యం ఆధారంగా నియోజకవర్గానికి రూ.2 కోట్ల వరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న సూచనల మేరకు జలవనరుల శాఖ మళ్లీ సిద్ధంచేసి పంపించింది. **సంఘాల ఆధ్వర్యంలో..** ఉమ్మడి జిల్లా పరిధిలోని కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు, స్లూయిస్‌ల నిర్వహణ, అవసరమైన ప్రాంతాల్లో కాలువల్లో పూడిక తీత చేపట్టనున్నారు. ఒక్కో పని రూ.10 లక్షలలోపు అంచనా విలువతో నిర్ణయించి, నామినేషన్ విధానంలో సాగునీటి సంఘాల ప్రతినిధుల పర్యవేక్షణలో చేపడతారు. జగన్ పాలనలో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల ఏటా కనీస నిర్వహణ పనులు సైతం జరగలేదు. ఇప్పుడు వీరి పర్యవేక్షణలోనే చేయడం వల్ల ఏడాది పొడవునా బాధ్యతాయుతంగా నిర్వహణ చేయడంతోపాటు, సమస్య ఉన్న ప్రాంతాల్లో దృష్టి సారించే అవకాశం ఉంటుంది.

# స్థలాలు పంచుకొని.. ఆస్తులు పెంచుకొని



విశాఖపట్నం : వైకాపా ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు లెక్కేలేదు. స్థానిక నాయకుల అవకతవకలకు అంతేలేదు. ఇందుకు పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలోని 'ఒక సెంటు' లేఅవుట్‌లోని కాలనీలో జరిగిన అవకతవకలే నిదర్శనం. గత ప్రభుత్వం చేసిన ఇళ్ల కేటాయింపుల్లో వైకాపా నేతలు చక్రం తిప్పి వారి అనుయాయులకు భారీగా లబ్ధి చేకూర్చారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని అర్హుల జాబితాలను మార్చేశారు. అప్పట్లో అధికారులు కళ్లుమూసుకున్నారు తప్ప పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన విజిలెన్స్ విచారణ జరిగింది. గత ప్రభుత్వంలో పెందుర్తి మండలంలో పనిచేసిన కీలక అధికారే మళ్లీ ఇక్కడికి రావడంతో అవకతవకలు బయటకు రాలేదని సమాచారం.

**ఆ లేఅవుట్‌లో:** జెర్రిపోతులపాలెం లేఅవుట్ కోసం గత ప్రభుత్వం రైతుల నుంచి 64 ఎకరాలు సమీకరించింది. ఇందులో 43 ఎకరాల్లో లబ్ధిదారులకు ఒక సెంటు/సెంటున్నర ప్లాట్లు, రైతులకు పరిహారంగా ఇచ్చేందుకు 21 ఎకరాలు కేటాయించారు. 43 ఎకరాల్లో 1,579 ప్లాట్లను సెక్టార్ ఏ, సెక్టార్ బి, సెక్టార్ సిలో అభివృద్ధి చేశారు.

**ఆక్రమించేసి..:** జెర్రిపోతులపాలెంకు సమీప ఇప్పిలవానిపాలెం పంచాయతీలో స్థానిక వైకాపా నేతలు ప్రభుత్వం అధికారికంగా కేటాయించిన స్థలానికి అదనంగా మరికొంత ఆక్రమించి ఇళ్లు నిర్మించేశారు. ఓ నేతకు సెంటున్నర స్థలం ప్లాటు కేటాయిస్తే దాని చుట్టూ నాలుగు ప్లాట్లను కలిపేసుకొని రెండు అంతస్తుల్లో భారీ నిర్మాణం చేపట్టారు. వీటిల్లో ఒకటి, రెండు ప్లాట్లను బినామీల పేరుతో రాయించుకున్నట్లు సమాచారం. మరో నేత అయిదు సెంట్లలో నిర్మించేశారు. ప్లాట్ల కబ్జాపై కొద్ది రోజుల కిందట కలెక్టరు, ఇతర అధికారులకు ఫిర్యాదులు అందినా ఎవరూ కన్నెత్తయినా చూడలేదు.

**కట్టబెట్టారు:** ఇక్కడ సుమారు రెండొందల మంది వరకు అనర్హులకు ఒక సెంటు ప్లాట్లు కట్టబెట్టారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఉన్నారు. స్థానిక నేతలను ప్రసన్నం చేసుకున్నారు. ఈ క్రమంలో డబ్బులు చేతులు మారినట్లు సమాచారం.

ఓ దరఖాస్తుదారు ప్రభుత్వ ఉద్యోగి. వారి కుటుంబానికి గ్రామంలో రెండతస్తుల ఇళ్లు రెండు ఉన్నాయి. మళ్లీ ఒక సెంటు స్థలాలు మూడు కేటాయించారు.

2018లో నాటి ప్రభుత్వం పది మందికి ఇళ్లు కేటాయించింది. మళ్లీ వారు ఒక సెంటు లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించేసుకున్నారు.

ఓ దరఖాస్తుదారు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి. ప్రభుత్వం నుంచి అతనికి ప్రతి నెలా పింఛను అందుతుంది. అదే కుటుంబానికి ఆర్‌సీసీ పైకప్పులు కలిగిన మూడు ఇళ్లున్నాయి. అయినా ఇళ్ల కేటాయింపుల జాబితాల్లో పేర్లను చేర్చారు.

మొత్తం కేటాయింపుల్లో 12 మంది వరకు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు మరో పది మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. లబ్ధిదారుల్లో సుమారు 50 మందికి గతంలోనే ఆర్‌సీసీ పైకప్పు కలిగిన రెండు, మూడు అంతస్తుల ఇళ్లున్నాయి.

# నిర్లక్ష్యపు మోత.. పంపిణీలో కోత



పుట్టపర్తి : ముదిగుబ్బ మండలంలోని 54 చౌకదుకాణాల పరిధిలో 19,238 కార్డులున్నాయి. 55శాతమే బియ్యం పంపిణీ జరిగింది. బఫర్ సమస్యతో ఈసారి కోత విధించారు. సుమారు 100 క్వింటాళ్లు తక్కువ వచ్చాయి. కార్డుదారులను వెనక్కి పంపిస్తున్నారు. ముదిగుబ్బలోని టీచర్స్ కాలనీ, సిరిగారిపల్లిలో పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాలేదు.

తాడిమర్రి మండలంలో 31 చౌక దుకాణాల పరిధిలో 10,800 కార్డులున్నాయి. ఇక్కడ 25 శాతం పంపిణీ చేయాల్సి ఉంది. దీంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

రేషన్ బియ్యం పంపిణీలో పౌరసరఫరాల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. బఫర్ పేరుతో బియ్యంలో సగానికి పైగా కోత విధిస్తున్నారు. కొన్ని చోట్ల 60 క్వింటాళ్లు ఇవ్వాల్సి ఉండగా 20 క్వింటాళ్లు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. కార్డుదారులకు బియ్యం అందకపోతే ఏమి చేయాలి? ఇచ్చిన దాంతోనే సరిచేయండి. ఆ మాత్రం మేనేజ్ చేయలేరా అంటూ కొందరు సీఎస్‌డీటీలు సమాధానాలు ఇస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం దీనిపై స్పందించడం లేదు. ఏదైనా ఉంటే మీరు, మీరు చూసుకోండి అంటూ చేతులు సలహాలు ఇస్తున్నారు. జిల్లాలకు అవసరమైన మేర బియ్యం చేరలేదా? ఎంఎల్ఎస్ పాయింట్లకు తక్కువగా ఇచ్చారా? లేదంటే పంపిణీలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అసలు బఫర్ పేరుతో కోత ఎందుకు విధిస్తున్నారు అనే ప్రశ్నలపై సమాధానం దాటవేస్తున్నారు.

**ప్రజాప్రతినిధులు ఆగ్రహించినా...**

బియ్యంలో కోత విధించడంతో ప్రజాప్రతినిధులు కలగజేసుకోవాల్సి వచ్చింది. కళ్యాణదుర్గం, రాయదుర్గం, రాప్తాడు, అనంతపురం ఎమ్మెల్యేలు పౌరసరఫరాల అధికారులను పిలిపించి మాట్లాడారు. వారికి కూడా అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదు. కంటితుడుపు చర్యగా కొన్ని దుకాణాలకు మాత్రమే సర్దుబాటు చేశారు. మిగిలిన చోట్ల సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై ప్రజాప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదని తెలుస్తోంది. ఎమ్మెల్యేలంతా కలిసి విషయాన్ని ఇరు జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులతో పాటు పౌరసరఫరాల శాఖ మంత్రికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# ఫైబర్‌నెట్.. సేవలు ఫట్




అచ్యుతాపురం : ఫైబర్ కనెక్షన్ ఎప్పుడు పనిచేస్తుందో? ఎప్పుడు ఆగిపోతుందో? తెలియదు. సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉన్నారా? లేదా? వినియోగదారులు ఫోన్లు చేసి అడుగుతున్నారు? ఎప్పుడు వస్తుందో? దయచేసి చెప్పండి ఇదే విషయం వారికి నచ్చచెబుతాం. కొందరు ఫోన్ చేసి మండిపడుతున్నారు. ఇది మాడుగుల కేబుల్ నిర్వాహకుడు వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన సందేశం

రెండు నెలలుగా క్షేత్రస్థాయి సిబ్బందికి వేతనాలు ఇవ్వలేదు. రాకపోకలు సాగించడానికి కనీసం ఛార్జీలను సైతం చెల్లించడం లేదు. అందుకే ఎటువంటి సమస్య ఎదురైనా వారు పట్టించుకోవడంలేదు. కేబుల్ సేవలు ఎప్పుడు పనిచేస్తాయో? చెప్పే వారు లేరు. ఇదే విషయాన్ని వినియోగదారులకు తెలియజేయండి.

**ఇది మరో ఆపరేటర్ ఆవేదన** జిల్లాలో ఫైబర్ సేవలు అధ్వానంగా మారాయి. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లు ఈ సేవలను నిర్లక్ష్యం చేసింది. విశాఖ జిల్లాలో 95 వేల మంది వినియోగదారులు అవస్థలకు గురవుతున్నారు. సామాన్యులకు సైతం అంతర్జాలం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఫైబర్‌నెట్ సేవలను ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. కేవలం రూ. 250లకే అన్ని ప్రైవేటు టీవీ ఛానళ్లతో పాటు 10 ఎంబీపీఎస్ వేగంతో పరిమితి లేని అంతర్జాలం అందించింది. తక్కువ ధరకే టీవీ, నెట్ అందుబాటు లోకి రావడంతో పల్లె జనాలు, విద్యార్థులు ఈ కనెక్షన్లు పొందడానికి ఉత్సాహం చూపారు. ఫైబర్ నెట్ ధరలు ప్రైవేటు సంస్థల కంటే తక్కువగా ఉండడం, నెట్‌తోపాటు టీవీ ఛానళ్లు రావడంతో దీనిని పొందడానికి పట్టణ, గ్రామీణ ప్రజలు ఆసక్తి చూపించారు. కొత్త కనెక్షన్లు ఇవ్వాలని కేబుల్ ఆపరేటర్లను కోరుతున్నా ఇప్పుడు ఉన్నవారికే సేవలు అందించలేకపోతున్నామని ఆపరేటర్లు చేతులెత్తేస్తున్నారు.

**ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరు:** సేవలపై ఎన్నిసార్లు చెప్పినా ఉపయోగం లేదు. ఎప్పుడు వస్తుందో? ఎప్పుడుపోతుందో? తెలియడంలేదు. వినియోగదారుల నుంచి ప్రతినెల డబ్బులు వసూళు చేస్తున్నామే తప్ప పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నాం. కష్టమర్‌కేర్ ఫోన్ చేసినా ప్రయోజనం లేదు. గతంలో వచ్చే ఉచిత ఛానెన్లు ఇప్పుడు రావడంలేదు. ఆడారి శివ, కేబుల్ ఆపరేటర్, తిమ్మరాజుపేట**కేబుల్ సేవలు గాల్లో దీపం:** అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనిపై కనీసం పర్యవేక్షణ లేదు. ఉగాది రోజున సాయంత్రం 5 గంటలకు పోయి 48 గంటల తరవాత వచ్చింది. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి. శరగడం శ్రీను, కేబుల్ ఆపరేటర్, హరిపాలెం

# పిల్ల కదలదు.. సాగు పెరగదు

కాకినాడ : వరుసగా వెంటాడుతున్న ప్రతికూల పరిస్థితులు ఆక్వా పరిశ్రమను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వ్యాధులు.. పడిపోతున్న ధరలు.. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో సతమతమవుతుండగా.. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల దెబ్బ మరింత కుంగదీస్తోంది. ఆ దేశానికి ఎగుమతి అవుతున్న సముద్ర ఉత్పత్తుల్లో 90 శాతం రొయ్యలే. విదేశీ సుంకం పెంచేయడంతో ఎగుమతులు తగ్గి ఈ ప్రభావం పరోక్షంగా హేచరీలపై పడింది. మార్కెట్లో ప్రతికూలతతో రైతులు రొయ్య పిల్లలు కొని సాగుకు వెనుకాడుతున్నారు. దీంతో చిన్న హేచరీలు మూసేసే పరిస్థితి నెలకొంది.

**అనిశ్చితితో సంక్షోభం..**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆక్వా సాగు 21,103 హెక్టార్లలో ఉంది. రైతులు 1,03,003 మంది ఉన్నారు. రొయ్యల హేచరీలు 201, ప్రాసెసింగ్ యూనిట్లు 13, ఫీడ్ మిల్లులు 4 ఉన్నాయి. వీటి ద్వారా 3 లక్షల మందికి ఉపాధి దక్కుతోంది. ఆక్వా సంక్షోభం



వీరందరిపైనా ప్రభావం చూపుతోంది. నాలుగు లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తికి అవసరమయ్యే రొయ్య విత్తనాన్ని (ఆక్వా సీడ్) మన హేచరీలు అందిస్తున్నాయి. పీఎల్ 12 (పోస్టు లార్వా) పిల్లలను చెరువులో వేస్తారు. 12 రోజుల పిల్లలను నాలుగు నెలలు పెంచుతారు. 0.25 మిల్లీ గ్రాముల రొయ్య పిల్ల.. 20 నుంచి 25 గ్రాముల వరకు ఎదిగాక ఎగుమతి చేస్తారు. మార్కెట్లో ధరలేక సాగుకు రైతులు రావడంలేదు. దీంతో రొయ్య పిల్లల ఉత్పత్తి తగ్గింది. ఎగుమతులు తగ్గి హేచరీల యజమానులు ఉత్పత్తి తగ్గిస్తే.. కార్మికుల పనిగంటలు తగ్గిపోతాయి. చెరువుల నిర్వహణ, హేచరీల్లో పనులకు వచ్చే లక్షల మంది కార్మికులు ఇబ్బందిపడే పరిస్థితి రానుంది.

# రొయ్య విత్తనం.. సుంకాల పెత్తనం

కాకినాడ : వరుసగా వెంటాడుతున్న ప్రతికూల పరిస్థితులు ఆక్వా పరిశ్రమను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వ్యాధులు.. పడిపోతున్న ధరలు.. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో సతమతమవుతుండగా.. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల దెబ్బ మరింత కుంగదీస్తోంది. ఆ దేశానికి ఎగుమతి అవుతున్న సముద్ర ఉత్పత్తుల్లో 90 శాతం రొయ్యలే. విదేశీ సుంకం పెంచేయడంతో ఎగుమతులు తగ్గి ఈ ప్రభావం పరోక్షంగా హేచరీలపై పడింది. మార్కెట్లో ప్రతికూలతతో రైతులు రొయ్య పిల్లలు కొని సాగుకు వెనుకాడుతున్నారు. దీంతో చిన్న హేచరీలు మూతపడే పరిస్థితి నెలకొంది.

**అనిశ్చితితో సంక్షోభం..**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆక్వా సాగు 21,103 హెక్టార్లలో ఉంది. రైతులు 1,03,003 మంది ఉన్నారు. రొయ్యల హేచరీలు 201, ప్రాసెసింగ్ యూనిట్లు 13, ఫీడ్ మిల్లులు 4 ఉన్నాయి. వీటి ద్వారా 3 లక్షల మందికి ఉపాధి దక్కుతోంది. ఆక్వా సంక్షోభం వీరందరిపైనా పడుతోంది. నాలుగు లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తికి అవసరమయ్యే రొయ్య విత్తనాన్ని (సీడ్) మన హేచరీలు అందిస్తున్నాయి. పీఎల్ 12 (పోస్టు లార్వా) పిల్లలు చెరువులో వేస్తారు. 12 రోజుల పిల్లలను నాలుగు నెలల పాటు పెంచుతారు. 0.25 మిల్లీ గ్రాముల రొయ్య పిల్ల.. 20 నుంచి 25 గ్రాముల వరకు ఎదిగాక ఎగుమతి చేస్తారు. మార్కెట్లో ధరలేక సాగుకు రైతులు రావడంలేదు. దీంతో రొయ్య పిల్లల ఉత్పత్తి తగ్గింది. ఎగుమతులు తగ్గి హేచరీల యజమానులు ఉత్పత్తి తగ్గిస్తే.. కార్మికుల పనిగంటలు తగ్గిపోతాయి. చెరువుల నిర్వహణ, హేచరీల్లో పనులకు వచ్చే లక్షల మంది కార్మికులు ఇబ్బందిపడే పరిస్థితి రానుంది.

30 శాతం నిలిచిపోయాయి– ఎస్.హరినారాయణరావు, వైస్ ఛైర్మన్, కాకినాడ జిల్లా హేచరీస్ అసోసియేషన్

అమెరికా సుంకాల ప్రభావం ఆక్వా మార్కెట్‌పై పడింది. ధర పలుకుతుందా..? లేదా..? అనే అనిశ్చితి. ఈ ప్రభావం పరోక్షంగా హేచరీలపై ఉంటుంది. 30 శాతం చిన్న హేచరీలు నిలిచిపోయాయి. ఒక్కో హేచరీపై 40 మంది బతుకుతున్నారు. వీరికి పనులు కష్టమే. సరైన ధర లేక, ఎగుమతుల్లేక ఇబ్బంది పడుతున్న రైతులు కొద్ది రోజులుగా సీడ్ కొనేందుకు వెనుకంజ వేస్తున్నారు. పరిస్థితులు చక్కదిద్దేలా ప్రభుత్వం చొరవచూపాలి.

# ప్రచారం.. ప్రాణాలు పణం

రావులపాలెం : ప్రధాన కూడళ్లలో ఏడాది పొడవునా ఏదో ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్నారు. రాజకీయ, పుట్టినరోజు, వర్ధంతి, ఇతర సందర్భాల్లోనూ ఎక్కడికక్కడ వెలుస్తున్నాయి. వీటి కారణంగా గొడవలు సైతం జరుగుతున్నాయి. రహదారి చెంత ఏర్పాటు చేయడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. కోనసీమ ముఖద్వారం రావులపాలెం కూడలి. ఈ ప్రాంతం మీదుగానే అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. స్థానిక కళా వెంకట్రావు కూడలిలో నిత్యం పది, పదిహేను ఫ్లెక్సీలు ఉంటున్నాయి. మడికి నుంచి గోపాలపురం వరకు జాతీయ రహదారి వెంబడి, కొత్తపేట కూడలి నుంచి అమలాపురం వరకు ప్రధాన రహదారిపై పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

**గాలులకు చిరిగిపోయి..**

ఆకట్టుకునే విధంగా ఫ్లెక్సీలు పెట్టడం వల్ల రహదారిపై ప్రయాణించే వారు వాటిని చూస్తూ ప్రయాణాలు చేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా కూడళ్లలో గత మూడు నెలల కాలంలో సుమారు 50 నుంచి 60 వరకు చిన్నాపెద్దా ప్రమాదాలు చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో పరిస్థితి తీవ్రతను తెలుసుకోవచ్చు.

**అనుమతులు లేకుండానే..**

ఎక్కడైనా ఫ్లెక్సీ పెట్టాలంటే ముందుగా ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీ అనుమతి తీసుకోవాలి. నిబంధనల ప్రకారం నగదు చెల్లించాలి. ఎక్కడా ఇది అమలు కావడం లేదు. రాజకీయ నాయకుల ప్రమేయంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వీటి ఏర్పాటుపై కేసులు నమోదైన సంఘటనలు కూడా ఉన్నాయి. దీనిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని డీఎల్పీవో రాజు తెలిపారు.

# సితార వైట్ లెహంగా వైబ్స్

సితార ఘట్టమనేని.. పరిచయం అవసరం లేని పేరు. సూపర్ స్టార్ మహేష్ వారసురాలిగా సితారకు ఉన్న గుర్తింపు అంతా ఇంతా కాదు. అయితే నెమ్మదిగా తండ్రి చాటు బిడ్డ అనే తెరల్ని తొలగించడంలోను సితార ప్రతిభను, ఆకర్షణను ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారు. ఇటీవల పాపులర్ బ్రాండ్లు పోటాపోటీగా సితారతో ప్రచారం చేయించుకునేందుకు ముందుకు వస్తున్నాయి అంటే దాని అర్థం అందం, ఆకర్షణ, క్యూట్ నెస్ లో 12 ఏళ్ల సితార తమ ఉత్పత్తి ప్రచారానికి సరైన ఎంపిక అని కార్పొరెట్ కంపెనీలు భావిస్తుండటమే. ఇప్పటికే పలు వస్త్ర దుకాణాల ప్రచారంలో తన తండ్రి మహేష్ తో కలిసి సితార ఘట్టమనేని కనిపిస్తోంది. అందుకు సంబంధించిన ప్రకటన ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. బాలనటిగా ఇప్పటికే తన తండ్రితో కలిసి కనిపించింది. చాలా చిన్న వయసులో సితార ప్రతిభ



అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సితార ఫ్యాషన్ ఎంపికలు, ఆత్మవిశ్వాసం ఎంతో గొప్పవి అనడంలో ఎలాంటి సందేహం లేదు. తాజాగా సితార వైట్ లెహంగాలో కనిపించిన ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోగ్రాఫ్స్ లో సితార ఎంతో ముచ్చటగా సాంప్రదాయబద్ధంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఫోటోషూట్ లో తన అందమైన చిరునవ్వుతో తండ్రి మహేష్ ని గుర్తు చేస్తోంది. సితార వయసుకు తగ్గ పరిణతితో బ్రాండ్స్ ప్రపంచాన్ని ఏలడం ఖాయమనడానికి ఇది సింబాలిక్. నేటి జెన్ జెడ్ కిడ్స్‌లో ఎంతో యాక్టివ్ గా ఉండే సితార మహేష్ నటవారసురాలిగా లెగసీని ముందుకు తీసుకెళుతుందని అభిమానులు భావిస్తున్నారు. కింగ్ ఖాన్ షారూఖ్ వారసురాలు సుహానా తరహాలోనే నటనలో అడుగుపెట్టాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. అయితే దీనిపై నమ్రత, మహేష్ ల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంటుంది. సితార ప్రస్తుతం తన అకడమిక్ స్టడీస్ ని పూర్తి చేస్తోంది.

# రొమాంటిక్ బ్యూటీకి ఇదే చివరి అవకాశం..!

రొమాంటిక్ బ్యూటీ కెతిక శర్మ టాలెంట్ అందరికీ తెలిసిందే. తన డబ్ స్మాష్ వీడియోలతో అలరించిన ఈ బ్యూటీ పూరీ నిర్మించిన రొమాంటిక్ సినిమా ఛాన్స్ అందుకుంది. ఆ సినిమాతో ఎంట్రీ బాగానే దొరికినా ప్రాజెక్ట్ అంతగా సక్సెస్ అవ్వలేదు. ఐతే కెతిక గ్లామర్ షోకి కుర్రాళ్లు ఫిదా అయ్యారు. రొమాంటిక్ తర్వాత నాగ శౌర్యతో ఒక సినిమా చేసిన కెతిక ఆ సినిమాతో కూడా ఫెయిల్యూర్ ఫేస్ చేసింది. రెండు ఫ్లాపులు పడగానే టాలీవుడ్ లో ఛాన్స్ లు రావడం కొద్దిగా కష్టమే. అందుకే కెతిక శర్మ కాస్త వెనకపడింది. వైష్ణవ్ తేజ్ తో రంగ రంగ వైభవంగా కూడా మెప్పించలేదు. తర్వాత సాయి తేజ్ తో బ్రో సినిమా చేసిన ఈ అమ్మడు లేటెస్ట్ గా శ్రీవిష్ణు తో సింగిల్ సినిమాలో నటించింది. ఈ సినిమాలో ఇవానా కూడా మరో హీరోయిన్ గా చేసింది. ఓ పక్క తాను ఎంత



గ్లామర్ షో చేసి యూత్ ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తున్నా కూడా కెతికకు సరైన ఛాన్స్ లు రావట్లేదు. ఐతే శ్రీవిష్ణు సింగిల్ సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకుంది అమ్మడు. శ్రీవిష్ణు సినిమాలు అన్నీ ఆడియన్స్ కి మంచి ఎంటర్టైన్మెంట్ అందిస్తాయి. అలాంటి సినిమాలో కెతిక కూడా భాగమైంది. రీసెంట్ గా నితిన్ చేసిన రాబిన్ హుడ్ సినిమాలో కెతిక స్పెషల్ సాంగ్ చేసింది. అదిదా సర్ ప్రైజు అంటూ సాంగ్ తో అలరించింది కెతిక శర్మ. హీరోయిన్ గానే కాదు ఎలాంటి ఛాన్స్ వచ్చినా వదలకూడదని ఫిక్స్ అయ్యింది అమ్మడు. కెతిక శర్మ లోని గ్లామర్ ని పర్ఫెక్ట్ గా వాడుకుంటే సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది. కానీ ఎందుకో ఆ అటెంప్ట్ ఎవరు చేయట్లేదు. కెతిక లాంటి అందాల భామలు చేస్తున్న ప్రయత్నాలు సక్సెస్ అయితేనే తెర మీద గ్లామర్ షోని చూసే ఛాన్స్ ఉంటుంది. రొమాంటిక్ సినిమాతో కెరీర్ మొదలు పెట్టిన కెతిక ఇప్పటివరకు సూపర్ హిట్ కొట్టిన సినిమా లేదు. అయినా సరే మళ్లీ మళ్లీ ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఒక స్టార్ హీరోయిన్ అవ్వాల్సిన మెటీరియల్ అయినా కూడా కెతిక ఇప్పటికీ ఇంకా ఒక స్టార్ ఇమేజ్ తెచ్చుకోవడం కోసం ప్రయత్నిస్తుంది. ఐతే రాబోయే రోజుల్లో అయినా అమ్మడికి అలాంటి సూపర్ హిట్ సినిమా పడాలని ఆడియన్స్ కోరుతున్నారు.




# విడాకుల తర్వాత ఐటమ్ నంబర్లతో దులిపేసారు



గ్లామర్ ఇండస్ట్రీలో కథానాయికలు హద్దులు చెరిపేసి బోల్డ్ పెర్ఫామెన్సెస్ తో చెలరేగాలి. మడికట్టుకుని కూచుంటే ఇక్కడ పనవ్వదు. లీగ్ లో దూసుకెళ్లడం కుదరదు. ఇది చాలామంది కథానాయికల ప్రత్యక్ష అనుభవం. ఇటీవల యానిమల్, గుడ్ న్యూజ్ లాంటి చిత్రాల్లో తనదైన గ్లామర్ డోస్ తో గుబులు పుట్టించిన ట్రిప్తి దిమ్రీ ప్రియుడితో బ్రేకప్ తర్వాతే బెటర్ కెరీర్ ని ఆస్వాధిస్తోంది. ఇటీవల వరుస అవకాశాలతో కెరీర్ పరంగా ఎంత బిజీగా మారిందో తెలిసిందే. ట్రిప్తి మాత్రమే కాదు.. సినీరంగంలో ఎదగాలనుకునే యంగ్ గాళ్స్ చాలామంది ఆరబోతతో ప్రయోజనాలను స్వయంగా సంగ్రహించారు. అయితే పెళ్లయిన కథానాయికలకు ఈ విషయంలో అంతగా వెసులుబాటు ఉండదు. భర్త, అత్తమామల నుంచి కొన్ని కట్టుబాట్లు అడ్డంకిగా మారతాయి. సనాతన భారతదేశంలో కోడలుపై అధికారం కొన్నిట్లో ఇబ్బందికరమైనది. కానీ విడాకులయ్యాక మాత్రం సదరు కథానాయికలకు ఫ్యామిలీ ఒత్తిళ్లు పని చేయవు. స్వయం కట్టుబాట్లు మినహా ఎదుటివారి అజమాయిషీలో ఎలాంటి కట్టుబాట్లు అడ్డంకిగా ఉండవు. బోల్డ్ కంటెంట్ ని ఎంచుకోవడానికి, అందాల ప్రదర్శనకు చిక్కులేవీ ఉండదు గనుక, ఇటీవలి కాలంలో విడాకుల తర్వాత ఐటమ్ నంబర్లతో చెలరేగిన కథానాయికల జాబితాను పరిశీలిస్తే.. అమలాపాల్, సమంత, ధనశ్రీ వర్మ లాంటి కథానాయికల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తమిళ దర్శకుడు, భర్త విజయ్ నుంచి విడిపోయిన తర్వాత అమలాపాల్ బోల్డ్ పాత్రలతో తమిళ ఇండస్ట్రీని షేక్ చేసింది. అమలా నటించిన చాలా తమిళ చిత్రాలు తెలుగులోను అనువాదమై ఆకట్టుకున్నాయి. అమలాపాల్ బ్రేకప్ తర్వాత గ్లామర్ ఎలివేషన్ లో మరింతగా చెలరేగిపోయింది. ప్రయోగాత్మక పాత్రలతోను టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయింది. ఆ తర్వాత నాగచైతన్య నుంచి విడిపోయిన స్టార్ హీరోయిన్ సమంత ఊ అంటావా.. లాంటి స్పెషల్ సాంగ్ తో ఉగ్రరూతలూగించింది. ఈ పాటలో సమంత పొట్టి దుస్తులు, థై స్లిట్ ఎలివేషన్, గుబులు రేపే అందాల ప్రదర్శన ప్రధానంగా చర్చకు వచ్చాయి. పుష్ప చిత్రం బాక్సాఫీస్ కలెక్షన్లకు ఈ పాట కూడా అదనంగా కలిసొచ్చింది. ఫ్యామిలీమ్యాన్ 2, సిటాడెల్ -హనీబన్నిలో సమంత గ్లామరస్ లుక్స్, పెర్ఫామెన్స్ కి యూత్ ఫిదా అయిపోయింది. మునుపటితో పోలిస్తే ఫ్లెక్సిబుల్ గా కనిపించింది సామ్. ఇప్పుడు లేడీ కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మ క్రికెటర్ చాహల్ నుంచి విడిపోయాక చెలరేగి ప్రత్యేక గీతాల్లో నర్తిస్తోంది. దిల్ రాజు బ్యానర్‌లో ఆకాశం దాటి వస్తావా? అనే డ్యాన్స్ బేస్డ్ సినిమాకి సంతకం చేసిన ధనశ్రీ, బాలీవుడ్ లో రాజ్ కుమార్ రావు చిత్రంలో ఐటమ్ నంబర్ లో నర్తిస్తోంది. భర్త నుంచి విడాకులు తీసుకున్న తర్వాత ధనశ్రీ సినిమాల్లో బిజీ అయిపోయింది. తెలుగు, తమిళం, హిందీ చిత్రాలకు చకచకా సంతకాలు చేస్తోంది. ఐటమ్ నంబర్‌లో అవకాశం వచ్చినా వదిలిపెట్టడం లేదు. రాజ్ కుమార్ రావు- వామిక గబ్బి నటిస్తున్న భూల్ చుక్ మాఫ్ చిత్రంలో ధనశ్రీ వర్మ స్పెషల్ సాంగ్‌లో అదరగొట్టనుంది. ఈ పాట చిత్రీకరణకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఇప్పటికే ఇంటర్నెట్ లో వైరల్ అయ్యాయి. ధనశ్రీ చెలరేగి అందాల్ని ప్రదర్శించిన ఫోటోలు జోరుగా వైరల్ అవుతున్నాయి.

# దసరాకి వాళ్లు రెడీ అవుతున్నారా?



దసరా సీజన్ అంటే స్టార్ హీరోల సినిమాలు సహజం. ఇప్పటికే నటసింహ బాలకృష్ణ- మెగాస్టార్ చిరంజీవి దసరా బరిలో ఉన్నట్లు కనిపిస్తుంది. బాలయ్య 'అఖండ 2 శివతాండవం'తో విధ్వంసం సృష్టించడానికి రెడీ అవుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆ సీజీన్ మిస్ కాకూడదని స్ట్రాంగ్ గా ఫిక్సై పని చేస్తుంది టీమ్. సరిగ్గా ఇదే సమయంలో చిరు 'విశ్వంభర' కూడా అదే సీజన్ ఎన్ క్యాష్ చేసుకోవాలని చూస్తుంది.

ఎలాగూ ఆలస్యమైంది. కొన్ని నెలలు అగితే మంచి సీజన్ దొరుకుతుందని దసరా కోసం వెయిట్ చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. వీళ్లిద్దరితో పాటు తాజాగా మరో ముగ్గురు స్టార్ హీరోలు కూడా పోటీగా బరిలోకి దిగడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం. ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శతకత్వంలో రాజాసాబ్ షూటింగ్ నత్తనడకన సాగు తున్న సంగతి తెలిసిందే. చిత్రీకరణ ముగింపు దశకు చేరుకన్న నేపథ్యంలో దసరా వరకూ పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి రిలీజ్ చేస్తే బాగుంటుందనే ఆలోచనలో ఉన్నారుట యూవీ నిర్మాతలు.

1అలాగే కోలీవుడ్ స్టార్ ధనుష్ నటిస్తోన్న ఇడ్లీ కడై ఇప్పటికే రిలీజ్ అవ్వాలి. కానీ అనివార్య కారణాలతో వాయిదా పడటంతో ధనుష్ కూడా దసరా అయితే బాగుంటుందని టీంతో డిస్కషన్స్ చేస్తున్నాడుట. అక్టోబర్ 1న రిలీజ్ చేస్తే బాగుంటుందని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. అలాగే కన్నడ స్టార్ రిషబ్ శెట్టి స్వీయా దర్శకత్వంలో కాంతార చాప్టర్ 1- తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని కూడా దసరాకే రిలీజ్ చేయాలని ఫిక్స్ అయ్యారట. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న రిలీజ్ చేయాలని ఆ తేదీని పరిశీలిస్తున్నారుట.

బాలయ్య సినిమా తొలుత సెప్టెంబర్ అను కున్నారు. కానీ దసరా ముందు పెట్టుకుని సెప్టెంబర్ ఎందుకని పున పరిశీలించి దసరాకి ఫిక్సైనట్లు తెలుస్తోంది.

# వింటేజ్ లుక్‌లో దివి అందాల మాయ

టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దివి సోషల్ మీడియాలో తరచూ డిఫరెంట్ ఫోటోలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. ముఖ్యంగా ఆమె ట్రెడిషనల్ లుక్స్ లో చాలా అందంగా ఉంటుందని ఫ్యాన్స్ పాజిటివ్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. ఇక లేటెస్ట్ గా షేర్ చేసిన వింటేజ్ స్టైల్ ఫోటోషూట్ ఫ్యాన్స్ ను ఎంతగానో ఆకట్టుకుంటోంది. తెల్లని షర్ట్, బ్లాక్ ప్యాంట్ లో వింతగా సస్పెండర్స్ ధరించిన లుక్ లో డివి ఎంతో ఎలిగెంట్ గా, స్టైలిష్ గా కనిపిస్తోంది. వింటేజ్ లుక్ కి తగ్గట్టుగా ఆమె ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఈ ఫోటోలు కాస్త సీరియస్ గానూ, కాస్త స్టైలిష్ గానూ, దివి విభిన్న మూడ్ లను చూపిస్తున్నట్లు ఉన్నాయి. దివి మొదట మోడలింగ్ రంగంలో ప్రవేశించి అక్కడ నుంచి టెలివిజన్, వెబ్ సిరీస్ ద్వారా గుర్తింపు పొందింది. 'బిగ్ బాస్' రియాలిటీ షో ద్వారా ఆమెకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ వచ్చింది. ఆ తర్వాత సినిమాల్లో కూడా చిన్న చిన్న అవకాశాలు అందుకుని తనకంటూ



ఒక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. దివి ప్రత్యేకత ఏమిటంటే, ఆమె ఎప్పుడూ గ్లామర్ మాత్రమే కాదు, తన నటనతో కూడా ఆకట్టుకోవాలని కష్టపడుతుండటం. ఈ ఫోటోషూట్ లో దివి మరింత రిఫ్రెష్ గా, కొత్తగా కనిపిస్తోంది. సింపుల్ మేకప్, నేచురల్ హెయిర్‌స్టైల్ తో ఆమె అందం మరింత నిండుగా కనిపిస్తోంది. అభిమానులు ఈ ఫోటోలు చూసి "సూపర్ లుక్", గ్లామర్ క్వీన్.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు. దివి తరచూ సోషల్ మీడియాలో ఇలా కొత్త కొత్త లుక్స్ తో అభిమానులకు కనువిందు చేస్తూ ఉంటుంది. ప్రస్తుతం దివి పలు ఓటీటీ ప్రాజెక్టులు, ఈవెంట్ హోస్టింగ్, వెబ్ కంటెంట్ తో బిజీగా ఉంది. త్వరలోనే ఆమె ఓ కొత్త సినిమా ప్రకటన ఇవ్వనున్నట్టు టాక్. దివి గ్లామర్ ఫోటోషూట్స్ లోనే కాదు, తన వర్క్ కి డెడికేషన్ చూపిస్తూ క్రమంగా ఎదుగుతూ వస్తోంది. ఈ ఫోటోలు చూస్తే మాత్రం మరోసారి ఆమె ఎంతగా ట్రెండీగా ఆత్మవిశ్వాసంగా ఉంటుందో తెలుస్తుంది. మొత్తం గా ఈ వింటేజ్ లుక్ లో డివి ఫ్యాషన్ మరియు క్యూట్ ఎటిట్యూడ్ రెండింటినీ చూపిస్తూ ఫాలోవర్ల గుండెల్లో దూసుకెళ్లింది. ఇక ఆమె తదుపరి ప్రాజెక్ట్స్ ఏ విధంగా ఉంటాయో చూడాలి.

# ముద్దుగుమ్మకు యుద్ధ భయం..!

బాలీవుడ్ హీరోయిన్ వాణి కపూర్ తాజాగా 'రైడ్ 2' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అజయ్ దేవగన్‌తో కలిసి నటించిన రైడ్ 2 బాక్సాఫీస్ డీసెంట్ ఓపెనింగ్స్‌ను దక్కించుకుంది. ఇతర స్టార్ హీరోల సినిమాలతో పోల్చితే రైడ్ 2 సినిమా పర్వాలేదు అన్నట్లుగా మంచి వసూళ్లు సొంతం చేసుకుంటుంది. ఈ సినిమా లాంగ్ రన్‌లో రూ.100 కోట్ల వసూళ్లు దక్కించుకోవడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వాణి కపూర్ కెరీర్‌లో చాలా కాలం తర్వాత ఒక హిట్ పడ్డట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తెలుగులో కెరీర్ ఆరంభించి దశాబ్ద కాలం దాటింది. అయినా కూడా ఇప్పటి వరకు ఆఫర్ల కోసం ఈమె ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. సౌత్ లో సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపించని ఈమె బాలీవుడ్‌లో మాత్రం వచ్చిన ప్రతి ఆఫర్‌ను సద్వినియోగం చేసుకునేందుకు సాధ్యం అయినంత వరకు ప్రయత్నాలు చేస్తుంది. హృతిక్ రోషన్‌తో కలిసి నటించిన వార్ సినిమా భారీ విజయాన్ని



సొంతం చేసుకున్న కారణంగా బాలీవుడ్‌లో ఈమె బిజీ అవుతుందని అంతా భావించారు. కానీ ఈమెకు ఆశించిన స్థాయిలో ఆఫర్లు దక్కలేదు. ముందు ముందు అయినా వరుసగా సినిమా ఆఫర్లు వస్తాయని ఈ అమ్మడు ఆశతో ఎదురు చూస్తుంది. రైడ్ 2 తో పాటు ఈమె నటించిన అబీర్ గులాల్ సినిమా విడుదలకు రెడీ అవుతుంది. అయితే ఆ సినిమా విడుదల విషయంలో అనుమానాలు నెలకొన్నాయి.మే 9న అబీర్ గులాల్ సినిమా రిలీజ్ కావాల్సి ఉంది. ఇప్పటికి సినిమా విడుదల వాయిదా వేయలేదు. కానీ సినిమా విషయంలో తీవ్రమైన వివాదం నెలకొంది. ఇండియన్ సినిమా అయినప్పటికీ పాకిస్తాన్ నటుడు పవాద్ ఖాన్ నటించిన సినిమా కావడంతో బ్యాన్ చేయాలంటూ చాలా మంది డిమాండ్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో ప్రస్తుతం ఈ విషయమై ప్రముఖంగా చర్చ జరుగుతోంది. కొందరు ఈ సినిమాకు మద్దతు తెలుపుతున్నారు. ప్రకాష్ రాజ్ ఈ సినిమా కు మద్దతుగా మాట్లాడిన విషయం తెల్సిందే. సినిమా విడుదలను అడ్డుకోవద్దు. ప్రేక్షకులు సినిమాను చూడాలా? వద్దా? అనేది నిర్ణయించుకుంటారు అన్నాడు. రైడ్ 2 సినిమా హిట్ కావడంతో అబీర్ గులాల్ సినిమా కూడా హిట్ అయితే వాణీ కపూర్ బాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. కానీ పాకిస్తాన్ నటుడు సినిమాలో ఉండటం ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. ఇండియా పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. యుద్ధం జరగడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. దీంతో పాకిస్తాన్ నటుడు నటించిన సినిమాను కచ్చితంగా విడుదల కానివ్వరు. ఒకవేళ విడుదల చేసినా కూడా కచ్చితంగా సినిమాకు తిరస్కరణ తప్పదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇప్పుడు ఇదే విషయం వాణీ కపూర్‌ను టెన్షన్ పెడుతుంది అంటూ ఆమె సన్నిహితులు చెబుతున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536